thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 87 కరీంనగర్ శుక్రవారం, 6 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## పాక్‌కు ఆసియా బ్యాంకు 6,869 కోట్ల సాయం!

న్యూఢిల్లీ : పాకిస్థాన్‌కు అంతర్జాతీయ రుణ సంస్థలు ఏ సాయం చేయొద్దంటూ భారత్ పదే పదే కోరుతున్నా.. ఫలితం లేకుండా పోతోంది. గత నెలలోనే ఐఎంఫ్ పాక్‌కు రూ.8,500 కోట్ల ప్యాకేజీ ప్రకటించగా.. తాజాగా ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) కూడా 800 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.6,869 కోట్ల) రుణం మంజూరు చేసింది. అయితే.. దీన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. పాక్‌కు అందుతున్న నిధులు దారి మళ్లుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో బీజేపీ సర్కారుపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. పాక్‌కు నిధులు వెళ్లకుండా అడ్డుకోవడం చేతగావట్లేదంటూ ఆక్షేపించింది. 'ఈ నెల 1న ఏడీబీ అధ్యక్షుడు మసాటో కందాను మోదీ కలిశారు. ఆ తర్వాత 3రోజులకే ఏడీబీ పాక్‌కు రుణం మంజూరు చేసింది' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది.


# లోకల్ ఫైట్..!

# నెలాఖరులోనే..!!




## స్థానిక సంస్థల ఎన్నికలపై క్లారిటీ ఇచ్చిన తెలంగాణ సర్కార్


హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఇవాళ (గురువారం) కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రిమండలితో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. ఈనెల చివరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. 300 పేజీల ఎన్డీఎస్ఏ రిపోర్ట్ , 150 పేజీల విజిలెన్స్ రిపోర్ట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇచ్చారు. రిపోర్ట్‌పై మంత్రుల అభిప్రాయాలను సీఎం తెలుసుకున్నారు. ఈనెల చివరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కేబినెట్‌లో ప్రధానంగా లోకల్ బాడీ ఎన్నికలపై చర్చించారు. ఎన్నికల నిర్వాహణపై మాట్లాడారు. ఏపీలో పరిశ్రామికాభివృద్ధికి వివిధ జిల్లాల్లో ప్రభుత్వ భూములను TGIICకి బదిలీ చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. స్పెషల్ ఎక్సైజ్ సెస్ అమలు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. విద్యాశాఖలో మరో డైరెక్టర్ నియామకం చేపట్టాలని మంత్రి మండలి నిర్ణయించింది. విద్యుత్ శాఖలో 300 పోస్టుల క్రియేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జహీరాబాద్ ఇండస్ట్రీయల్ అథారిటీ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వర్షాకాలం నేపథ్యంలో జూన్, జూలైలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణ సాధ్యాసాధ్యాలపై చర్చించారు. మహిళా సంఘాలకు బీమా నిధుల విడుదలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ములుగులో పామాయిల్ ఫ్యాక్టరీకి 12 ఎకరాల భూమి కేటాయిస్తూ కేబినెట్ ఆమోదించింది. కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దివంగత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా నామకరణం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి యూనివర్సిటీ కార్యకలాపాలు ప్రారంభించమన్నారు. దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కేరాఫ్‌గా కొత్తగూడెం నిలిచింది. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీతో తెలంగాణ ఖ్యాతి పెరగనుంది. ఈ సందర్భగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు.




## 24 గంటల్లో 1,238 పాజిటివ్ కేసులు

అంతరించిపోయింది అనుకున్న కరోనా మహమ్మారి మరోసారి విజృంభిస్తుంది. నిత్యం వందల్లో పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతూ దేశ ప్రజల్లో ఆందోళన ను పెంచుతుంది.

ముఖ్యంగా మే 20 నుండి ఈ కేసులు పెరుగుదల లో భారీ మార్పులు వచ్చాయి. కరోనా టెస్టులు పెరగడంతో పాజిటివ్ కేసుల సంఖ్య కూడా భారీగా పెరుగుతున్న అధికారులు తెలిపారు. తాజాగా గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 1,238 కొత్త కరోనా కేసులు నమోదైనట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. అలాగే 24 గంటల్లో కరోనా కారణంగా ఏడుగురు మృతి చెందారు. వారిలో మహారాష్ట్రలో ముగ్గురు, ఢిల్లీలో ఇద్దరు, కర్ణాటకలో ఇద్దరు మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు. అయితే దేశవ్యాప్తంగా ప్రతి రోజు వందల మంది కరోనా నుంచి కోలుకుంటుండగా.. సరైన సమాచారం అందుబాటులో లేకపోవడంతో అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోజు కొత్తగా నమోదైన 1238 పాజిటీవ్ కేసులతో భారత్‌లో ప్రస్తుతం 4,866 యాక్టివ్ కేసులు ఉన్నట్లు భారత ఆరోగ్య శాఖ ప్రకటించింది.



## రుతుపవనాలు యూ టర్న్.. ఆ జిల్లాలకు హెచ్చరిక!

తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకవైపు ఎండలు మండుతుండగా.. ఇంకోవైపు వర్షాలు పడుతున్నాయి. నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించడంతో వర్షాలు పడ్డాయి. అయితే అవి మందగించడంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. తిరిగి ఉష్ణోగ్రతలు ప్రతాపం చూపుతున్నాయి. అయితే మేలో ఎండలు కంటే వర్షాలే అధికంగా పడ్డాయి. కానీ ఇప్పుడు వర్షాలు తగ్గి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగాయి. దీంతో తెలుగు రాష్ట్రాలు మండుతున్నాయి. కొన్నిచోట్ల పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. దీంతో ప్రజలకు ఉష్ణతాపం తప్పడం లేదు. ఉదయం 8 గంటల నుంచి భానుడు ప్రతాపం చూపుతున్నాడు. మధ్యాహ్నంకి సెగలు కక్కుతున్నాడు. సాయంత్రం వరకు ఉక్కపోత అధికంగా ఉంటోంది.

**ముందుగానే తాకిన రుతుపవనాలు..** సాధారణంగా జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు దేశంలో ప్రవేశిస్తాయి. కానీ ఈ ఏడాది మాత్రం ఎనిమిది రోజులు ముందుగానే ప్రవేశించాయి. తెలుగు రాష్ట్రాలకు సైతం వారం రోజులు ముందునే తాకాయి. అదే వేగంతో విస్తరించాయి. నైరుతి ప్రభావంతో వర్షాలు సమృద్ధిగా పడ్డాయి. అయితే రాష్ట్రవ్యాప్తంగా వర్షాల ప్రభావం ఉండడంతో ఇక వేసవి ఉండదని అంతా భావించారు. కానీ గత నాలుగు రోజులుగా భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఎండల తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు 38 నుంచి 40 డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయి. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అయితే కొన్ని జిల్లాల్లో మాత్రం సాయంత్రానికి పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తుండడం విశేషం.

**కొద్ది రోజులపాటు వేడి..** మరి కొద్ది రోజులపాటు ఈ వేడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా కోస్తాలో ఇదే పరిస్థితి కొద్దిరోజులపాటు కొనసాగే అవకాశం ఉంది. కొన్నిచోట్ల 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నైరుతి రుతుపవనాలు విస్తరించేటప్పుడు మధ్యలో విరామం సర్వసాధారణమని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నెల 10 తరువాత బంగాళాఖాతంలో రుతుపవనాల కదలికకు అణువుగా వాతావరణం ఏర్పడుతుందని చెబుతున్నారు. 12 నుంచి రుతుపవనాల్లో మళ్ళీ కదలిక రావచ్చని అంచనా వేస్తున్నారు. మరోవైపు అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్నిచోట్ల వర్షాలు పడే అవకాశం ఉందని కూడా చెబుతోంది.

**16 సంవత్సరాల తర్వాత..** అయితే పదహారేళ్ల తరువాత రుతుపవనాలు దేశానికి ముందుగానే తాకాయి. చాలా వేగంగా విస్తరించాయి. 2009లో ఇదే మాదిరిగా రుతుపవనాలు ముందుగానే వచ్చాయి. ఆ ఏడాది విస్తారంగా వర్షాలు పడ్డాయి. అయితే దేశంలో వర్షాలు ఎక్కువగా పడడానికి దోహదం చేసేది మాత్రం నైరుతి రుతుపవనాలు. అవి విస్తరిస్తేనే తుఫాన్లు, అల్పపీడనాలు, ఆవర్తనాలు ఏర్పడడానికి అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించడం, వేగంగా స్పందించడంతో భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ చెబుతోంది.




# మరింత కష్టపడండి

## మెరుగైన పాలన అందించండి!

## కేంద్ర మంత్రులకు ప్రధాని మోదీ దిశా నిర్దేశం

మంత్రులు మరింత మెరుగైన పాలన అందించడంపై దృష్టి పెట్టాలంటూ కేంద్ర మంత్రులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర మంత్రిమండలి సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం దాదాపు నాలుగు గంటల పాటు కేంద్ర మంత్రి మండలి సమావేశం సాగింది. ఈ సందర్భంగా మోదీ మంత్రులను ఉద్దేశించి మాట్లాడారు.

మన ముందు పెద్ద లక్ష్యాలు వున్నాయని... సమయం మాత్రం పరిమితంగానే ఉందని చెప్పారు. కాగా మంత్రిమండలి సమావేశానికి ముందు జన, కులగణన షెడ్యూల్‌ను కేంద్ర హోం శాఖ ప్రకటించింది. జన, కులగణనతో ముడిపడే నియోజకవర్గాల పునర్ విభజన, మహిళా రిజర్వేషన్లు అమలు నేపథ్యంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

**భారత్ పెద్ద వ్యాపార, వాణిజ్య దేశంగా..** రానున్న రోజుల్లో భారత్ పెద్ద వ్యాపార, వాణిజ్య దేశంగా మారబోతోందని, ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా కేంద్ర మంత్రులంతా విధిగా ఆయా ప్రాంతాల్లో ఒక్క రోజు గడపాల్సిందేనని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

ప్రభుత్వ విధానాలు, పథకాలు, కార్యక్రమాలు, ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాల్లో వస్తున్న ఫలితాలపై ప్రధానంగా చర్చించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయని, 11 ఏళ్ళ పాలన, ప్రభుత్వం సాధించిన విజయాలపై కేబినెట్ కార్యదర్శి స్వామి నాథన్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే వైద్య, నీటి వనరుల శాఖలపై ఆరోగ్య కార్యదర్శి పూన్య శ్రీవాస్తవ, జలవనరుల కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ప్రజెంటేషన్ ఇచ్చారు. రహదారులు సహా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ఆ శాఖ కార్యదర్శి ప్రజెంటేషన్ ఇచ్చారు.

**నీతి అయోగ్ నివేదిక..** ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ ప్రోగ్రామ్‌లో మంత్రుల పనితీరుపై నీతి అయోగ్ నివేదిక ఇచ్చింది. నిర్దేశించిన మేరకు ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ ప్రోగ్రామ్‌లో పర్యటించని 5 గురు కేంద్ర మంత్రుల పేర్లను నీతి అయోగ్ సిఈవో బివిఆర్ సుబ్రహ్మణ్యం ప్రస్తావించారు. మంత్రులు తప్పని సరిగా పర్యటించాలని కనీసం ఒక్క రోజైనా సంబంధిత జిల్లా, బ్లాక్‌లో గడపాలని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. స్థానిక సమస్యలను అర్థం చేసుకునేందుకు ప్రజలతో మమేకం కావాలి అంటే ఇది తప్పనిసరి అని ఆయన అన్నారు. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, తయారీ రంగ ప్రాజెక్టులు లక్ష్యాలు సాధించాలని, గత 10 ఏళ్ళ పాలన సాధించిన విజయాలు అంతకుముందు 10 ఏళ్ళ ప్రభుత్వాలతో పోల్చుకోవద్దని అన్నారు.

**అనేక భారీ లక్ష్యాలను సాధించాలి...** రానున్న రోజుల్లో అనేక భారీ లక్ష్యాలను సాధించాలని ప్రధాని మోదీ మంత్రులకు సూచించారు. నీటి సంరక్షణకు కార్యక్రమాలకు గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు ఉపయోగించుకోవాలన్నారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన గ్రామీణ పథకంకు ప్రస్తుతం ఉపాధి హామీ పథకం నిధుల వినియోగిస్తారన్నారు. అనేక రుగ్మతలకు కారణం స్థూల కాయమని, స్థూలకాయం, ఊబ కాయంకు వంట నూనెల వినియోగమే ప్రధాన కారణంగా ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రజలు రోజు వారీ ఆహార వినియోగంలో కనీసం 10 శాతం వంట నూనెల వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో భారత్ పెద్ద వ్యాపార దేశంగా మార బోతోందని అందుకు అనుగుణంగా ఉత్పత్తుల నాణ్యత, మెరుగైన పాలన అవసరం అని అన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు రెండితలు అయిన విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకువెళ్ళాలని ప్రధాని మోదీ కేంద్ర మంత్రులకు సూచించారు.

**కరుణామయ ప్రభుత్వం..** ఎన్డీయే ప్రభుత్వం పేదల సంక్షేమానికే అంకితమైన కరుణామయ ప్రభుత్వమని, కీలక పథకాలన్నీ పేదల జీవితాలను మార్చాయని, గత దశాబ్దంలో ఎన్డీయే ప్రభుత్వం సాధికారత, మౌలిక సదుపాయాలు, సమ్మిళితత్వంపై దృష్టి సారించి, పేదరికం నుంచి అనేక మందిని బయటకు తీసుకురావడానికి విప్లవాత్మక చర్యలు తీసుకుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, జన్ ధన్ యోజన , ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాలు గృహనిర్మాణం, వంట ఇంధనం, బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణను మెరుగుపరిచాయన్నారు.

దేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఈ ప్రయత్నాలతో, అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం అనే లక్ష్యాన్ని మనం ఖచ్చితంగా సాధిస్తామని తనకు నమ్మకం ఉందని మోదీ అన్నారు. తమ ప్రభుత్వం సర్వతోముఖాభివృద్ధి దిశగా చేస్తున్న ప్రయత్నాలు పరివర్తనాత్మక ఫలితాలకు దారితీశాయని పేదలు అణగారిన వర్గాలకు ప్రయోజనం చేకూర్చాయని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.




# కేసీఆర్ పిలుపు కోసం కవిత ఎదురుచూపులు

హైదరాబాద్: ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్‌పై బీఆర్‌ఎస్‌లో ఉత్కంఠ కొనసాగుతోంది. పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ (%ఖజ=%) పిలుపు కోసం కవిత ఎదురుచూస్తున్నారు. ఆమె లేఖ లీక్ వ్యవహారం జరిగి పది రోజులు దాటినా కేసీఆర్ ఇంతవరకు కవితను పిలిచి మాట్లాడలేదు.. సమయం కూడా ఇవ్వలేదు. పార్టీలో అంతర్గత అంశాలు, కేటీఆర్‌పై కవిత తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీంతో తండ్రి కేసీఆర్ కుమార్తెపై సీరియస్‌గా ఉన్నారు. మరోవైపు కవిత కార్యక్రమాలకు బీఆర్‌ఎస్ లీడర్లు, క్యాడర్ దూరంగా ఉన్నారు. జాగృతి ఆధ్వర్యంలోనే కవిత తన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కేసీఆరే తన నాయకుడు అంటున్నప్పటికీ.. బీఆర్‌ఎస్ కార్యకర్తలు దూరంగా ఉంటున్నారు. కవిత లేఖ వ్యవహారం తర్వాత బీఆర్‌ఎస్ క్యాడర్ అయోమయంలో పడింది.

**కేటీఆర్ రాక ఆలస్యం..** మరోవైపు మే 26న లండన్.. అటు నుంచి అమెరికా వెళ్ళిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యూకేలో పర్యటించి.. అమెరికా డల్లాస్‌లో జరిగిన బీఅర్‌ఎస్ రజతోత్సవ సభలో పాల్గొన్నారు. మరో నాలుగు రోజుల పాటు అమెరికాలోనే ఉండనున్నారు. ఈనెల 10న అమెరికా నుంచి కేటీఆర్ హైదరాబాద్ వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. కేసీఆర్ 11న కాళేశ్వరం కమిషన్ విచారణకు వెళ్ళనున్నారు. దీంతో 10న హైదరాబాద్‌కు వచ్చేలా కేటీఆర్ ప్రణాళికలు చేసుకున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్‌లో హాట్ టాపిక్‌గా కవిత ఎపిసోడ్ కొనసాగుతోంది. కేటీఆర్ అమెరికాలో ఉండగా.. అన్నపై కవిత తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. దీంతో కవిత చేసిన కామెంట్స్‌పై కేటీఆర్ స్పందిస్తారా.. లేదా అనే దానిపై బీఆర్‌ఎస్‌లో చర్చ జరుగుతోంది.

**తెలంగాణ జాగృతి ద్వారా కవిత కార్యక్రమాలు..** కవిత తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించి ప్రస్తుతానికి తెలంగాణ జాగృతి ద్వారా కార్యక్రమాలు నిర్వహించాలనే నిర్ణయంతోనే ఉన్నారని సమాచారం. తండ్రి నుంచి పిలుపు వచ్చినా, రాకున్నా.. తన పని తాను జాగృతి ద్వారా చేసుకుపోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

తన కార్యక్రమాల్లో జాగృతి జెండాలు, బ్యానర్లు తప్ప.. బీఆర్‌ఎసకు సంబంధించినవి ఎక్కడా లేకుండా చూసుకుంటున్నారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ నాయకులు, కార్యకర్తలతోనే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన ధర్నాకు బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ఎవరూ హాజరు కాకపోయినా.. కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోగలిగామని జాగృతి నేతలు అన్నారు. దీని బట్టి చూస్తే బీఆర్‌ఎస్‌లో స్పష్టమైన విభజన వచ్చినట్లు కనిపిస్తోంది. కవిత సాంకేతికంగా గులాబీ పార్టీలో కొనసాగుతున్నా.. వ్యవహారాలు మాత్రం ఎవరికివారే యమునా తీరే అన్న రీతిలోనే నడుస్తున్నాయి. ఏదైనా ఒక కీలక పరిణామం జరిగే వరకు పరిస్థితి ఇదే రీతిలో ఉండే అవకాశాలున్నాయి.




చర్ల: మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ (65) అలియాస్ సింహాచలం, గౌతమ్ మృతి చెందారు.

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జాతీయ పార్క్ వద్ద ఈరోజు ఉదయం జరిగిన ఎదురు కాల్పుల్లో మృతి చెందినట్టు సమాచారం. సుధాకర్ అసలు పేరు తెంటు లక్ష్మీనరసింహాచలం. ఆయన స్వస్థలం ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం.

గత 40 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో ఉన్న సుధాకర్‌పై రూ. 50 లక్షల రివార్డు ఉంది. 2004లో ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చల్లో ఆయన పాల్గొన్నారు.



## మొక్కలు నాటకపోతే భవిష్యత్‌లో ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి: మంత్రి పొన్నం

హైదరాబాద్: మొక్కలను నాటడంలో నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి వస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో మంత్రి మొక్కలు నాటారు. కాలుష్య నియంత్రణ చేయకపోవడంతో అనేక రకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని.. వాటిని సంరక్షించుకోవాలని కోరారు.

## జూబ్లీహిల్స్ భారాస ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు తీవ్ర అస్వస్థత

హైదరాబాద్: జూబ్లీహిల్స్ భారాస ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను వెంటనే గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు.

గుండె సంబంధిత సమస్యతో అస్వస్థతకు గురైనట్టు గుర్తించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి ఆందోళనకంగా ఉన్నట్టు సమాచారం. మాజీ మంత్రి హరీశ్‌రావు, పలువురు భారాస నేతలు ఏఐజీ ఆసుపత్రికి చేరుకుని గోపీనాథ్ ఆరోగ్యపరిస్థితి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆయనకు ఐసీయూలో చికిత్స కొనసాగుతోందని హరీశ్‌రావు తెలిపారు.

**ఐసీయూలో మాగంటి....** ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రి పాలయ్యారని తెలియటంతో మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నేతలు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మాగంటి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి




తెలుసుకున్నారు. అనంతరం హరీష్ రావు.. మాగంటి గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితిపై స్పందించారు.

ఆయన మాట్లాడుతూ.. ‘ ఎమ్మెల్యే మాగంటి ఐసీయూలో ఉన్నారు. ఆయనకు చికిత్స కొనసాగుతోంది’ అని తెలిపారు.




## పెళ్లి బృందం కారును ఢీకొట్టిన డీసీఎం వాహనం.. చిన్నారి మృతి, వరుడికి గాయాలు

కొండగట్టు: జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లి బృందం కారును డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 3 నెలల చిన్నారి రుద్ర మృతిచెందగా.. వరుడు సహా ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి నాందేడ్ నుంచి హుజూరాబాద్‌కు పెళ్లి బృందం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వరుడు గాయపడటంతో వివాహం ఆగిపోయింది. గాయపడిన వారు చికిత్స అనంతరం తిరిగి నాందేడ్ వెళ్లిపోయారు.

**గాయపడిన వారు** మహేశ్ (వరుడు), వాగ్మేర సితాల్, వాగ్మేర మారుబాయి, వాగ్మేర దినేశ్, వాగ్మేర సోనాలి, డ్రైవర్ గణేశ్




**సికింద్రాబాద్: నగరంలోని అల్వాల్ పరిధి చినరాయుని చెరువులో ఆక్రమణల కూల్చివేతలను చేపట్టారు. అక్రమంగా నిర్మించిన భవనాలను హైడ్రా సిబ్బంది నేలమట్టం చేశారు. ఇటీవల ఇక్కడి ఎఫ్‌టీఎల్ పరిధిలో భవన నిర్మాణాలు చేపట్టడంపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో స్పందించిన అధికారులు గురువారం 3 భవన నిర్మాణాలను కూల్చివేశారు. నిర్మాణదారులు, హైడ్రా అధికారులకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది.**

# త్వరలోనే బాలికా రక్షక టీం.. మంత్రి సీతక్క ప్రకటన



హైదరాబాద్, జూన్ 5: మహిళా శిశు సంక్షేమం కోసం ఎన్నో కొత్త ఆలోచనలకు మేధో మథన సదస్సు ప్రాణం పోసిందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క (%వీఙఅఆర్‌వతీ ాావవ్ష్ముఎఝ%) అన్నారు. రెండు రోజుల పాటు జరిగిన మేధో మథన సదస్సు ముగింపు సభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. మేధో మథన సదస్సు విజయవంతం అయ్యిందని.. ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఇలాంటి సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాల్లో ఇలాంటి సదస్సులు నిర్వహించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. ఈ సదస్సులో మహిళా శిశు సంక్షేమంపై పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, మేధావులు తమ విలువైన సలహాలు ఇచ్చారని అన్నారు. మహిళా శిశు సంక్షేమం కోసం నిపుణులతో ఒక అడ్వైజరీ కమిటీ నియమిస్తామని చెప్పారు. వారి సలహాలు సూచనలతో శాఖ ద్వారా అందుతున్న సేవలను మరింత పటిష్టపరుస్తామని వెల్లడించారు. బాలికల రక్షణ కోసం బాలికలతో స్నేహ కమిటీలను ఏర్పాటు చేస్తామనన్నారు. స్వీయ రక్షణ టీంలుగా స్నేహ కమిటీలు పనిచేస్తాయని చెప్పుకొచ్చారు. అంగన్వాడీ టీచర్ల ద్వారా అమ్మాయిలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన కల్పిస్తామన్నారు. మహిళ, బాలికల భద్రత మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలను గుర్తించి అంగన్వాడీలను వారితో అనుసంధానం చేస్తామని అన్నారు. త్వరలో మహిళల హక్కుల మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించి మహిళ భద్రత కోసం పటిష్ట విధానాలను రూపొందిస్తామని మంత్రి తెలిపారు. చాలా చోట్ల ముళ్ళ పొదల్లో, చెత్తకుప్పల్లో అప్పుడే పుట్టిన బిడ్డలను వదిలేసి వెళుతున్నారని.. చీమలు, కుక్కలు, చెత్త, ముండ్ల మధ్య శిశువుల ప్రాణాలు పోతున్నాయన్నారు. దీన్ని నివారించేందుకు వీలున్న చోట ఊయలలను ఏర్పాటు చేస్తామన్నారు. బిడ్డలను పారేయకుండా.. ఆ ఊయలలో వదిలేస్తే వారి బాధ్యతను తామే స్వీకరిస్తామని అన్నారు. తెలంగాణ ఏర్పాటై 10 సంవత్సరాలైనా ఇప్పటికీ బాల్య వివాహ నిరోధక చట్ట రూల్స్‌ను అడాప్ట్ చేసుకోకపోవడం బాధాకరమన్నారు. త్వరలో రూల్స్‌ను అడాప్ట్ చేసుకుంటామని ప్రకటించారు. బాల్య వివాహాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామ సభల్లో, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి తెలిపారు. ఐసీడీఎస్ పథకాలకు తెలంగాణ ప్రాంతంలోనే బీజం పడిందన్నారు. 1972లో మహబూబ్‌నగర్‌లో ఫ్రీడమ్ ఫైటర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఐసీడీఎస్ ప్రారంభించారన్నారు. ఆ అనుభవాల ఆధారంగానే దేశవ్యాప్తంగా ఇందిరా గాంధీ ఐసీడీఎస్ స్కీంను విస్తరింపజేశారని తెలిపారు. అంగన్వాడీ సేవలకు ఆరాధ్యులుగా దుర్గాబాయి దేశ్‌ముఖ్, ఇందిరా గాంధీ నిలిచారని చెప్పుకొచ్చారు. వారి ఆదర్శంగా అంగన్వాడీ సేవలను ప్రతి ఇంటికి చేర్చాలన్నారు. ఈ ఏడాది వేయి అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించి ఇస్తామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసి స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. అంగన్వాడీ గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని.. కాబట్టి దేశ భవిష్యత్తును లిఖించేది అంగన్వాడీ సిబ్బంది అని తెలిపారు. కరీంనగర్‌లో ప్రతీ శుక్రవారం అంగన్వాడీ సిబ్బంది గ్రామస్తులతో సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. అదే విధంగా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల అడ్మిషన్లను , హాజరును పెంచాలని మంత్రి ఆదేశించారు. ఆకాశాన్ని చీల్చుకొని అమ్మాయిలు అంతరిక్షానికి వెళ్లినా భూమి మీద కొన్నిసార్లు రక్షణ కరువవుతుందన్నారు. అందుకే అమ్మాయిల స్వీయ రక్షణ కోసం బాలికా రక్షక టీంలను ఏర్పాటు చేస్తామన్నారు. అమ్మాయిలను వేధిస్తే సంఘ బహిష్కరణకు గురవుతారని హెచ్చరించారు. అమ్మాయిలను ముట్టుకుంటే కఠిన శిక్షలు తప్పవన్నారు. అమ్మాయిల పట్ల చెడుగా ప్రవర్తిస్తే ఇలాంటి శిక్షలు అనుభవించాల్సి వస్తుందో అబ్బాయిలకు అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క వెల్లడించారు.

# తెలంగాణ సర్కార్‌కు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

న్యూఢిల్లీ : తెలంగాణ ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల సంఘం నోటీసులు జారీ చేసింది. ఇటీవల రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో యువకుడి మరణంపై రెండు వారాల్లో సమాధానం చెప్పాలంటూ నోటీసులు ఇచ్చింది. పోలీసుల టార్చర్ కారణంగా యువకుడు మరణించాడంటూ మీడియాలో వచ్చిన కథనాలను ఎన్‌హెచ్‌ఆర్సీ పరిగణలోకి తీసుకుంది. ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న జాతీయ మానవ హక్కుల సంఘం.. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అలాగే ఈ ఘటనకు సంబంధించి తెలంగాణ డీజీపీకి కూడా ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు పంపింది. దీనిపై రెండు వారాల్లోగా వివరణాత్మక నివేదిక ఇవ్వాలని కోరింది. మీడియా కథనాల్లో విషయాలు నిజమైతే, బాధితుడి మానవ హక్కులను తీవ్రంగా ఉల్లంఘించినట్లుగా భావించాల్సి వస్తుందని కమిషన్ పేర్కొంది.

**ఏం జరిగిందంటే...** కాగా.. నగరంలోని టోలీచౌకికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ (35) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇద్దరు భార్యలు. ఈ క్రమంలో అతడు మరో మహిళతో సన్నిహితంగా ఉండటంతో.. విషయం తెలుసుకున్న రెండో భార్య నిలదీసింది. ఈ విషయంపై భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. అలాగే మే 13న కూడా పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టగా.. అది ఎంతకీ తెగకపోవడంతో ఇరు వర్గాలు రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ క్రమంలో భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్తను లోపలికి తీసుకెళ్లిన పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఆ తరువాత కొద్దిసేపటికే ఇర్ఫాన్ కుప్పకూలిపడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ అతడు మరణించాడు. అయితే పోలీసులు కొట్టడం వల్లే అతడు మరణించాడంటూ ఇర్ఫాన్ సోదరుడు ఆరోపించాడు. ఇర్ఫాన్‌ను తాము కొట్టలేదని పోలీసులు తెలిపారు. పోలీసుల టార్చర్ వల్లే యువకుడు మృతిచెందాడంటూ మీడియాలో కథనాలు రావడంతో ఈ ఘటనను ఎన్‌హెచ్‌ఆర్సీ సుమోటోగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వానికి, డీజీపీకి నోటీసులు జారీ చేసింది.




న్యూఢిల్లీ, జూన్ 5: తెలంగాణ మంత్రివర్గ విస్తరణ త్వరలో జరుగుతుందన్న వార్తల నేపథ్యంలో ఆశావాహులు అప్రమత్తమయ్యారు. తమకు మంత్రి పదవులు ఇవ్వాలంటూ కాంగ్రెస్ హైకమాండ్‌కు వినతులు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈరోజు (గురువారం) మాదిగ సామాజికవర్గానికి చెందిన నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్‌ను కలిశారు. వీరిలో అడ్లూరి లక్ష్మణ్, మందుల సామేల్, కాలే యాదయ్య, కవ్వంపల్లి సత్యనారాయణ ఉన్నారు. గత నెల రోజులుగా కాంగ్రెస్ అధిష్ఠాన పెద్దలు, పీసీసీ, సీఎం, రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌ను కలిసి మంత్రివర్గంలో తమ సామాజికవర్గం ఎమ్మెల్యేలకు స్థానం కల్పించాలని విజ్ఞాపనలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నలుగురు ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ.. మంత్రివర్గంలో తప్పనిసరిగా తమకు స్థానం కల్పించాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, కేసీ వేణుగోపాల్‌ను కోరామన్నారు. తమ సామాజిక వర్గం నేతలకు మంత్రివర్గంలో స్థానం పట్ల అధిష్ఠాన పెద్దలు సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు జరిగిన తమ సామాజికవర్గానికి ప్రాతినిధ్యం ఉంటుందని భావిస్తున్నామని అన్నారు. ఇది మాదిగ సామాజిక వర్గానికి సంబంధించిన ఆరుగురు ఎమ్మెల్యేల అంశం కాదని.. యావత్ మాదిగ ప్రజలకు సంబంధించిన అంశమని తెలిపారు. 200 శాతం న్యాయం జరుగుతుందని భావిస్తున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో స్థానంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సైతం లేఖ రాశామన్నారు. అపాయింట్‌మెంట్ దొరికితే రాహుల్ గాంధీని కలిసి డిమాండ్లు తెలియజేస్తామన్నారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదని.. మాదిగ సామాజికవర్గీయులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ రాజకీయంగా కీలక పదవుల్లో ప్రాతినిధ్యం లేదన్నారు. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో ఉన్న ఆరుగురు మాదిగ సామాజికవర్గం ఎమ్మెల్యేలలో అధిష్ఠానం ఎవరికి మంత్రి పదవి ఇచ్చినా అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. మంత్రివర్గంలో ఉన్న కొందరు తమ సామాజికవర్గం పేరు చెప్పుకుంటున్నారని.. తెలంగాణ మంత్రివర్గంలో ఇప్పటివరకూ ఎటువంటి మాదిగలు లేరన్నారు. నిజమైన మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరుతున్నామని నలుగురు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

# నీటి పారుదల రంగానికి కె.ఎల్.రావు ఎనలేని సేవలు

## జూన్ 6... డాక్టర్ కానూరి లక్ష్మణరావు జయంతి


నీటిపారుదల రంగంలో అపర భగీరథుడిగా కీర్తించబడే తెలుగు ప్రజలు గర్వించ దగిన డా. కానూరి లక్ష్మణరావు (జూన్ 6, 1902 – మే 18, 1986) భారత దేశం లోనే గాక ప్రపంచ వ్యాప్తంగా నీటిపారుదల రంగంలో విప్లవాత్మకమైన పనులు చేసిన గొప్ప ఇంజనీరు. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య తర్వాత గొప్ప వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. 1902 జూలై 14న కృష్ణా జిల్లా కంకిపాడు గ్రామంలో జన్మించిన కె.ఎల్.రావు మద్రాసు విశ్వ విద్యాలయములో ఇంజ నీరింగు (బీ.ఈ) డిగ్రీ పూర్తి చేసి, గిండీ ఇంజనీరింగు కళాశాల నుండి పోస్టుగ్రాడ్యుయేషన్ చేసి, మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఇంజ నీరింగులో మాస్టరు డిగ్రీ (ఎం.ఎస్.సి ఇన్ ఇంజనీరింగ్) పొందిన తొలి వ్యక్తిగా నిలిచారు. చదువు పూర్తయిన తర్వాత విశాఖ జిల్లా బోర్డు అసిస్టెంట్ ఇంజనీరుగా పని చేశారు. తదనంతరం రంగూన్ కూడా ఉద్యోగం చేశారు. కొంత కాలం తర్వాత రావు గారు గిండీ ఇంజనీరింగ్ కళాశాలలో పరిశోధ కుడిగా చేరారు. ఇంగ్లండ్ లోని బర్నింగ్ హెూమ్ విశ్వ విద్యాలయం నుండి 1939 లో డాక్టరేట్ డిగ్రీ పొందారు. కొంత కాలం పాటు ఇంగ్లాండ్ లో ప్రొఫెసర్ గా పనిచేసిన ఆయన 1946లో భారత దేశం తిరిగి వచ్చి మద్రాసు ప్రభుత్వంలో డిజైన్ ఇంజనీర్ గా చేరారు. 1950 – 54 మధ్యకాలంలో భారత ప్రభుత్వంలో చీఫ్ ఇంజనీర్ గా పని చేశారు. ప్రభుత్వంలో ఇంజనీర్ గా పని చేస్తున్న సమయాన, దేశం లోని అనేక నీటిపారుదల ప్రాజెక్టు లకు నమూనాలు తయారు చేశారు. నాగార్జునసాగర్, పులిచింతల, శ్రీశైలం, శ్రీరాంసాగర్ వంటి ఎన్నో సుప్రసిద్ధ నీటిపారుదల పథకాలకు రూపకల్పన చేశారు. గంగా, బ్రహ్మపుత్ర తదితర నదుల వరదల నివారణకై అనేక సూచనలు సలహాలు ఇచ్చారు. అందులో భాగంగానే గాంధీ సాగర్ , జవహర్ సాగర్ రాణాప్రతాప్ సాగర్ వంటి నిర్మాణాలు సిద్ధం చేశారు. నాటి ప్రభుత్వం నాగార్జున సాగర్, భాక్రానంగల్ ప్రాజెక్ట్, హిరాకుడ్ ప్రాజెక్ట్ విషయంలో పిలిపించిన విదేశీ ఇంజనీర్లు కూడా రావు ను సంప్రదించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. ఇంజనీరింగ్ విషయాలకు సంబంధించి ఈయన రాసిన "ఇండియాస్ వాటర్ వెల్త్" అనే పుస్తకం నేటి తరాల శాస్త్రవేత్తలకు ప్రామాణిక గ్రంథంగా ఉంది. ఉద్యోగ విరమణ అనంతరం నాటి జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు నీలం సంజీవరెడ్డి పిలుపు మేరకు 1962, 1967 ,1971 లో విజయవాడ నుంచి పార్లమెంటుకు పోటీ చేసి గెలిచారు. నెహ్రూ, శాస్త్రి, ఇందిరా గాంధీ, నేతృత్వంలోని ప్రభుత్వంలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రిగా పని చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే గంగా బ్రహ్మపుత్ర నదిలో వర్షాకాలంలో చేరుతున్న నీటిని నిల్వ ఉంచి భారతదేశంలో క్షామ ప్రాంతాలైన మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు నీటి సౌకర్యం కల్పించే "నేషనల్ వాటర్ గ్రిడ్" పథకానికి రూపకల్పన చేశారు. 1963లో పద్మభూషణ్, రూర్కీ, ఆంధ్రా మరియు జే ఎన్ టీ విశ్వ విద్యాలయాల డాక్టరేట్లు పొందారు, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్, అలాగే ఆల్ ఇండియా ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా, ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ సాయిల్ మెకానిక్స్ అండ్ జియోటెక్నికల్ ఇంజనీరింగ్ (ఆసియా) వైస్ ప్రెసిడెంట్ గా, రంగూన్ (బర్మా, ఇప్పుడు మయన్మార్)లో ప్రొఫెసర్‌గా, యునైటెడ్ కింగ్‌డమ్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఇంజనీరుగా చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా మూడు పర్యాయాలు రాష్ట్రపతి పురస్కా రం లభించింది. ఆయన జ్ఞాపకార్థం పులిచింతల ప్రాజెక్టుకు కె.ఎల్.రావు ప్రాజెక్టు అని నామ కరణము చేయ బడింది. ఒక ఇంజనీరు పేరును ప్రాజెక్టుకు పెట్టడం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఇదే ప్రథమం. 1986 మే 18 న 84 సంవత్సరాల వయసులో మృతి చెందారు.



**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# సైద్ధాంతిక నిబద్ధతకు నిలువుటద్దం చంద్ర రాజేశ్వరరావు

## జూన్ 6... చంద్ర రాజేశ్వరరావు జయంతి



నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, ఏళ్ళతరబడి ఉద్యమాల్లో, అజ్ఞాత వాసంలో గడిపిన అలుపెరుగని కమ్యునిస్టు నిస్వార్థ పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు. కమ్యూనిస్టు పార్టీకి ఆరున్నర దశాబ్దాల పాటు వివిధ హెూదాల్లో సేవలందించిన నిబద్ధత కలిగిన మహా నేత రాజేశ్వరరావు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కి 28 సంవత్సరాల సుదీర్ఘ కాలం నేతృత్వం వహించిన రాజేశ్వరరావు జీవితం సైద్ధాంతిక నిబద్ధతకు, నిజాయితీకీ నిలువుటద్దం. చంద్ర రాజేశ్వరరావు భారత కమ్యూనిస్టు పార్టీ తొలితరం అగ్రనాయకుల్లో ఒకరు. పేరుకు తగినట్టుగానే ప్రత్యర్థులపై చంద్ర ప్రచండత్వం ప్రదర్శించేవారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులతో మమేకమైన కమ్యూనిస్టు ఆయన. ఎంతటి వారితో నైనా తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడించేవారు. నెహ్రూ, ఇందిరాగాంధీలు తీసుకున్న నిర్ణయాల్లో ప్రజోపయోకరాలను సమర్ధించినా, నిరంకుశ చర్యలను వ్యతిరేకించిన నిష్పక్షపాతి ఆయన. పీడిత, తాడిత జనోద్ధరణ కోసం ఎంతో ఉజ్వలమైన భవిష్యత్‌ను వదులు కుని కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించిన ఆయన పేదల హృదయాల్లో చిర స్థాయిగా నిలిచారు. పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, తరిమెల నాగిరెడ్డి, నీలం రాజశేఖరరెడ్డి, తదితర పార్టీ అగ్రనాయకులతో కలిసి, దశాబ్దాల పాటు రాష్ట్రంలోనే కాక, దేశంలోని పలు ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేశారు. కృష్ణా జిల్లా చల్లపల్లి మండలంలోని మంగళాపురం గ్రామంలో 1914 జూన్ ఆరవ తేదీన పెద్ద భూస్వాముల కుటుంబంలో జన్మించిన రాజేశ్వరరావు కమ్యూనిస్టు పార్టీలో చేరిన తరువాత ఆ భూస్వాములకు వ్యతిరేకంగా, భూమి లేని నిరుపేదల తరపున దశాబ్దాలపాటు పోరాటం జరిపారు. రాజేశ్వరరావు ప్రాథమిక విద్యాభ్యాసం మంగళాపురంలో, సెకండరీ విద్య చల్లపల్లిలోనూ సాగింది. బందరు హిందూ స్కూలులో ఎస్సెస్సెల్సీ పూర్తిచేశారు. విద్యార్థి దశలోనే రాజేశ్వరరావు క్రీడాకారునిగా, పేదల పాలిట ఆత్మీయునిగా పేరొందారు. మహాత్మా గాంధీ పిలుపుపై సాగిన ఉప్పు సత్యాగ్రహంలో వలంటీర్‌గా పని చేశారు. యుక్తవయసులోనే విప్లవ భావాల పట్ల ఆకర్షితులయ్యారు. మహాత్మాగాంధీ ఉద్యమాల్లో పనిచేస్తున్నా, విప్లవ కిశోరాలైన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ వంటివారి పట్ల ఆరాధనా భావాన్ని పెంచుకున్నారు. బెనారస్ హిందూ యూనివర్శిటీలో చదువుకుంటున్న రోజుల్లోనే ఆయన హిందూ, ముస్లిం ఐక్యత కోసం ఎంతోకృషి చేశారు. కమ్యూనిస్టు నాయకులను ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం మీరట్ కుట్ర కేసులో ఇరికించి జైళ్ళలో పెట్టినప్పుడు వారు విడుదల చేసిన ప్రకటన రాజేశ్వరావును ఉత్తేజపర్చింది. వామపక్ష భావాలున్న విద్యార్థులందరినీ ఐక్యపర్చి సాటి విద్యార్థులతో కలిసి ఒక స్టడీ సర్కిల్‌ని ఏర్పాటు చేశారు. తరువాత అది 'యంగ్ కమ్యూనిస్టు లీగ్'గా అవతరించింది. బెనారస్ హిందూ యూనివర్శిటీలో చదువుకునే రోజుల్లోనే మతవాద, మితవాద వర్గాలను ధైర్యంగా ఎదుర్కొన్న ధీశాలి రాజేశ్వరరావు. తరచుగా ఘర్షణలకు దిగడం, కమ్యూనిస్టు వర్గానికి నాయకత్వం వహించడంతో బిఎస్సీ పూర్తి కాకముందే ఆయన యూనివర్శిటీ నుంచి టీసీ తీసుకుని బయటికి వచ్చారు. బెనారస్‌లో ఉండగానే ఆయన లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు హాజరయ్యారు. జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ రష్యా సందర్శించి వచ్చిన తరువాత సోషలిజం, స్వాతంత్ర్య పోరాటంలో కార్మిక, కర్షక పాత్ర, వర్గ సంఘాలు, వర్గ పోరాటాల పేరిట రాసిన వ్యాసాలు రాజేశ్వరరావును విశేషంగా ఆకర్షించాయి. అదే సందర్భంలో ఆయన మహాత్మా గాంధీని కలిసిన విద్యార్థి బృందంలో ఉన్నారు. తరువాత ఆయన విశాఖలో మెడిసిన్‌లో చేరినా, ఆయన కమ్యూనిస్టు భావాల ప్రచారానికి నిడమర్తి ఉమారాజేశ్వరరావు ప్రభృతులతో కలిసి స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేశారు. కమ్యూనిస్టు భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఉద్యమంలో చురుకుగా పాల్గొనడం వల్ల ఆయన చదువు బెనారస్‌లోనూ, విశాఖలోనూ సవ్యంగా సాగలేదు. తండ్రి అభిమతానికి వ్యతిరేకంగా ఆయన సావిత్రమ్మతో వివాహాన్ని అతి నిరాడంబరంగా దండల మార్పుతో చేసుకున్నారు. వారి వివాహానికి ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు మద్దూరి అన్నపూర్ణయ్య పెళ్ళిపెద్దగా వ్యవహించారు. సావిత్రమ్మ కూడా భర్త మార్గంలోనే కమ్యూనిస్టు ఉద్యమం ప్రచారం కోసం జీవితాంతం కృషిచేశారు. వివాహానికి గుర్తుగా మెడలో వేసుకున్న గొలుసు రాయిని తీయించి ఎర్ర నక్షత్రాన్ని వేసుకోవడం ఆమె నిబద్ధతకు నిదర్శనం. పార్టీ నిర్ణయం మేరకు పూర్తి కాల కార్యకర్తగా పనిచేయడం కోసం ఆమె శాంతినికేతన్‌లో చదువు కోవాలనే ఆకాంక్షను బలవంతంగా అణగ దొక్కుకున్నారు. కృష్ణా జిల్లాలో కమ్యూనిస్టుపార్టీ విస్తరణకు రాజేశ్వరరావు దంపతులు విశేషంగా కృషిచేశారు. కార్మిక, కర్షక సంఘాలను ఏర్పాటు చేసి, మంగళాపురం కూలీల పోరాటానికి, చల్లపల్లి జమిందారు అక్రమాలపై ఉద్యమానికి నేతృత్వం వహించారు. కృష్ణాజిల్లా తిరువూరు తాలూకాలో నైజాం సరిహద్దున ఉన్న తునికిపాడుకు వచ్చిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి ప్రభృతులు నైజాంలో పరిస్థితి గురించి వివరించారు. ఆ క్రమంలోనే రాజేశ్వరరావుకు... ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చిర్రావూరి లక్ష్మీనరసయ్య ప్రభృతులు కూడా రావడంతో వారందరితో రాజేశ్వరరావుకు పరిచయాలు ఏర్పడ్డాయి. క్రమంగా తెలంగాణాలో అనేకసార్లు పర్యటించి తెలంగాణలో పార్టీ నిర్మాణానికీ, భువనగిరి ఆంధ్ర మహాసభ నిర్వహణకు తోడ్పడ్డారు. తెలంగాణా కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకులను సమన్వయ పర్చడంలో,సాయుధ పోరాటంలో కీలకపాత్ర వహించారు. భారత విప్లవోద్యమం గురించి స్టాలిన్‌తో చర్చించేందుకు అజయ్ ఘోష్, ఎస్ఏ డాంగే, బసవ పున్నయ్యలతో పాటు రాజేశ్వరరావు మాస్కో వెళ్ళారు. రాజేశ్వరరావు ఎంత పెద్ద నాయకుడైనా ఏమాత్రం అభిజాత్యాన్ని ప్రదర్శించకుండా, నిరంతరం ఏదో తెలుసు కోవాలనే తపనతో ఉండేవారు. పుచ్చలపల్లి సుందరయ్య పట్ల ఎంతో గౌరవం ఉన్నా, అవిభక్త కమ్యూనిస్టు పార్టీ చీలినప్పుడు ఆయన భారత కమ్యూనిస్టు పార్టీకి నేతృత్వం వహించారు. రాజేశ్వరరావు సిద్ధాంతాలతో ఏనాడూ రాజీ పడలేదు. ఇందిర ప్రభుత్వం తీసుకున్న ప్రగతి శీల చర్యలకు మద్దతు ఇస్తూనే, ఆమె నిరంకుశ పోకడలను తీవ్రంగా వ్యతిరేకించే వారు. 1970వ దశకంలో దేశవ్యాప్తంగా కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో సాగిన భూ ఆక్రమణ ఉద్యమం పార్టీ ప్రతిష్ఠను పెంచి, అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ ఉద్యమం విజయవంతం కావడంలో రాజేశ్వరరావు పాత్ర గణనీయం. ఆయన పిత్రార్జిత ఆస్తిలో తన వాటాను పూర్తిగా పార్టీకోసం వెచ్చించారు. పార్టీకి ఆయన విరాళంగా ఇచ్చిన లక్షలాది రూపాయిలతో ఆరోజుల్లో వందలాది ఎకరాలను కొనగలిగి ఉండేవారనేది వాస్తవం. ఆయన ఢిల్లీ వెళ్ళినా,ఎక్కడికి వెళ్ళినా పార్టీ కార్యాలయాల్లోనే బస చేయడం, తన బట్టలను తానే ఉతు క్కోవడం నిరాడంబర జీవితం తానికి ప్రబల నిదర్శనాలు. అక్టోబర్ విప్లవం 60వ వార్షికోత్సవాల సందర్భంగా భటిండాలో జరిగిన పార్టీ మహాసభలో ఆమోదించిన తీర్మానం చరిత్రాత్మకమైనది. రాజేశ్వరరావు సోవియట్ యూనియన్‌లో గోర్బాచెవ్ ప్రవేశపెట్టిన సహకార వ్యవసాయం, కాంట్రాక్ట్ సేద్య విధానాలను రాజేశ్వరరావు సమర్థించారు. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తరువాత సంభవించిన పరిణామాల పట్ల ఆయన చివరి రోజుల్లో ఎంతో కలత చెందారు. ప్రపంచంలో ఎక్కడ ప్రగతి శీల పోరాటాలు జరిగినా వాటికి ఆయన మద్దతు ప్రకటించేవారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు అనేక సమస్యలపై ఒకే అభిప్రాయాన్ని కలిగి ఉన్నప్పటికీ, సిపిఎం వ్యతిరేక ధోరణి వల్ల ఉభయ కమ్యూనిస్టు పార్టీల పునరేకీకరణ ప్రక్రియ ఆలస్యమవుతోందని ఆవేదన చెందేవారు. ఆయన ఎన్నో పురస్కారాలను పొందినా,1994 లో పొందిన సోవియట్ యూనియన్ ఆర్డర్ ఆఫ్ లెనిన్ పురస్కారం అత్యంత ప్రతిష్ఠాకరమైనది. సుదీర్ఘకాలం పార్టీకోసం అహర్నిశలు కృషిచేసిన రాజేశ్వరరావు 80 వ ఏట 1994 ఏప్రిల్ 9వ తేదీన హైదరాబాద్‌లో కన్నుమూశారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**




## భాషా వివాద నేపథ్యం.. కమల్‌హాసన్ రాజ్యసభ నామినేషన్ వాయిదా

'థగ్ లైఫ్' సినిమా ఈవెంట్‌లో కన్నడ భాషపై మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగిన సంగతి తెలిసిందే. ఈ భాషా వివాదం నేపథ్యంలో ఆయన రాజ్యసభ స్థానానికి నామినేషన్ దాఖలు చేయడాన్ని వాయిదా వేసుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. త్వరలో విడుదల కాబోయే తన చిత్రం 'థగ్ లైఫ్' వ్యవహారాలు పూర్తయిన తర్వాతే నామినేషన్ వేయాలని భావిస్తున్నట్లు తెలిపాయి. కమల్ 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించారు. విపక్ష ఇండియా కూటమిలో ఇది భాగం. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలు, పుదుచ్చేరిలోని ఒక స్థానంలో ఎంఎన్ఎం ప్రచారం చేసింది. 2025 ఎగువసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వంలోని కూటమి అంగీకరించింది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకేతో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం ఎంఎన్ఎంకు ఎగువసభ స్థానం కేటాయించారు. దీంతో కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లనున్నారనే విషయాన్ని డీఎంకే–ఎంఎన్ఎం ఇటీవల ఖరారు చేశాయి. ఇటీవల నిర్వహించిన 'థగ్‌లైఫ్' సినిమా ఈవెంట్‌లో తమిళం నుంచే కన్నడ పుట్టిందని కమల్ వ్యాఖ్యానించడంతో భాషా వివాదం మొదలయ్యింది. కమల్ వ్యాఖ్యలను కన్నడ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో కర్ణాటకలో థగ్‌లైఫ్ చిత్రాన్ని నిషేధించాలని కోరుతూ ఆ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ) హైకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్‌ను మంగళవారం విచారించిన న్యాయస్థానం కమల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని వ్యాఖ్యానించింది. దీంతో ఈ చిత్రాన్ని కర్ణాటకలో ప్రస్తుతానికి విడుదల చేయకూడదని కమల్‌హాసన్ నిర్ణయించారు. అనంతరం, తన వ్యాఖ్యలను అపార్థం చేసుకున్నారంటూ 'కేఎఫ్‌సీసీ'కి కమల్ లేఖ రాశారు. అయితే, అందులోనూ సారీ చెప్పకపోవడం గమనార్హం.




పాకిస్తాన్‌లో జైల్లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కరాచీలోని మాలిర్ జైల్లో ఖైదీలుగా ఉన్న వారిలో 200 మంది తప్పించుకున్నట్లు తెలుస్తోంది. సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. జైలు ప్రవేశ ద్వారాన్ని బద్ధలుకొట్టి మరీ ఖైదీలు పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఖైదీలపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సుమారు 20 మంది ఖైదీలు చనిపోయినట్లు సమాచారం అందుతోంది. పాకిస్తాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో మే 30వ తేదీన 4.2 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ క్రమంలో మాలిర్ జైలు పరిసర ప్రాంతాల్లో కూడా భూకంపం రావొచ్చన వార్తల నేపథ్యంలో పోలీసులు అలెర్ట్ అయ్యారు. జైల్లో ఉన్న ఖైదీలను మరో ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. అయితే ఇదే అదునుగా భావించిన ఖైదీలు.. పోలీసులపై దాడి చేసి మరీ తప్పించుకున్నారు. ఖైదీల పరారీ ఘటనతో కరచా వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జైలు పరిసర ప్రాంతాల్లో సాధారణ ప్రజలు ఎవరూ సంచరించవద్దని పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ ఘటనపై పోలీసు అధికారులు మాట్లాడుతూ, జైలును సీజ్ చేశామని తెలిపారు. అలాగే కరాచీలోని అన్ని ప్రాంతాల్లో సెర్చ్ ఆపరేషన్ చేపట్టామన్నారు. ఈ ఘటనలో కొంతమంది ఖైదీలు, పోలీసులు గాయపడినట్లు తెలిపారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.




మహారాష్ట్రలో ఇకపై 1వ తరగతి నుంచే విద్యార్థులకు బేసిక్ మిలిటరీ శిక్షణనివ్వాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, శారీరక వ్యాయామం వంటి సద్గుణాలు పెంపొందించడానికి బేసిక్ మిలిటరీ శిక్షణ ఇస్తామని మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భూసే పేర్కొన్నారు. దీనిద్వారా అత్యతసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే విషయంపై వారికి అవగాహన ఉంటుందన్నారు. దీనికోసం విద్యార్థులకు మాజీ సైనికులతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో మాజీ సైనికులు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దేశం పట్ల ప్రేమ పెరుగుతుందని వ్యాఖ్యానించారు. ఈ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సానుకూలంగా స్పందించారని విద్యాశాఖ మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని అమలుచేయడానికి క్రీడా ఉపాధ్యాయులు, నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ), స్కౌట్స్, గైడ్స్‌తో పాటు 2.5 లక్షల మంది రిటైర్డ్ సైనికుల సహాయం తీసుకుంటామని దాదా భూసే పేర్కొన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, అనంతరం భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈ ప్రతిపాదనను తీసుకువచ్చినట్లు తెలిపారు.

**భారత్ వెంటే బ్రిటన్..** పహల్గాం లోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవికంగా దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆగ్రహించిన భారత ప్రభుత్వం ఉగ్రవాదులను పోషిస్తున్న పాక్‌పై దౌత్యపరమైన చర్యలు తీసుకుంది. భూకంపాలు, అగ్ని ప్రమాదాలు, వరదలు, ఉగ్రవాద దాడులు వంటివి సంభవించినప్పుడు ప్రజలు, అధికారులు ఎలా వారి ప్రాణాలు కాపాడుకోవాలో అవగాహన కల్పించడానికి దేశవ్యాప్తంగా 259 లొకేషన్లలో మాక్ డ్రిల్స్ నిర్వహించింది.

# తెలుగు చెల్లెళ్లు కవిత.. షర్మిల.. అదేంటో అన్నీ మూడక్షరాలే!

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో తండ్రుల వారసత్వంగా ఎదిగిన కుమారులు ఉన్నారు కానీ.. కుమార్తెలు చాలా తక్కువ. కానీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత, దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారాల తనయ వైఎస్ షర్మిలలు మాత్రం తండ్రులు వారసత్వాన్ని ఘనంగా కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరూ తమ తండ్రులకు ముద్దుల కూతుళ్లే. ఇద్దరూ ఒకప్పుడు అన్నలకు గారాల చెల్లెళ్లే. ఇప్పుడు విభేదించడంలోనూ అదే పంథాలో వెళ్తున్నారు. పెళ్లి అయి దశాబ్దాలు గడిచినా పుట్టింటి పేరును కొనసాగిస్తూ వస్తున్నారు షర్మిల, కవితలు. ఇక ఈ ఇద్దరి విషయంలో మరో సారూప్యత మూడు అక్షరాలు. అది.. ఒకటీ రెండు అంశాల్లో కాదు.. పలు అంశాల్లో కావడం గమనార్హం. కల్వకుంట్ల కవిత.. పేరులో మూడు అక్షరాలు ఉండగా.. వైఎస్ షర్మిల పేరులోనూ అంతే. ఇద్దరి భర్తల పేర్లు కూడా ఒకటే.. అదీ ఒకే పేరునూ. షర్మిల భర్త పేరు అనిల్, కవిత భర్త పేరు కూడా అనిల్ కావడం గమనించదగ్గ విషయం. కవిత తండ్రి పేరు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అయితే షార్ట్ కట్ లో కేసీఆర్ అని పిలుచుకుంటారు. షర్మిల నాన్న పేరు వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాగా.. వైఎస్సార్ అని వ్యవహరించేవారు. ఈ ఇద్దరి పేరులోనూ శేఖర్ ఉండడం మరో విషయం.

కవిత అన్న కల్వకుంట్ల తారక రామారావును కేటీఆర్ ను సంబోధిస్తుండగా.. షర్మిల సోదరుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని జగన్ అని పిలుస్తుంటారు. ఈ పోలికల సంగతి పక్కనపెడితే షర్మిల, కవిత ఇద్దరూ తండ్రి వారసత్వంతో రాజకీయాల్లో ఎదగాలని ప్రయత్నిస్తున్నారు. తొలుత అన్నల బాటలోనే ఉన్నా.. ఇప్పుడు వారినే విభేదిస్తున్నారు. అన్న వైఎస్ జగన్ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు షర్మిల అడుగు బయటపెట్టి పాదయాత్ర చేశారు. తర్వాతి కాలంలో తీవ్రంగా విభేదించారు. సొంతంగా వైఎస్సార్ తెలంగాణ పార్టీ (వైటీపీ)ని స్థాపించారు.

కాంగ్రెస్ లో విలీనం చేసి ప్రస్తుతం ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా ఉన్నారు. కవిత 20 ఏళ్ల కిందట తెలంగాణ జాగృతిని స్థాపించారు. ఉద్యమ సమయంలో ఆ సంస్థ పేరిట తెలంగాణ కల్చర్ వ్యాప్తికి తనవంతు ప్రయత్నాలు సాగించారు. తాజాగా జాగృతి సొంత కార్యాలయాన్ని తెరిచారు.కవిత ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. షర్మిలను కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక నుంచి రాజ్యసభకు పంపుతారని ప్రచారం జరిగినా కార్యరూపం దాల్చలేదు...ఇదీ ఇద్దరు తెలుగు నాయకురాళ్ల విషయంలో సారూప్యత.

చురకలు
సంపాదకీయం

# అమెరికా వర్సెస్ ఇరాన్ అణుయుద్ధం తప్పదా?

అణ్వాయుధాల అభివృద్ధి విషయంలో ఇరాన్ మరియు అమెరికా మధ్య మళ్లీ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టెహ్రాన్‌కు తీవ్రమైన హెచ్చరికలు జారీ చేయడంతో పరిస్థితి మరింత దిగజారింది. అణు ఒప్పందానికి అంగీకరించని పక్షంలో ఇరాన్‌పై బాంబు దాడులు చేసేందుకు కూడా వెనుకాడబోమని ట్రంప్ తేల్చి చెప్పడంతో టెహ్రాన్ అప్రమత్తమైంది. తాజా సమాచారం ప్రకారం, ఇరాన్ తన క్షిపణులను సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. స్థానిక మీడియా కథనాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. టెహ్రాన్ టైమ్స్ కథనం ప్రకారం, ఇరాన్ దేశవ్యాప్తంగా ఉన్న భూగర్భ ప్రయోగ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో క్షిపణులను లాంచ్‌ప్యాడ్‌లపై సిద్ధంగా ఉంచింది. వైమానిక దాడుల కోసం వీటిని ప్రయోగించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒకవేళ అత్యవసర పరిస్థితులు ఎదురైతే, అమెరికాకు సంబంధించిన ప్రాంతాలపై దాడులు చేసేందుకు ఈ క్షిపణులను ఉపయోగించనున్నట్లు ఆ కథనం పేర్కొంది. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో మరింత ఆందోళన కలిగిస్తోంది. అణు ఒప్పందం విషయంలో అమెరికా ప్రత్యక్ష చర్చలకు ఆహ్వానించగా, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ దానిని తిరస్కరించారు. అయితే, పరోక్షంగా చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన డొనాల్డ్ ట్రంప్ ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ టెహ్రాన్‌ను తీవ్రంగా బెదిరించారు. "ఒకవేళ అణు ఒప్పందం కుదుర్చుకోవడానికి టెహ్రాన్ నిరాకరిస్తే, బాంబు దాడులు తప్పవు. ఆ దేశం మునుపెన్నడూ చూడని స్థాయిలో ఈ దాడులు ఉంటాయి. అంతేకాకుండా, వారు మరోసారి తీవ్రమైన ఆంక్షలు ఎదుర్కోవలసి ఉంటుంది" అని ట్రంప్ హెచ్చరించారు. అయితే, ఇరాన్‌తో పరోక్ష చర్చలకు ఆయన అంగీకరిస్తారా లేదా అనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఇరాన్‌తో సంబంధాలు పూర్తిగా క్షీణించాయి. 2018లో ఆయన అధ్యక్షుడిగా ఉన్నప్పుడే అమెరికా అణు ఒప్పందం నుంచి ఏకపక్షంగా వైదొలిగింది. అంతేకాకుండా, టెహ్రాన్‌పై అనేక ఆంక్షలు విధించింది. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఎన్నోసార్లు పరోక్ష చర్చలు జరిగినప్పటికీ, అవి ఫలప్రదం కాలేదు. ఈ నేపథ్యంలో, ఇటీవల డొనాల్డ్ ట్రంప్ మరోసారి అణు ఒప్పందం కుదుర్చుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. అయితే, ఆయన షరతులు మరియు హెచ్చరికలు ఇరాన్‌ను మరింత ఆగ్రహానికి గురిచేస్తున్నాయి. ఇరాన్ మాత్రం తమ క్షిపణి కార్యక్రమాన్ని సమర్థించుకుంటోంది. తమ రక్షణ కోసం క్షిపణులు తప్పనిసరి అని ఆ దేశం వాదిస్తోంది. అమెరికా మరియు దాని మిత్రదేశాల నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో, తమను తాము కాపాడుకునేందుకు క్షిపణులు సిద్ధంగా ఉంచుకోవడం సరైన చర్యేనని ఇరాన్ పేర్కొంటోంది. అయితే, అంతర్జాతీయ సమాజం మాత్రం ఇరాన్ చర్యలను ఆందోళనకరంగా పరిగణిస్తోంది. అణు ఒప్పందం విషయంలో నెలకొన్న ప్రతిష్టంభన మరియు ఇరు దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ శాంతికి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ట్రంప్ యొక్క కఠినమైన వైఖరి మరియు ఇరాన్ యొక్క ప్రతిస్పందన చూస్తుంటే, రాబోయే రోజుల్లో ఈ పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశం కనిపిస్తోంది. అణు ఒప్పందం విషయంలో ఇరు దేశాలు ఒక పరిష్కారానికి వస్తాయా లేదా అనేది వేచి చూడాలి. అయితే, ప్రస్తుత పరిస్థితులు మాత్రం మధ్యప్రాచ్యంలో శాంతి మరియు భద్రతకు పెను సవాలుగా నిలుస్తున్నాయి. అంతర్జాతీయంగా పలు దేశాలు ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, ఫలితం మాత్రం ఇంకా అస్పష్టంగానే ఉంది.

# "పరమ పవిత్రమైనది నిర్జల ఏకాదశి"



తిథులు అన్నింటిలోకి ఏకాదశి చాలా పవిత్రమైనది. ఇది ఉపవాసాలకు ఉద్దిష్టమైన దినం. ఏకాదశి 15 రోజులకు ఒకసారి వస్తుంది. పక్షానికి ఒకటి, మాసానికి రెండు చొప్పున సంవత్సరానికి ఇరవై నాలుగు, అధిక మాసం వచ్చే సంవత్సరంలో ఇరవై ఆరు ఏకాదశులు వస్తాయి. వస్తాయి ఇవన్నీ ప్రత్యక్ష పర్వాలుగా ఆచరించ బడతాయి "పద్మ పురాణం ఉత్తర ఖండం"లో ఏకాదశి వ్రత మహత్యం వివరించబడింది. ఏకాదశి సకలోపద్రవ నాశక మైనది. దీనితో సమానమైన వ్రతం లేదు. ఏకాదశ ఇంద్రియాలచే, చేసిన పాపాలన్నీ ఏకాదశి ఉపవాసంతో నశిస్తాయి. సకల వర్ణాల వారికి, ఆశ్రమ వాసులకు, స్త్రీలకు, ఏకాదశి వ్రతం చేయదగినది. దశమితో కూడిన ఏకాదశిని వర్జించి, పరిశుద్ధమైన ఏకాదశి యందు ఉపవాసం చేయాలి. దశమి నాడు ఏకభుక్తం చేసి ఆ రాత్రి కటిక నేలపై పరుండి, మరునాడు ఏకాదశినాడు, ఉసిరిక నూరి శరీరానికి పూసుకుని స్నానమాచరించి, ఉపవాసం ఉండి, పురాణ పఠనా తత్పరులై, పగలు నిద్రింపక, రాత్రి వరకు కటిక నేలపై విశ్రమించి ద్వాదశినాడు పూజ పారణ భోజనం చేయాలి. ఏకాదశి అన్నింటిలోనూ కఠినతరమైనది "నిర్జల ఏకాదశి". జేష్ఠ శుద్ధ పాడ్యమి నుండి దశమి వరకు "గంగోత్సవాల"ను నిర్వహించడం ఆచారం. జేష్ట మాసం లో ఎండలు మెండుగా ఉంటాయి. భూమిలో నీటి మట్టం చాలావరకు అడుగుకు పోతుంది. అట్టి గడ్డు వేసవిలో, ఏకాదశి ఈనాడు, పచ్చి మంచి నీళ్ళు అయినా పుచ్చుకోకుండా, ఉపవాస దీక్ష ఆచరించడం సనాతన సాంప్రదాయ ఆచారం. అందుకే దీనికి "నిర్జలైకాదశి" అని పేరు వచ్చింది. నిర్జలైకాదశి "భీముని" వలన ఏర్పడినట్లు పురాణగాథ ఉంది భీముడు తిండిపోతు. ఒక పూట కూడా తిండి లేకుండా అస్సలు ఉండలేడు. అందుచేత దశమి నాడు ఏకభుక్తం చేసి, ఏకాదశి నాడు ఒక పూట అయినా భోజనం లేకుండా, ఉపవాసం ఉండే ప్రసక్తే ఆయనకు రాదు. పాండవులు అంతా ఏకాదశి వ్రతాచరణ చేస్తుండగా, భీముడు ఆచరించ లేక పోయేవాడు. అయితే భీముడు వేదవ్యాస మహర్షిని సంప్రదించగా, "జేష్ట మాసం లో సూర్యుడు వృషభ రాశి నుండి మిధున రాశి లో ప్రవేశిస్తాడు, కనుక అప్పుడు "నీవు జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి నాడు నీళ్లు కానీ ముట్టకుండా, అన్నం తినకుండా ఉండాలి, అలా చేస్తే, ఏడాదిలో ఇరవై నాలుగు ఏకాదశి వ్రతాలు చేసిన ఫలితం నీకు సమ కూర గలదు" అని వ్యాసుడు వివరించగా భీముడు ఆచరించడం జరిగింది. తద్వారా భీముడు ఏడాది ఏకాదశి వ్రత ఫలం పొందినట్లు చెప్పబడింది. అందుకే దీనిని "భీంసేని ఏకాదశి" అని కూడా అంటారు. "స్మృతి కౌస్తుభం", "చతుర్వర్గ చింతామణి" గ్రంథాలలో నిర్జలైకాదశి గురించి విపులీకరించ బడింది. నిర్జల ఏకాదశి నాడు విష్ణు పూజ చేయడం పరిపాటి. విష్ణు ప్రతిమకు, సాలగ్రామకు పంచామృత అభిషేకం, జలాభిషేకం, పుష్ప, ఫల, హారతి సమర్పణ, వస్త్రాలు, ధాన్యాలు, గొడుగులు, విసనకర్రలు, ఉద కుంభాలు, వస్త్రాలు, బంగారం, గోవు,మంచం దానం చేయడం, రాత్రి జాగరణ, విధాయక కృత్యాలు. బ్రాహ్మీ ముహూర్తంలో "విష్ణు సహస్రనామాల" తో ప్రారంభించి, "ఓం నమో భగవతే వాసుదేవాయ" మహా మంత్ర జపం చేస్తూ ఉండాలి. రామాయణ సంబంధ అరణ్య కాండ పఠించాలి. తల్లిదండ్రుల, గురువుల ఆశీస్సులు పొంది, ఆధ్యాత్మిక పుస్తక దానం చేయడం పుణ్యప్రదం.

మానవులతో పాటు, జంతువులకు పక్షులకు ఆహారం, శీతల పానీయాలు ఇవ్వాలి. నిర్జల ఏకాదశి వ్రతాచరణ ద్వారా మోక్ష ప్రాప్తియే కాకుండా, ఆచరించినవారికి "యమపురి" ఉండదని, మరణానంతరం నేరుగా వైకుంఠ లోక ప్రాప్తి లభించ గలదని, పురాణాలు స్పష్టం చేస్తున్నాయి.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# సకల మంత్రాలకు మూల శక్తి గాయత్రి - జ్యేష్ఠ శుక్ల ఏకాదశి గాయత్రీ జయంతి

వేదమాత గాయత్రీదేవి మంత్రాన్ని బ్రహ్మర్షి విశ్వామిత్రుడు ప్రవచించిన దినమైన జ్యేష్ట శుక్ల ఏకాదశినాడు గాయత్రీ జయంతిని ఘనంగా జరుపుతారు.

**ముక్తా విద్రుమ హేమనీల ధవళచ్ఛాయై ముఖైస్త్రీ క్షణైః**
**యుక్తామిందు నిబద్ధరత్న మకుటాం తత్త్వార్థ వర్ణాత్మికామ్**
**గాయత్రీం వరదాభయాం కుశకశా శ్శుభ్రం కపాలం గదాం**
**శంఖం చక్ర మథారవింద యుగళం హస్తైర్వహంతీం భజే!**

గాయత్రి సకల వేద స్వరూపిణి. అన్ని మంత్రాలకు మూల శక్తి. అందుకే గాయత్రి మంత్రం మూలమంత్రం. గాయత్రి మాత ఐదు ముఖములతో ప్రకాశిస్తూ ఉంటుంది %-% అవి ముక్త, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలలో ప్రకాశిస్తూ ఉంటాయి. చేతులలో శంఖ, చక్ర, గద, అంకుశాదులు ధరించి దర్శనమిస్తుంది. పురాణాల ప్రకారం ఆమె ముఖంలో అగ్ని, శిరస్సులో బ్రహ్మ, హృదయంలో విష్ణువు, శిఖపై రుద్రుడు ఉంటారని వివరించ బడింది. నగాయత్ర్యాః పరమం మంత్రం న మాతుః పరదైవతమ్" గాయత్రికి మించిన మంత్రం లేదు. తల్లిని మించిన దేవత లేదనునది దివ్యసూక్తి. "గాయత్రీ ఛందసామహమ్" అని బుక్కులలో గాయత్రీ మంత్రమును నేనని భగవద్గీతలో గీతాచార్యుడు నొక్కి వక్కాణించటంలో గాయత్రీ మంత్ర మహిమ విశేషంగా విశదమవుతుంది. గాయత్రి మంత్రము మొదటగా ఋగ్వేదములో చెప్పబడింది. గయలు' అనగా ప్రాణములు అని అర్థము. 'త్రాయతే' అనగా రక్షించడం. కనుక ప్రాణములను రక్షించే మంత్రం గాయత్రీ మంత్రం. గాయత్రి అనే పదము 'గయ', 'త్రాయతి' అను పదములతో కూడుకుని ఉంది. "గయాన్ త్రాయతే ఇతి గాయత్రీ" అని ఆదిశంకరులవారు తన భాష్యములో వివరించారు. వాల్మీకి రామాయణానికి మూలాధారం గాయత్రీ మంత్రమే. గాయత్రీ మహామంత్రానికి వ్యాఖ్యాన రూపంలో ఈ మహాకావ్య రచన జరిగిందని అంటారు. వాల్మీకి మహర్షి ప్రతి వేయి శ్లోకాలకు మొదట ఒక్కొక్క గాయత్రి మంత్రాక్షరమునుచేర్చి 24 అక్షరములతో 24,000 శ్లోకాలతో శ్రీ మద్రామాయణమును రచించారు. గాయత్రీ మంత్రంలో యిరువది నాలుగు అక్షరములతో పాటు యిరువది నాలుగు దేవతా మూర్తుల శక్తి అంతర్గతంగా నుండును. ఈ యిరువది నాలుగు గాయత్రీ మూర్తులకు చతుర్వింశతి గాయత్రీ అనిపేరు. ఇరవై నాలుగు దేవతా మూర్తులకు మూలాధారమైన గాయత్రీ మంత్రాన్ని జపిస్తే కీర్తి, దివ్య తేసస్సు, సకల సంపదలు, సమస్త శుభాలు కలుగుతాయి. గాయత్రీ దేవతకే సంధ్యాదేవి అని కూడా పేరు. ప్రాతఃకాలంలో గాయత్రిగా, మధ్యాహ్నం సావిత్రిగా, సాయంత్రం సరస్వతిగా ఆ శక్తి తన తేజో విశేషం చేత మూడు పేర్లతో మూడు రూపాలతో గోచరిస్తూ ఉంటుంది. గాయత్రీ మంత్రానికి నాలుగు పాదాలు. ఒక్కొక్క పాదంలో ఎనిమిగి అక్షరాలు. మొదటి మూడు పాదాలూ ఋగ్యజుస్సామ వేదాల నుండి, నాల్గవ పాదం అథర్వ వేదం నుండి ఉద్భవించాయి. అందువల్లనే గాయత్రీ దేవతను వేదజననిగా ఆరాధిస్తూ ఉంటారు. మొదటి మూడు పాదాల్లో ఐరవై నాలుగు అక్షరాలతో ఉన్న మంత్రాన్నే ద్విజులు త్రిసంధ్యలలోనూ జపిస్తూ ఉంటారు. ఉదయ సంధ్య నక్షత్రాలు



ఆకాశంలో కన్పిస్తూండగాను, మధ్యాహ్న సంధ్య, సూర్యుడు ఆకాశ మధ్యంలో ఉండగాను, సాయంసంధ్య సూర్యస్తమయం కంటె ముదుగాను అచరించాలని పెద్దల ఉవాచ. సర్వసహితమైన వేదమంత్రము ఈ గాయత్రి. ఈ ఉపాసనవల్ల అనంతమైన సత్ఫలితాలను పొందగలరని సంప్రదాయ ఆచరణా సక్తుల విశ్వాసం.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# "తొలి హైందవ సామ్రాజ్య నిర్మాత శివాజీ"

పుణ్యభూమి అయిన భారతావనిలో అనేకానేక దేశ భక్తులు తమ జీవితమే ధర్మంగా, ధర్మ ప్రతిష్టాపనే లక్ష్యంగా, కర్తవ్య పరాయణత్వమే ధ్యేయంగా జీవించి ధన్యులైనారు. వారిలో నిత్య స్మరణీయుడు శివాజీ. శాలివాహన శకం 1596 ఆనంద నామ సంవత్సరం జ్యేష్ఠ శుక్ల త్రయోదశి శనివారం సూర్యోదయాత్ పూర్వం మూడు ఘడియల ముహూర్తాన 1674 జూన్ 6న, చత్రపతి శివాజీ సింహాసనాన్ని అధిష్టించాడు. తద్వారా తొలి స్వరాజ్య సంస్థాపకుడైనాడు. అందుకే జ్యేష్ఠ శుక్ల త్రయోదశిని "హిందూ సామ్రాజ్య దినం"గా జరుపుకుంటారు. నేలకొరిగిన హిందూ ధ్వజాన్ని, మళ్లీ ఉత్తుంగ శిఖరాలలో ఎగురవేసి, మృతప్రాయమై ఉన్న హిందుత్వంలో అమృతాన్ని నింపి, ప్రాణప్రతిష్ట చేసిన మహనీయుడు శివాజీ. అతి సామాన్య బాల్యం, సాహసోపేత యవ్వనం, ప్రదర్శిత ధైర్యం, రాజనీతిజ్ఞత, చతురత, హిందువులలో మేల్కొల్పిన ఆ పూర్ణ దేశభక్తి అజరామరాలు. మహారాష్ట్ర ప్రాంతంలో, యాదవులు స్థాపించిన హిందూ సామ్రాజ్యం, 1307 మార్చి 24 తో ఢిల్లీ సుల్తాను ఖిల్జీ ద్వారా నాశనము చేయబడగా, 350 ఏళ్ళ వరకు మరియొక ఒక హిందూ సామ్రాజ్యమే లేకుండెను. ఔరంగాబాద్ సమీపాన వేరూడ్ గ్రామానికి చెందిన మాలోజీ రావు అహ్మద్ నగర్ సుల్తాన్ నిజాం షాహీ కొలువులో ఉద్యోగియై, శక్తియుక్తులతో పూనా జాగీరును సంపాదించాడు. మొగలులతో యుద్ధం చేస్తూ 1605 లో మరణించాడు. అప్పటికి మాలోజి రావుకు 5ఏళ్ల శహాజి, 3 ఏళ్ల అరిఫ్ జీ కుమారులు ఉండిరి. మాలోజీ తమ్ముడగు విటోజీ వద్ద పెరగగా, నాటి నిజాం షాహీ కొలువులోని సర్దార్ లఖుజీ రావు కూతురు జిజియాబాయితో శహాజీ వివాహం జరిగింది. చిన్నతనంలోనే అత్త వారి ఇంటికి వచ్చిన జియాకు దేశ పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగింది. గోవధలు, దేవాలయాలు విగ్రహాల ధ్వంసాలు, ఆస్తుల దోపిడీలు, ఇళ్ల దహనాలు చూశాక ఆమెలో జుగుప్స రేగింది. బాల్యముననే రామాయణ, భారతాది గ్రంథాల పఠనం మూలంగా, విదేశీ పాలన నుండి విముక్తి కలిగి, రామరాజ్య స్థాపన కావాలనే కోరిక ప్రబలమైన నిలిచింది. జిజియాబాయి తండ్రి లఖుజీ రావు కు ముగ్గురు కుమారులు కాగా, వారి పలుకుబడులు నిజాం షాహికి కన్నెర్ర గావించగా, తన రాజధాని యగు దౌలతాబాద్ కు, ఆయన కుమారులను పథకం ప్రకారం పిలిపించి, నలుగురిని 1629 జూలై 25 ఆషాడ పౌర్ణమి నాడు హత్య గావించాడు. శహాజీ మొగలుల వద్ద పనిచేస్తున్న సమయాన, 1630 ఫిబ్రవరి 19వ తేదీన, "భావి హైందవసామ్రాజ్య నిర్మాత" అయిన శివాజీ జన్మించాడు. శహాజీ తన జాగీరు పాలనా నిర్వహణకై, పండితుడు, పాలనాదక్షుడు "దాదాజీ కొండదేవ్" అనే బ్రాహ్మణుని నియమించుకోగా, జిజియాబాయి, కుమారునితో సహా ఆయన పర్యవేక్షణలో ఉండిరి. దాదాజీ కొండదేవ్, శివాజీకి వయసుకు తగ్గ విద్యలు, చక్కని శిక్షణనిచ్చి, పదవ ఏట వివాహం కూడా చేశాడు. వివాహానికి రాలేని తండ్రిని కలవడానికి బెంగళూరు వెళ్ళిన శివాజీకి,



తండ్రి బీజాపూర్ ను చూపించగా, తురుష్కుల వల్ల ఉజ్వలమైన విజయనగర సామ్రాజ్యం విధ్వంసం, ఫలితంగా కొల్లగొట్ట బడిన ధనముతో వారు ఆనందంతో తులతూగే సంఘటనలు, హృదయంలో ప్రతిష్ఠితాలైనాయి. శివాజీ స్వాతంత్ర్య భావాలను గ్రహించిన శహాజీ, తన కుమారుని పూనాకు పంపుతూ, శాం రావు రాంఘెకర్ అనే అనుభవజ్ఞుని పీష్వా గా నియమించాడు. దేశభక్తి ఉగ్గుపాలతోనే రంగరించుకున్న శివాజీకి, తల్లి శిక్షణ లోనే రామరాజ్యం వంటి హైందవ సామ్రాజ్యము నిర్మాణం చేయాలని కోరిక స్థిరపడింది. శివాజీ జాగీరు లో రాంఝా గ్రామపు పటేలు, ఒక స్త్రీని బలత్కారం చేయగా, శివాజీ 1645 జనవరి 28న పటేల్ ను బంధించ, వధించి, కాళ్లు చేతులు నరికించి శిక్షించాడు. అలా క్రమంగా ప్రజల అభిమాన పాత్రుడయ్యాడు. కాశ్మీరం నుండి కావేరి వరకు మధ్యనున్న చాందా గోండు వనం వదిలి, మిగిలిన దేశమంతా తురుష్కుల ఆధీనంలో ఉండెను. దేవగిరి, విజయనగరం రాజ్యాలు స్థాపించాక, రెండుసార్లు శహాజీ చేసిన ప్రయత్నాలు విఫలం కాగా, శివాజీ మిత్రులందరితో భవిష్యత్ సామ్రాజ్య నిర్మాణం కోసం పాటుపడిన దేవాలయం, కొండ గుహ, కీకారణ్యం, ఇసుక తిన్నె లాంటి ప్రదేశాలలో చర్చోప చర్చలు జరిపేవాడు. మొదట బీజాపూర్ సుల్తాన్ చే నిర్లక్ష్యం కాబడిన "కాన" లోయలోని "తోరణ దుర్గాన్ని" జయించి, హిందూ సామ్రాజ్య నిర్మాణానికి తోరణం కట్టాడు. అందు లభించిన నిధితో, తోరణ దుర్గానికి ఎదురుగా ఉన్న "మురుంబ దేవ" గిరి పై, కొత్త కోటను నిర్మించి "రాజ్ గఢ్" అని పేరు పెట్టాడు. తర్వాత "కువారి" కోటను వశం చేసుకున్నాడు. ఇవన్నీ పదహారేళ్ళ ముక్కు పచ్చలారని ప్రాయంలో శివాజీ చేసిన గొప్ప పనులు. తర్వాత "కొండనా కోట"ను తన స్వరాజ్యంలో కలుపు కున్నాడు. "శివరళ", "సుభాను మంగళి" దుర్గాలను వశపరచు కున్నాడు. ఇంతలో 1648 జూలై 25న శహాజీ, వజీరు ముస్తఫా, బాజీ ఘోర్పడెలు సైన్యంతో శహాజీ బంధించాడు. బీజాపూర్ సుల్తాన్ ను శరణు వేయడమా? తండ్రి ప్రాణమా? స్వరాజ్యమా? అనే ప్రశ్నలకు తల్లి జిజియాబాయి, తన మాంగల్యం కన్నా దేశభక్తిని ప్రోత్సహించి సమాధానం లభింప జేసింది. పురంధర కోటలో ఉన్న శివాజీ, కొద్ది సైన్యానికి ఫతేఖాను సైన్యానికి భీకర యుద్ధం జరగగా, శివాజీకే విజయం చేకూరి, చివరకు 1648 ఆగస్టు 8న ఫతేఖాను ఓడింప బడ్డాడు. పురంధర దుర్గంలో ఫతేఖాను, బెంగళూరులో ఫరాదఖాన్ ఓటమి పాలు కాగా, బీజాపూర్ లో శహాజీ కూడా 1649 మే 16న జేష్ఠ లేక పౌర్ణమి నాడు బంధ విముక్తుడైనాడు. 1654 మే 23న బీజాపూర్ సుల్తాన్ మహారాజ్ పంత్ మరణించగా, ఆయన నలుగురు కుమారుల తగవుల కారణంగా, శివాజీ వారిని బంధించి ఉచిత పదవులు కట్టబెట్టి, నేతాజీ పాల్కర్ అనే సర్దార్ ను అధికారిగా నియమించాడు. కృష్ణానది సమీప టావలి అధిపతి దౌలత్ రావు మృతి చెందగా, ఆయనకు సంతానం లేక పోగా, ఆయన భార్య దత్త పుత్రునిగా యశ్వంత రావు కు పదవిని ఇచ్చాడు. ఆయన శివాజీ అధికారానికి ఇష్టపడని కారణాన, 1656 లో యుద్ధంలో ఓడించి స్వరాజ్యంలో కలుపు కున్నాడు. దీనిలో అంతర్భాగంగా కొండ ప్రాంతమైన "రాయగిరి" కోట నే కొన్నాళ్ళకు శివాజీ రాజధానిగా "రాయగడ దుర్గం"గా ఏర్పడింది. 1956 నవంబర్ 2న బీజాపూర్ సుల్తాన్ ఆదిల్ షా చనిపోగా, మొగలు సామ్రాజ్య దక్షిణ సుబేదార్ ఐన, ఔరంగజేబు అనుమతిని పొంది, 1957 ఏప్రిల్ 23న రాజ్యంలో కలుపు కున్నాడు. బీజాపూర్ ప్రాంతంనుండి కోండ్వానా, కొంకణ, దండ రాజపురి, భీమండి, కళ్యాణి, మాహు తదితర కోటలను, పోర్చుగీసు వారి నుండి చోళ ప్రాంతాన్ని చేయించాడు. కటావ్, మయని, అష్టి, ఖరాహడ్, సుపే, కొల్హాపూర్, పనాలిఘడ్,ఎగావ్ తదితర కోటలను జయించాడు. ఔరంగజేబు సలహాదారులైన కార తలబ్ ఖాన్, నామదర్ ఖాన్, ఇనాయత్ ఖాన్, షహిస్త ఖాన్, భావ సింహ, జస్వంత్ సింహ తదితరులను ఓడించాడు. అహ్మద్ నగర్, సూరత్ నగరాలను లూటీ చేశాడు. అలా సాగిన శివాజీ జైత్రయాత్ర ఫలితంగా శాలివాహన శక 1596 ఆనంద నామ సంవత్సర జ్యేష్ట శుక్ల త్రయోదశి శనివారం సూర్యోదయాత్పూర్వ మూడు ఘడియల సుముహూర్తాన 1674 జూన్ 6 న సింహాసనాన్ని అధిష్టించాడు. రాజ్యాభిషేక అనంతరం రాజ్యారోహణం జరిగింది. ఆంగ్లేయుల రాయబారి హెన్రీ ఆక్సెండర్ మహారాజుకు ప్రణమిల్లి, 1600 రూపములను కానుకగా సమర్పించాడు. తన రాజ్యానికి అష్ట ప్రధానుల పారశీక నామాలను మార్చి, "సంస్కృత పేర్లు" పెట్టాడు. ప్రభుత్వ యంత్రాంగం సంస్కృతంలోనే సాగాలని రాజ్య వ్యవహార కోశము ను తయారు చేయించాడు. 30 సంవత్సరాలు శివాజీ ఆయన అనుచరులు చూపిన పరాక్రమాలు, కర్తృత్వ శక్తి, త్యాగశీలత, ధ్యేయ నిష్ఠ, హిందువులలో నూతనోత్తేజం నింపి, సార్వభౌమాధికార యుక్త స్వరాజ్యం స్థాపించ బడినది. 50 ఏళ్ల సామ్రాజ్య నిర్మాణ కృషి ఫలితంగా, దేహం పూర్తిగా అలసి పోగా, ఆరోగ్యం క్షీణించి, 1680 ఏప్రిల్ 3న చైత్ర శుక్ల పాడ్యమి నాడు శివాజీ తుది శ్వాస వదిలాడు.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

చురకలు



# విరామంలో.. విలువైన శిక్షణలో

రాజపేట : సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు, కోచింగ్ కేంద్రాలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతుండటం సహజం. అయితే పల్లెల్లో కూడా ఇలాంటి వాటిని నిర్వహిస్తే అపూర్వ ఆదరణ లభిస్తుందనేది వాస్తవం. కొంత కాలంగా సిద్దిపేట జిల్లా కేంద్రంగా సేవలు అందిస్తున్న 'అక్షయ ఫౌండేషన్' తన సేవలను ఇటీవల కాలంలో ఇతర జిల్లాలకూ విస్తరించింది. అందులో భాగంగా కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో ఎంపిక చేసిన గ్రామాల్లో మహిళలకు కుట్టుశిక్షణ కేంద్రాలను నిర్వహిస్తూ ప్రోత్సహిస్తుంది. ఇందుకు స్వల్పంగా రుసుము తీసుకుంటుండగా నిపుణులతో తర్ఫీదు, ప్రాక్టీసు అనంతరం ఫౌండేషన్ తరపున ధ్రువపత్రాలు సైతం అందిస్తుండటం విశేషం. కాగా పల్లెల్లో అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం



చేసుకునే క్రమంలో ఇక్కడి మహిళలు నిమగ్నమయ్యారు. ఇదివరకే రాజపేట మండలం బొందుగుల గ్రామంలో శిక్షణపూర్తి చేసుకున్న సుమారు 20 మంది మహిళలు ధ్రువపత్రాలు అందుకున్నారు. ప్రస్తుతం ఇదే మండలం పారుపల్లి, సింగారం గ్రామాల్లోని మహిళలకు ఈ కుట్టుశిక్షణ కొనసాగుతుంది. కుట్టుపని, చేతిపనితోపాటు స్వల్పంగా కుట్టుమిషన్ రిపేరు వస్తే చేసుకోవడానికి మెలకువలు సైతం నేర్పిస్తున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు.

ప్రయోగాత్మకంగా ఈ ప్రాంతంలో చేపడుతున్న ఈ శిక్షణ కేంద్రాలకు స్థానికుల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో ఎంబ్రాయిడరీతోపాటు ఆధునికం మేళవించేలా దుస్తులు కుట్టుపనిని చేపట్టే యోచనలో ఉన్నట్లుగా ఫౌండేషన్ వర్గాలు వెల్లడించాయి. సెలవు రోజులను సద్వినియోగం చేసుకోవడానికి ఇలాంటి శిక్షణ కేంద్రాలు ఎంతగానో ఉపకరిస్తాయని యువతులు, మహిళలు అభిప్రాయపడుతున్నారు.

# కరెంట్ పోతే కష్టమే..!

బాన్సువాడ: ప్లాట్ రిజిస్ట్రేషన్ నిమిత్తం పిట్లం మండలానికి చెందిన ఓ మహిళ (గర్భిణి) ఐదు రోజుల కిందట బాన్సువాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. ఆమె వచ్చిన కొద్దిసేపటి తర్వాత కరెంట్ పోయింది. పని పూర్తి కాకపోవడంతో మధ్యాహ్నం దాకా వేచి ఉన్నారు. దాదాపు మూడు గంటల తర్వాత కూడా కరెంట్ రాకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారులను ఆమె ప్రశ్నించారు. అందుకు బ్యాటరీలు పనిచేయడం లేదని వారు సమాధానమిచ్చారు. దీంతో అవస్థలు పడుతూనే సాయంత్రం వరకు ఉండి పనిచేసుకుని వెళ్లారు. బాన్సువాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కరెంట్ పోతే ప్రత్యామ్నాయ విద్యుత్తు వ్యవస్థ సరిగా లేక వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రోజూ కనీసం 12 నుంచి 15 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. గత ఆరు నెలలుగా ఇదే సమస్య ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసినా వారు బాగు చేయించడం లేదని, కొత్త బ్యాటరీలు కూడా కేటాయించడం లేదనే విమర్శలున్నాయి. దీంతో సమస్య కొనసాగుతూనే ఉంది. పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతుండటం విమర్శలకు తావిస్తోంది. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని చాలా కార్యాలయాల్లో సమస్య ఉందని సిబ్బందే చెబుతుండటం గమనార్హం.

**సబ్ రిజిస్ట్రార్ ఏమన్నారంటే.. :** ఈ విషయమై బాన్సువాడ సబ్‌రిజిస్ట్రార్



శివ మాట్లాడుతూ.. 'బ్యాటరీలు పనిచేయడం లేనిది వాస్తవమే. రెండు రోజుల కిందటే బాన్సువాడకు ఇన్‌ఛార్జిగా వచ్చాను. ఈ సమస్యను ఇప్పటికే గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు తెలియజేశారు. కొత్త బ్యాటరీలు వస్తున్నాయి. మరికొన్ని రోజుల్లో సమస్య తీరనుంది' అని తెలిపారు.

**రెగ్యులర్ అధికారి లేక...**

ఈ కార్యాలయానికి రెగ్యులర్ రిజిస్ట్రార్ లేకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొస్తున్నారు. దీంతో కార్యాలయ సమస్యలు పట్టించుకోవడం లేదు. ఏడాదిలోనే ఐదుగురు అధికారులు మారినట్లు సిబ్బంది చెబుతున్నారు. రెగ్యులర్ అధికారి లేకపోవడంతో కొందరు సిబ్బంది ఆలస్యంగా విధులకు వస్తున్నారు. దీంతో పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది.

# మాత్రలు వేస్తూ.. గుట్టుగా చిదిమేస్తూ..

ఆదిలాబాద్ : జిల్లాలో వైద్య చట్టాలు, నిబంధనలేవీ అమలు కావటం లేదని ఇటీవల జరిగిన ఘటనలు రుజువు చేస్తున్నాయి. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, గర్భ స్రావాలు చేయటం చట్టవిరుద్ధం. పీసీ పీఎన్‌డీటీ(ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీనాటల్ డయాగ్నొస్టిక్ టెక్నిక్స్ చట్టం-1994) ప్రకారం లింగ నిర్ధారణ చేస్తే శిక్షార్హులవుతారు. ఎంటీపీ(మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ) చట్టం-1971 ప్రకారం గర్భవతి అయిన మహిళలకు గర్భస్థ శిశివు కారణంగా ప్రాణాపాయం ఉండటం లేదా కడుపులో శిశువు మృతి చెంది ఉండటం స్కానింగ్ ద్వారా తెలిసినప్పుడు అర్హులైన వైద్యుల సమక్షంలోనే గర్భస్రావం చేయాల్సి ఉంది.

జిల్లాలో ఆర్ఎంపీ వైద్యులు ఇబ్బడిముబ్బడిగా గుట్టుచప్పుడు కాకుండా గర్భస్రావాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. డబ్బుకు ఆశ పడి గర్భస్రావం మాత్రలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. గర్భవతి నెలలను బట్టి నెలకి రూ.రెండు వేలకు పైచిలుకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మరికొందరు ఆర్ఎంపీలు ఇలాంటి వారిని తమకు తెలిసిన నర్సింగ్‌హోంలకు తీసుకెళ్లి గర్భస్రావాలు చేయిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారనే విమర్శలున్నాయి.ఆదిలాబాద్ పట్టణంలోని బంగారిగూడకు చెందిన సేపూర్‌వార్ ప్రశాంత్ తన భార్య ప్రవళికకు బలవంతంగా ఇటీవల గర్భస్రావం మాత్రలను వేశాడు. అతను కొత్తగా ఇల్లు కట్టుకుంటున్న సందర్భంగా భార్య గర్భవతి కావటం మంచి శకునం కాదన్న మూఢ నమ్మకంతో మాత్రలు ఇచ్చాడు. దీంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురవగా మొదట రిమ్స్‌కు అనంతరం హైదరాబాద్‌కు తరలించినప్పటికీ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది. అయితే గర్భస్రావం కోసం మాత్రలు ఇచ్చిన వారెవరన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గుడిహత్నూర్ మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల 17 ఏళ్ల బాలిక గర్భం దాల్చింది. కుటుంబ సభ్యులు అదే గ్రామంలోని ఒక ఆర్ఎంపీ వైద్యుడిని సంప్రదించగా ఏడు నెలల గర్భవతిగా ఉన్న ఆమెకు గర్భస్రావం మాత్రలు ఇచ్చారు.

# యువజన సంఘం.. సహకారం కనం



పరిగి : సమాజాభివృద్ధిలో యువత పాత్ర ప్రధానం. దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని నేతలు పదేపదే చెబుతుంటారు. ఇంతటి కీలకమైన వీరికి ప్రోత్సాహం అందడం లేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులోనూ వీరి కృషి ఎంతగానో ఉంటుంది. గతంలో ఇలాంటి యువకులు సంఘాలుగా ఏర్పడి ప్రజల మన్ననలు పొందిన ఘటనలు కోకొల్లలు. అయితే ప్రస్తుత పరిస్థితులు మారిపోయాయి. యువజన సంఘాలు నిస్తేజంగా మారాయి. ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక ముందు ఎన్‌వైకే ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించేవారు. అనంతరం రాష్ట్రం, జిల్లా విభజన తరువాత ఒక్కటీ లేవు. క్రమేణా సరైన మార్గనిర్దేశం లేకపోవడంతో పక్కదారి పడుతున్నారు. ఈ ప్రభావం సంఘాల లక్ష్యంపై ప్రభావం చూపుతోంది.

**కనిపించని సేవ:** ప్రతి గ్రామంలో దేశ నాయకుల పేరిట యువజన సంఘాల బోర్డులు కనిపించేవి. ఇలా జిల్లా వ్యాప్తంగా దాదాపు వందకు పైగా నమోదై ఉన్నాయి. అయితే క్షేత్రస్థాయిలో వీరి సేవలు ఎక్కడా కనిపించడం లేదు. రక్తదానం, మొక్కల పంపిణీ, పెంపకం, పచ్చదనం, పరిశుభ్రత, తమ గ్రామాలకు రోడ్లు వేసుకోవడం, గుంతలు పూడ్చడం, వ్యక్తిత్వ వికాస శిబిరాలు నిర్వహించడం, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం ఇవన్నీ గతమే అయ్యాయి.

**మత్తుకు బానిసలుగా:** జిల్లాలో ఇటీవల గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిలో అత్యధికంగా ఉన్నవారు యువకులే కావడం గమనార్హం. యువతల్లో అంతర్లీనమై ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఎలాంటి కార్యక్రమాలు నేడు జరగడం లేదు. అక్కడక్కడా కొందరు తలాకొంత పోగు చేసుకుని క్రీడల్లో పాల్గొంటున్నారు. బహుమతుల కోసం ఇతరులకు చేతులు చాచాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లాకు ప్రత్యేకంగా ఎన్‌వైకే కార్యాలయం ఏర్పాటు చేస్తే, దీని ఆధ్వర్యంలో 13 కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంది.

ఇలా చేస్తే మేలు..

జిల్లాలో నెహ్రూ యువకేంద్రం ఏర్పాటు చేయాలి.
యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం
నైపుణ్య శిక్షణ శిబిరాలను నిర్వహించడం
సంఘాలను ప్రోత్సహించడం
ప్రభుత్వ పథకాల్లో భాగస్వాములను చేయడం
వ్యసనాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించడం
వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టడం.

**కేంద్రాన్ని ప్రారంభించాలి..**

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడిచినా జిల్లాలో ఎన్‌వైకే కేంద్రం లేకపోవడం శోచనీయం. వెంటనే ప్రారంభించి మండలాల వారీగా వాలంటీర్లను నియమించాలి. ప్రభుత్వ పథకాల అమలులో యువకులను భాగస్వాములను చేయాలి. సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. వెంకటేష్‌గౌడ్, జిల్లా యువజన సంఘాల కన్వీనర్

# పల్లె పరిశుభ్రతకు.. కొత్త ప్రణాళిక




బొంరాస్‌పేట: గ్రామాల్లో స్వచ్ఛత, పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం కొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇంటింటికి చెత్త సేకరణ, ఘన, ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ, కాల్వలు, అంతర్గత రహదారుల శుభ్రతను మెరుగుపరిచేందుకు కొత్త ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. గ్రామాల్లో సర్పంచులు లేక పంచాయతీల్లో పారిశుద్ధ్య సమస్యలు పెరిగిపోవడం, సరిపడా కార్మికులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంతోనే పారిశుద్ధ్య జోన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గ్రామంలోని ఇళ్ల సంఖ్య ప్రకారం జోన్లను ఏర్పాటు చేశారు. చిన్న పంచాయతీలైతే కనిష్టంగా 2, పెద్దవైతే గరిష్టంగా 4 జోన్లను ఏర్పాటు చేశారు. ఈ కొత్త విధానంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

**పటాలను ఏర్పాటు చేసి:** జిల్లాలోని 594 పంచాయతీల్లో పారిశుద్ధ్య జోన్ల ప్రకారమే గ్రామాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు చేపడతారు. ఏయే ప్రాంతాలు ఏయే జోన్ పరిధిలోకి వస్తాయో పటాలను ఏర్పాటు చేయాలి. జోన్ల పరిధిలోని నివాస గృహాలు, కాలువలు, సీసీ రోడ్లు, వాటి పొడవు, ప్రభుత్వ సంస్థలు, ఖాళీ జాగాలను వాటిల్లో చూపించాలి. షెడ్యూలు ప్రకారం ఒక జోన్ పరిధిలోని కార్మికులతో పారిశుద్ధ్య సమస్యలను పూర్తిగా పరిష్కరించి, మరుసటి రోజు మరో జోన్‌లో పనులు ప్రారంభించనున్నారు. ఇలా జోన్ల ప్రకారం నాలుగు రోజులకు తగ్గకుండా రొటేషన్ పద్ధతిలో మళ్లీ అవే జోన్లలో పనులు చేపట్టే విధంగా ప్రణాళికలు రూపొందించారు. రోజువారీ పారిశుద్ధ్య నివేదికలో కూడా ఏ జోన్లలో పనులు చేస్తున్నారో అవే చిత్రాలను యాప్‌లో నమోదు చేస్తారు. **సేంద్రియ ఎరువుల తయారీ:** ఇళ్ల నుంచి సేకరించిన వర్థ్యాల నుంచి సగటున 300 గ్రాముల తడి, పొడి వ్యర్థాలు ఉత్పత్తి అవుతాయని ఒక అంచనా. డంపింగ్ యార్డుల్లో తడిచెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేసి నర్సరీల్లో మొక్కల పెంపకానికి వినియోగించడంతో పాటు, ఎక్కువైతే రైతులకు విక్రయించనున్నారు. పొడిచెత్తను తుక్కు దుకాణాలకు విక్రయించి వచ్చిన డబ్బులను పంచాయతీ జనరల్ ఫండ్‌కు జమ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం ప్రత్యేక రిజిష్టర్‌ను నిర్వహించాలని సూచనలు అందాయి. పంచాయతీ పరిధి జోన్లలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగం, చెత్త సేకరణతో వస్తున్న ఆదాయం తదితరాలను ఎంపీవో, డీఎల్‌పీవో, డీపీవోలు తనిఖీ చేస్తారు. పల్లె ప్రగతి యాప్‌లో కొత్త ప్రణాళికను అప్‌డేట్ చేయనున్నారు.

**గృహాల సంఖ్య ఆధారంగా: జయసుధ, డీపీవో**

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని పంచాయతీల్లో గృహాల సంఖ్య ఆధారంగా పారిశుద్ధ్య జోన్లను ఏర్పాటు చేశాం. ఈ విధానం వల్ల పారిశుద్ధ్యం మెరుగుపడుతుంది. సక్రమంగా అమలు చేయాలని ఆదేశాలిచ్చాం. పల్లెల పరిశుభ్రతే లక్ష్యమని సూచించాం..

# శిథిల వంతెనలపై భయంగా ప్రయాణం



గంగాధర : చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర, రామడుగు, చొప్పదండి మండలాల్లో పలు చోట్ల వంతెనలు శిథిలమై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఏటా వర్షాకాలంలో తెగుతుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలం మొదలు కావడంతో ఈ ఏడాది కూడా కష్టాల ప్రయాణం తప్పేలా లేదు.

**చువ్వలు తేలి.. దిమ్మెలు కూలి**

గంగాధర నుంచి బూర్గుపల్లి మీదుగా పెగడపల్లి మండలానికి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిపై లక్ష్మీదేవిపల్లి వద్ద వంతెన పూర్తిగా శిథిలమైంది. ఇనుప చువ్వలు తేలి ఇరువైపులా రక్షణ దిమ్మెలు కూలిపోయాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమయంలో ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. గ్రానైట్ లారీలు వెళ్లే సమయంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రెండేళ్ల కిందట భారీ వర్షాలకు నారాయణపూర్ చెరువు మత్తడి వరద ఉద్ధృతితో లక్ష్మీదేవిపల్లి వంతెనతో పాటు నాగిరెడ్డిపూర్, ఇస్తారుపల్లి, కురిక్యాల-కొండన్నపల్లి గ్రామాల వారధులు కూలిపోయాయి. వారం రోజుల పాటు వాహనాల రాకపోకలను మళ్లించారు. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు. లక్ష్మీదేవిపల్లిలోని వంతెనకు భారాస హయాంలో నిధులు మంజూరు కాగా అప్పటి ఎమ్మెల్యే రవిశంకర్ శంకుస్థాపన చేశారు. అయితే వంతెన సమీపంలో విద్యుత్తు లైన్ ఉందని పనులు చేపట్టడానికి గుత్తేదారు ముందుకు రాక నిధులు మళ్లిపోయాయి. దీంతో సమస్య అలాగే ఉంది.

**ఏటా అవే కష్టాలు**

చొప్పదండి మండలం రాగంపేట-ఆర్నకొండ గ్రామాల మధ్య పందివాగు ఉద్ధృతితో లోతట్టు వంతెన కూలిపోవడంతో రోజుల పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ శిథిల వంతెనకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఏళ్లుగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ముంచుకొస్తుండగా వరదలకు మళ్లీ సమస్యలు తలెత్తుతాయని, అధికారులు స్పందించి శిథిల వంతెనలకు మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**అప్రోచ్ రోడ్డుపై నిర్లక్ష్యం**

రామడుగులో ఇటీవల కొత్త వంతెన ప్రారంభం కాగా ఇరువైపులా అప్రోచ్ రోడ్డుపై బీటీ వేయకుండా మట్టి పోసి వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకే నీరు నిలిచి వాహనాలు మట్టిలో దిగబడ్డాయి. భూ నిర్వాసితులకు పరిహారం మంజూరు కాకపోవడంతో వారు బీటీ నిర్మాణానికి అడ్డు చెబుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బాధితులకు పరిహారం విడుదల చేసి ఇరువైపులా తారు పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# పేరుకే ఉచితం.. అంతా అనుచితం..!

ఎల్లారెడ్డి : మీరు చూస్తున్నది పెట్రోల్ బంక్‌లో గాలికొట్టే యంత్రం బోర్డు . దాని పక్కనే పెద్ద టైర్లు, రేకుల షెడ్డు. గాలి కొట్టే యంత్రం ఉంది. వాహనదారుల కోసం బంక్ నిర్వాహకులే రేకుల షెడ్డు వేసి యంత్రాన్ని ఏర్పాటు చేశారనుకొంటే పొరబడినట్లే.. బంక్‌లోని యంత్రం పని చేయకపోవడంతో ప్రైవేటు వ్యక్తులు వచ్చి ఏకంగా దుకాణమే తెరిచారు. ఒక్కొక్క చోదకుడి నుంచి రూ.పది, రూ.15 వరకు వసూలు చేస్తున్నారు. ఇది 161వ జాతీయ రహదారి పక్కన ఉన్న రాజుల్లా గేటు సమీపంలోనిది.

జిల్లాలోని పెట్రోల్ బంకులు డబ్బులు తీసుకొని వాహనదారులకు ఇంధనం పోసి పంపించే వ్యాపార కేంద్రాలుగా మారాయి. ప్రాంగణాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. వినియోగదారులకు ఉచితంగా అందించాల్సిన సేవలను నిర్వాహకులు అటకెక్కించారు. మూత్రశాలలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలతో పాటు టైర్లలో ఉచితంగా గాలి నింపాలి. కొన్నిచోట్ల అసలు మరుగుదొడ్లు లేవు. మరికొన్ని చోట్ల అపరిశుభ్రంగా మారి వినియోగించలేని పరిస్థితి. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగినా సంబంధిత అధికార యంత్రాంగం మామూళ్లుగా వదిలేస్తున్నారనేది కాదనలేని వాస్తవం.

**ఇవీ నిబంధనలు :** వినియోగదారులకు ఎండ, వర్షం నుంచి రక్షణగా షెడ్డు నిర్మించాలి. ప్రమాదాలు జరిగితే ఎదుర్కొనేందుకు నీటి



ట్యాంకులు, ఇసుక, ఇతర అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉంచాలి. ధరల వివరాలతో కూడిన బోర్డులు అందరికీ కనిపించేలా ప్రదర్శించాలి. అవేవీ కానరావట్లేదు. ఉచితంగా నింపాల్సిన గాలికి సైతం సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారు. ఎప్పటికీ ఇంధనం అందుబాటులో ఉంచాలి. కొన్ని చోట్ల ఇంధనం లేదంటూ చెప్పడంతో వాహనదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

కల్తీ ఇంధనంపై అనుమానాలు : మారుమూల ప్రాంతమైన జుక్కల్‌లో ఇంధనాన్ని కల్తీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నేళ్ల కిందట జుక్కల్ సమీపంలోని ఓ బంకులో ఇంధనం కల్తీ చేశారంటూ వాహనదారులు యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. ఫలానా బంకుల్లో ఇంధనం పోసుకొంటే వాహనాలు తరచూ చెడిపోతున్నాయని, అందుకే ఆ బంకులకు వెళ్లొద్దని కొంతమంది తోటి వాహనదారులకు చెబుతున్నారు. ఇంకొన్ని చోట్ల తక్కువ మోతాదులో పోస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం**

పెట్రోల్ బంకులో ప్రైవేటు వ్యక్తులు గాలి కొట్టి డబ్బులు తీసుకుంటున్నట్లు మాకు ఫిర్యాదు రాలేదు. మరుగు దొడ్లు, తాగునీటి వసతి లేని బంకులను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– మల్లికార్జున బాబు, డీఎస్‌వో

డివిజన్ల వారీగా బంకులు

కామారెడ్డి : 35
బాన్సువాడ : 22
ఎల్లారెడ్డి : 20
జుక్కల్ : 14

# అనడం తప్ప.. అడుగులు పడట్లే

నిజామాబాద్ : జిల్లా కేంద్రంలో అన్ని వసతులతో కూడిన స్టేడియం నిర్మాణ హామీ కేవలం మాటలకు మాత్రమే పరిమితమైంది. డీఎస్‌ఏ మైదానం పూర్తిగా చదును చేసి అక్కడ పలు క్రీడలకు సంబంధించిన ఏర్పాట్లు చేయనున్నామని, ఇండోర్ స్టేడియం ఒకటి సిద్ధం కాబోతుందని ప్రజాప్రతినిధులు చెప్పారు. దానికి సబంధించిన పనులకు ఇప్పటివరకు అడుగులు పడడం లేదు. ఇందూరు నుంచి అంతర్జాతీయ వేదికపై అదరగొట్టిన క్రీడాకారులున్నా.. వారిని సిద్ధం చేసిన శిక్షకులు మరింత మందిని అలాగే తయారుచేస్తామని పేర్కొంటున్నా.. డీఎస్‌ఏ మైదానం, నాగారం రాజారాం స్టేడియంలో వసతుల లేమి వారితో పాటు క్రీడాకారులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. ఇటు సరైన క్రీడా మైదానాలు.. అటు ఒక్క శిక్షకుడు కూడా లేకపోవడంతో క్రీడా సంఘాల ప్రతినిధులు ప్రైవేటు స్థలాల్లో శిక్షణ ఇస్తూ ఆటలను బతికించుకుంటున్న పరిస్థితి నెలకొంది.

**కనీస వసతులు కరవు..**

నాగారం శివారు రాజారాం స్టేడియంలో కనీస వసతులు లేకుండా పోయాయి. అక్కడికి క్రీడా ఎంపికలకు వచ్చిన క్రీడాకారులు మూత్ర విసర్జనకు సైతం పక్కనే ఉన్న గుట్ట, ఖాళీ ప్రదేశాలకు వెళ్లాల్సిన



దుస్థితి. కనీస వసతి లేని ఈ భవనంలోని వ్యాయామ పరికరాలు సైతం తుప్పుపట్టాయి.

**పనులు ప్రారంభం కాలేదు**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటు చేస్తామనడం నిజమే. కానీ ఇంకా పనులు ప్రారంభం కాలేదు. అది ఉన్నతాధికారులకు సంబంధించిన విషయం. ముబారక్‌నగర్‌లో స్విమ్మింగ్ ఫూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం.– ముత్తెన్న, డీవైఎస్‌వో

**ప్రశ్నార్థకంగా అథ్లెటిక్స్ ట్రాక్..**

నిజామాబాద్ డీఎస్‌ఏ మైదానంలో ఎనిమిది లైన్ల అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణ పనులు త్వరలో జరుగుతాయని దానికి సంబంధించిన ప్లానింగ్ కంప్యూటర్‌లో వేయించి ఓ సమావేశంలో క్రీడాకారులకు, క్రీడా సంఘాల ప్రతినిధులకు చూపించారు. ఆ ప్లానింగ్ చూస్తే నిజామాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్ ట్రాక్ సిద్ధమవుతున్నట్లు కనిపించింది. కానీ.. రానురాను దాని ఊసేలేకుండా పోయింది. కొందరు ఎనిమిది లైన్లని, మరికొందరు ఆరు లైన్లని అనడంతప్ప అడుగులు ముందుకు పడలేదు.

# బోనస్ ఏమాయె?

సిరిసిల్ల : యాసంగి సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి. ఒకట్రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసివేయనున్నారు. ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని చెప్పింది. ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తున్నప్పటికీ బోనస్ విడుదల చేయకపోవటంపై రైతులు ఆందోళనగా ఉన్నారు.

**కొరవడిన స్పష్టత**

కొనుగోలు కేంద్రాల్లో రైతులు సన్నధాన్యం విక్రయాలు.. రవాణాలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దొడ్డు, సన్న ధాన్యం సేకరణ, నగదు చెల్లింపులు ఎప్పటికప్పుడు జరుగుతున్నప్పటికీ బోనస్ చెల్లింపులు ఎప్పుడనే దానిపై పౌరసరఫరాలశాఖ అధికారుల వద్ద స్పష్టత లేదు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు బోనస్ జమపై అధికారికంగా ఎటువంటి ఉత్తర్వులు వెలువడకపోవటమే ఇందుకు కారణంగా



తెలుస్తోంది. యాసంగి సీజన్ ప్రారంభంలో పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సన్నధాన్యం ఉత్పత్తి చేసిన రైతులకు నిర్దేశిత వ్యవధిలో బోనస్ చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చారు. వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం చెప్పినట్లుగానే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైన వారం నుంచే బోనస్ చెల్లింపులు జరిగాయి. సాంకేతిక కారణాలతో కొందరు రైతులకు జాప్యం జరిగినా తరవాత సమస్యలను పరిష్కరించారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో మాత్రం సేకరణ తుదిదశకు చేరుకుంటున్నప్పటికీ చెల్లింపులు ప్రారంభం కాలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సన్నధాన్యం పండించిన రైతులకు సుమారు రూ.5.27 కోట్ల మేర బోనస్ నగదు చెల్లించాల్సి ఉంది.

**రూ.56 వేలు రావాలి**

నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని యాసంగిలో సన్న వరి ధాన్యం సాగు చేశా. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 112 క్వింటాళ్ల దిగుబడి నెల రోజుల క్రితం విక్రయించా. క్వింటాకు రూ.2,320 చొప్పున ధాన్యం డబ్బులు బ్యాంకు ఖాతాలో 15 రోజుల క్రితం జమ అయ్యాయి. సన్నధాన్యానికి ప్రభుత్వం అందించే బోనస్ రూ.56 వేలు రావాల్సి ఉంది. బోనస్ డబ్బులు ప్రభుత్వం సకాలంలో అందిస్తే వానాకాలం పెట్టుబడి సాయానికి దోహదపడుతుంది.దేవరకొండ సంపత్, కోనరావుపేట

# ప్లాట్ల వేలానికి వేళాయె

హైదరాబాద్: మహానగరం చుట్టూ వివిధ ప్రాంతాల్లో హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్లలో ప్లాట్ల విక్రయానికి రంగం సిద్ధమైంది. ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. అనుమతి రాగానే కార్యాచరణ మొదలుపెట్టనున్నారు. అవుటర్ రింగ్‌రోడ్డుకు అటు ఇటు పలు ప్రాంతాల్లో హెచ్ఎండీఏ లేఅవుట్లను అభివృద్ధి చేసింది. మౌలిక వసతులు కల్పించింది. ఇమ్ముల్‌నర్వ, తొర్రూరు, లేమూరు, ప్రతాప్‌సింగారం ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ కింద రైతుల నుంచి భూములను సేకరించి.. లేఅవుట్లుగా హెచ్ఎండీఏ తీర్చిదిద్దింది. 60-40 నిష్పత్తిలో అభివృద్ధి చేసిన ప్లాట్లను రైతులకు కేటాయించారు. లేమూరులో మొత్తం 83 ఎకరాలను రైతుల నుంచి సేకరించారు. రోడ్లు, ప్రజా అవసరాలకు భూమిపోగా..మొత్తం 497 ప్లాట్లు అభివృద్ధి చేశారు. ఇందులో 333 ప్లాట్లను భూములు ఇచ్చిన రైతులకు కేటాయించారు. మిగతా 164 ప్లాట్లు హెచ్ఎండీఏ ఖాతాకు చేరాయి. ప్రస్తుతం వీటిని విక్రయించనున్నారు. తొర్రూరులో 117 ఎకరాల్లో అతిపెద్ద లేఅవుట్‌ను హెచ్ఎండీఏ తీర్చిదిద్దింది. మొత్తం 985 ప్లాట్లు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే కొన్ని అమ్ముడయ్యాయి. ప్రస్తుతం విక్రయానికి



493 ప్లాట్లు సిద్ధంగా ఉన్నాయి. ప్రతాప్‌సింగారంలో 165 ఎకరాల్లో మరో అతిపెద్ద లేఅవుట్‌ను ఇప్పటికే హెచ్ఎండీఏ ఏర్పాటు చేసింది. మొత్తం 1093 ప్లాట్లలో రైతులకు, అమ్మకానికి పోగా.. 793 ప్లాట్లు హెచ్ఎండీఏ ఖాతాలో ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో కనీస ధర గజానికి రూ.20-30 వేలపైనే ఉండనుంది. ఎక్కువకు కోట్ చేసిన వారికి ప్లాట్లను విక్రయించనున్నారు.

**ఆచితూచి.. ముందుకు**

ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో స్థిరాస్తి రంగంలో కొంత స్తబ్దత నెలకొన్నట్లు మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మిగతా ప్రాంతాలతో పోల్చితే హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్‌కు ఇబ్బంది ఉండదని, గతంలో మాదిరే స్పందన ఉంటుందనే అంచనాకు అధికారులు వస్తున్నారు.ప్లాట్లను విక్రయించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు హెచ్ఎండీఏ వర్గాలు తెలిపాయి.సానుకూలత వస్తే ప్రక్రియ ప్రారంభించనున్నారు. వేలం ద్వారా వచ్చే నిధులు అభివృద్ధి పనులకు మళ్లించేందుకు ఆస్కారం ఉంటుందని పేర్కొంటున్నారు.

## ఒక్కో మొక్క.. ఎదగాలి ఎంచక్కా

హైదరాబాద్ : నైరుతి రుతు పవనాలు పలకరించాయి.. తొలకరి జల్లులు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాల్లో వనమహోత్సవం నిర్వహించేందుకు యంత్రాంగం ప్రణాళికలను సిద్ధం చేసింది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 1.59 కోట్ల మొక్కలు నాటాలని నిర్ణయించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం అనంతరం వనమహోత్సవ తేదీలనుప్రకటించగానే మొక్కలు నాటేలా కార్యాచరణ రూపొందించారు.

జియోట్యాగింగ్

నాటిన ప్రతి మొక్కను జియోట్యాగింగ్ చేశాక వివరాలను 'టీజీఎఫ్ఎంఐఎస్ (తెలంగాణ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్)వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు. సంరక్షణ బాధ్యతలను అటవీశాఖ అధికారులతో పాటు జిల్లా రెవెన్యూ యంత్రాంగం సంయుక్తంగా చేపడుతుంది.

95 శాతానికి పైగా బతకాల్సిందే

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 60శాతం ప్రాంతాలు హైదరాబాద్‌లో కలిసిపోయాయి. సబర్బన్ ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీలు, ఐటీ సంస్థలు కార్యకలాపాలను ప్రారంభిస్తున్నాయి. దీంతో అధికారులు ఆయా ప్రాంతాల్లో అధికంగా మొక్కలు పెంచాలని నిర్ణయించారు. పాఠశాలల్లో ఎక్కువగా పండ్ల మొక్కలు, అటవీ ప్రాంతాల్లో ఔషధ, ఈత మొక్కలు పెంచడానికి అనువుగా కార్యాచరణ సిద్ధం చేయనున్నారు. నాటిన మొక్కల్లో 95శాతానికిపైగా ఎదగాలన్న లక్ష్యంతో స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు.

# జలమండలి మహా విస్తరణ



హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సేవలు అందిస్తున్న జలమండలి పరిధి మరింత విస్తరిస్తోంది. ఇప్పటి వరకు అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేస్తున్న జలమండలి ఓఆర్ఆర్ వెలుపల ఉన్న ప్రాంతానికి అందించేలా కార్యాచరణ రూపొందిస్తోంది. దీనిపై ఇప్పటికే అధికారులు ప్రాథమిక ప్రణాళికను సిద్ధం చేశారు.

ఓఆర్ఆర్ వెలుపల ఏయే ప్రాంతాలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది? ఎలాంటి మౌలిక వసతులు కల్పించాలనే అంశంపై జలమండలి కసరత్తు మొదలు పెట్టింది. రీజినల్ రింగ్‌రోడ్డు లోపల అభివృద్ధికి మార్గం సుగమం అవుతున్న నేపథ్యంలో జలమండలి పరిధిని విస్తరించడం ద్వారా తాగునీటి సరఫరాకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

**గ్రామాలకూ సరఫరా చేసేలా..**

గ్రేటర్ చుట్టుపక్కల ఉన్న పురపాలికల్లోని కొన్ని ప్రాంతాలు ఓఆర్ఆర్ వెలుపల ఉన్నాయి. ఈ ప్రాంతాలన్నింటినీ జలమండలి పరిధిలోకి తీసుకురావడం ద్వారా ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధ్యమని చెబుతున్నారు. శంషాబాద్, నార్సింగి, తుక్కుగూడ, పెద్దఅంబర్‌పేట, మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీలు ఓఆర్ఆర్‌కు అటూఇటూ ఉన్నాయి. వీటి పరిధిలోని కొన్ని గ్రామాలు ఓఆర్ఆర్ వెలుపలా ఉన్నాయి. లోపల ఉన్న గ్రామాలకు జలమండలి నీటిని సరఫరా చేస్తోంది. ఆయా ప్రాంతాల్లో భారీగా రియల్ కార్యకలాపాలు జరుగుతుండటంతో తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి విస్తరణ ప్రణాళికపై సమీక్షించారు.

**గోదావరి జలాలు రానుండటంతో..**

గోదావరి 2,3 దశల ప్రాజెక్టుకు త్వరలో శంకుస్థాపన చేయనున్నారు. రూ.7360 కోట్లతో 20 టీఎంసీల గోదావరి జలాలు నగరానికి సరఫరా చేయనున్నారు. ఇందులో 15 టీఎంసీలను నేరుగా తాగునీటి అవసరాలకువాడతారు. రెండేళ్లలో ఈ జలాలు అందుబాటులోకి రానుండటంతో దీనికి అనుగుణంగా కొత్త ప్రాంతాలను నీటిని అందించేందుకు జలమండలి కసరత్తు చేస్తోంది.

ప్రస్తుతం జలమండలి పరిధి (చదరపు కిలోమీటర్లలో)
కోర్ సిటీలో : 169.3
చుట్టుపక్కల : 518.9
ఓఆర్ఆర్ గ్రామాల ప్రాంతం 762
మొత్తం జలమండలి పరిధి : 1,450
ప్రస్తుత కనెక్షన్లు: 13.72 లక్షలు
జనాభా: 1.30 కోట్లు
రోజుకు సరఫరా అవుతున్న నీరు: 550 ఎంజీడీలు

# ఆచార్యులు లేక జేఎన్టీయూలో బీబీఏ కోర్సు రద్దు



హైదరాబాద్ : విద్యార్థులకు బోధించేందుకు ఆచార్యులు లేని కారణంగా జేఎన్టీయూ అధికారులు బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (బీబీఏ) కోర్సును రద్దు చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలను నిలిపివేశారు.'దోస్త్' పోర్టల్ నుంచి బీబీఏ (రెగ్యులర్) కోర్సును తొలగించాలంటూ ఉన్నత విద్యా మండలికి సమాచారమిచ్చారు. మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రధాన అంశాలు మార్కెటింగ్, ఫైనాన్స్, మానవ వనరుల నిర్వహణ, ప్రొడక్షన్, ఆపరేషన్, సప్లై ఛెయిన్ మేనేజ్‌మెంట్‌లను బోధించేందుకు వీలుగా మూడేళ్ల క్రితం ఈ కోర్సును ప్రవేశపెట్టారు. ఆచార్యులు ఉద్యోగ విరమణ చేయడంతో అఖిల భారత సాంకేతిక విద్యామండలి నిబంధనల మేరకు రెగ్యులర్ ఆచార్యులు లేకపోవడంతో కోర్సును రద్దు చేశారు.

**70 శాతం ఉద్యోగ విరమణ**

ఇంజినీరింగ్ కోర్సుతో పాటు మేనేజ్‌మెంట్ కోర్సులను నిర్వహించాలని జేఎన్టీయూ ఉన్నతాధికారులు మూడేళ్ల క్రితం నిర్ణయించారు. బీబీఏ రెగ్యులర్, బీబీఏ(డేటా అనలిటిక్స్) కోర్సులను యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఆర్భాటంగా ప్రవేశపెట్టారు. ఒక్కో కోర్సులో 60 మందికి ప్రవేశం కల్పించారు. జేఎన్టీయూలో బీబీఏ కోర్సు చదివితే క్యాంపస్ ఇంటర్వ్యూలతో పాటు ఎంబీఏ చదివేందుకు అవకాశాలు లభిస్తాయని విద్యార్థులు ప్రవేశాలు పొందారు. రెండో సంవత్సరం వచ్చేసరికి ఆచార్యుల్లో 70శాతం ఉద్యోగ విరమణ పొందారు. మూడో సంవత్సరం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మిగిలిన ఆచార్యులతో పూర్తి చేశారు. విద్యార్థులు మూడో సంవత్సరం బీబీఏ పూర్తిచేసేలోగా ఒక్కరు మినహా శాశ్వత ఆచార్యులందరూ ఉద్యోగ విరమణ పొందారు. దీంతో బీబీఏ(రెగ్యులర్) కోర్సును కొనసాగించలేమని నిర్ణయం తీసుకున్నారు.

**ముప్పును ఊహించకుండా...**

అప్పట్లో అధికారులు సరైన అవగాహన లేకుండా, ఆచార్యులున్నారా? లేరా? అని తెలుసుకోకుండా బిజినెస్ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ కోర్సును ప్రవేశపెట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆచార్యులు పదవీ విరమణ చేస్తే విద్యార్థులకు ఆయా సబ్జెక్టులు ఎవరు బోధిస్తారు? అని, ఏఐసీటీఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కోర్సును రద్దు చేయడంతో పాటు యూనివర్సిటీ ప్రతిష్ఠ దెబ్బతింటుందనే ఆలోచనలేకుండా అప్పటి అధికారులు వ్యవహరించారు. దీనిపై రిజిస్ట్రార్ డాక్టర్ కేవీరావును వివరణ కోరగా... ప్రవేశాలు రద్దు చేశామని తెలిపారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి నుంచి తాఖీదులు రాకూడదనే కోర్సును కొనసాగించడం లేదన్నారు.

# డివిజన్ల పునర్విభజనకు కసరత్తు



కరీంనగర్ : స్థానిక సంస్థల ఎన్నికలకు పురపాలక శాఖ కసరత్తు ప్రారంభించింది. ఈ ఏడాది జనవరి 28తో పాలకవర్గాల గడువు ముగియడంతో పురపాలికలు, నగరపాలికల్లో ప్రత్యేకాధికారుల పాలన అమలులోకి వచ్చింది. కరీంనగర్ నగరపాలికలో శివారు గ్రామాలను చేర్చిన నేపథ్యంలో డివిజన్ల పునర్విభజన తప్పనిసరిగా మారింది. ప్రస్తుతమున్న 60 డివిజన్లను 66కి పెంచారు. అయిదు గ్రామాలతో పాటు కొత్తపల్లి మున్సిపాలిటీ నగరంలో విలీనం కావడంతో ఓటర్ల సంఖ్య పెరగనుంది. మరో ఆరు డివిజన్లు పెరగడంతో నగర స్వరూపం పూర్తిగా మారనుంది. ఏ డివిజన్‌లో ఎంత మంది ఓటర్లు ఉండాలనే విషయమై ఇప్పటికే ప్రక్రియ పూర్తి చేశారు. తాజాగా డివిజన్ల పునర్విభజనపై ముసాయిదా జారీ కోసం ఉత్తర్వులు జారీ చేశారు.

డివిజన్‌కు 5 వేల మంది ఓటర్లు

పెరిగిన డివిజన్ల ఆధారంగా ఓటర్లు, సరిహద్దులతో వార్డుల పునర్విభజనను ఫిబ్రవరి, మార్చి నెలల్లో పూర్తి చేశారు. కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, పట్టణ ప్రణాళిక అధికారులు, ఉద్యోగులు కలిసి విలీన గ్రామాలను కలుపుకొని ఏయే డివిజన్ ఎక్కడి వరకు రానుందనే విషయాలపై చర్చించి, క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఓటర్ల లెక్క ప్రకారం ఒక్కో డివిజన్‌లో 4,493 నుంచి 5 వేల మంది ఓటర్లు ఉండనున్నారు. ఈ మేరకు ప్రాథమిక సమాచారాన్ని రాష్ట్ర పురపాలక శాఖకు పంపించారు.

**నేటి నుంచి 19 రోజులు**

డివిజన్ల పునర్విభజనపై రాష్ట్ర పురపాలక శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకు 19 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసి తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

**సరిహద్దులపై ప్రచారం**

డివిజన్ల సరిహద్దులు నిర్ణయించారంటూ ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం జరిగింది. ఓటర్లు ఎక్కువ తక్కువ ఉండటం, భౌగోళిక స్వరూపం గందరగోళంగా మారడంతో విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆ జాబితా అధికారికంగా చేపట్టింది కాదని అధికారులు తేల్చి చెప్పారు.

**ఇదీ షెడ్యూలు**

3న భౌగోళికంగా పునర్విభజన చేస్తూ మున్సిపాలిటీ ద్వారా ముసాయిదా ప్రతిపాదనల తయారీ.

4న వార్డుల విభజన ప్రతిపాదనకు నోటీసు ఇవ్వడం, సాధారణ ప్రజలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు లేఖలు ఇవ్వడం, పత్రికల్లో ప్రచురించడం.

5 నుంచి 11 వరకు ఏడు రోజుల పాటు అభ్యంతరాలు, అభిప్రాయ సేకరణ, సూచనలు, పరిష్కారాలు కోరడం.

12 నుంచి 16 వరకు అయిదు రోజుల పాటు స్వీకరించిన అభ్యంతరాలపై విచారణ.

17 నుంచి 18 వరకు రెండు రోజుల పాటు అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాత కలెక్టర్ ఆమోదం తీసుకోవడం.

19న పురపాలక శాఖకు నివేదిక సమర్పణ.

20న పురపాలక శాఖ ద్వారా ప్రభుత్వానికి నివేదిక అందజేయడం.

21న తుది నోటిఫికేషన్ జారీ.

ప్రస్తుత డివిజన్లు : 60
కొత్తగా ఏర్పడేవి : 6
నగర ఓటర్లు : 2,54,745
విలీన గ్రామాల ఓటర్లు: 41,814

# మామిడి రైతు కంట కన్నీరు

ధర్మారం : ప్రతికూల వాతావరణ పరిస్థితులతో మామిడి రైతులు నష్టాల పాలవుతున్నారు. జిల్లాలో 5,246 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఒక్క ధర్మారం మండలంలోనే 2,650 ఎకరాల్లోని సాగవుతోంది. ఇతర పంటలతో పోలిస్తే వీటి పెంపకానికి ధర్మారంలోని నేలలు భౌగోళికంగా అనుకూలంగా ఉండటంతో ఎక్కువమంది సాగు చేస్తారు. అయితే అందుకు తగిన మార్కెటింగ్ వసతి లేకపోవడంతో రైతులు ఏటా నష్టపోతున్నారు. మండలంలోని కరీంనగర్-రాయపట్నం రహదారి పక్కన నాలుగు ప్రైవేటు మార్కెట్లు ఏర్పాటుకాగా.. ఇంకా ఎవరికీ లైసెన్సులు జారీకాలేదు.

**ప్రతికూల పరిస్థితులతో తగ్గిన ధరలు**

వ్యాపారులు కొనుగోలు చేసిన మామిడిని పంజాబ్, హరియాణా, దిల్లీ ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. అయితే ఈసారి చేతికొచ్చే సమయానికి పాకిస్థాన్‌తో తలెత్తిన యుద్ధ వాతావరణంతో రవాణాకు ఆటంకం కలిగింది. దీనికితోడు విదేశాలకు ఎగుమతులపై ఆంక్షల నేపథ్యంలో టన్నుకు రూ.35 వేల నుంచి రూ.20 వేలకు తగ్గించారు. మరోవైపు అకాల వర్షాలతో కాయలకు మంగు మచ్చలు, పురుగు వస్తున్నాయి. ఇదే అవకాశంగా భావించిన వ్యాపారులు ధర తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

**కోయకుండా వదిలేసిందే నయం**

నాకున్న మూడెకరాల మామిడి తోటలో ప్రస్తుతం ఎకరంన్నర కాయలను ప్రైవేటు మార్కెట్‌కు తీసుకొచ్చా. అంతకుముందు టన్నుకు రూ.13 వేల నుంచి రూ.16 వేలు పలికింది. ప్రస్తుతం కాయల నాణ్యత ప్రకారం రూ.8 వేలకు టన్ను చొప్పున ఇస్తానన్నారు. ఆ ధరకు అమ్మితే కూలీ, రవాణా ఛార్జీలకు కూడా సరిపోవు. ఇక మిగతా తోటలో కాయలను కోయకుండా వదిలేయడమే నయమనిపిస్తోంది.



గంగయ్య, రైతు, నందిమేడారం

గిట్టుబాటు కావడంలేదు

నాకు ఎకరం మామిడితోట ఉంది. ఈ ఏడాది మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. కనీసం టన్నుకు రూ.35 వేల వరకు ధర ఉంటే పెట్టుబడి వచ్చేది. ఇలాంటి పరిస్థితి ఎన్నడూ రాలేదు. స్థానికంగా ప్రైవేటు వ్యాపారులను కాదని.. కరీంనగర్, జగిత్యాల మార్కెట్లకు తరలించినా ఇంతకంటే గడ్డు పరిస్థితులే ఉన్నాయి. గిట్టుబాటు ధర అందేలా వ్యాపారులపై అధికారుల పర్యవేక్షణ ఉన్నప్పుడే నష్టాలు రావు.

సాగంటి ఉదయ్, కౌలు రైతు, కొత్తూరు

నష్టం జరగకుండా చూస్తాం

ధర్మారం మండలంలో ట్రేడ్ లైసెన్సులకు ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా ఎవరికీ లైసెన్సులు జారీ చేయలేదు. జగిత్యాల, కరీంనగర్‌లోని మార్కెట్లకు తరలించి గిట్టుబాటు ధరలు పొందొచ్చు. రైతులకు నష్టం జరగకుండా చూస్తాం. అన్నదాతలను ఇబ్బందులకు గురిచేసే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి

# పల్లె వాకిట.. భూ పరిష్కార వేదిక

పెద్దపల్లి : భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే జిల్లాలో ప్రయోగాత్మకంగా ఎలిగేడు మండలాన్ని ఎంపిక చేసి సమస్యలు పరిష్కరిస్తున్నారు. మిగిలిన మండలాల్లో ఈనెల 3 నుంచి 20 వరకు గ్రామాల వారీగా సదస్సులు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఆగస్టు 15 నాటికి భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించారు. నేటి నుంచి అధికారులు కార్యక్షేత్రంలోకి దిగనున్నారు.

**ప్రతి మండలానికి మూడు బృందాలు**

జిల్లాలోని 14 మండలాల్లో ఈ సదస్సులు నిర్వహించనున్నారు. ప్రతి మండలంలో తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ పర్యవేక్షణలో మూడు



బృందాలను నియమించారు. ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, మీసేవ ఆపరేటర్లు సభ్యులుగా కొనసాగనున్నారు.

పట్టాలో తప్పుల సవరణ, విస్తీర్ణంలో వ్యత్యాసం, ఆధార్ తప్పుగా నమోదు, హద్దుల సమస్యలు, అసైన్డు భూములు, నిషేధిత జాబితాలో నమోదైనవి, ఒకరికి బదులు మరొకరికి పట్టా ఉండటం లాంటి తదితర వాటిపై దరఖాస్తులు స్వీకరించనున్నారు.

**నిరీక్షణకు తెర**

జిల్లాలో 2,85,876.2 ఎకరాల వ్యవసాయ, 33,334.14 ఎకరాల్లో ప్రభుత్వ ఆస్తులు, 24,453.13 ఎకరాల అసైన్డు భూములు, 59,245.09 ఎకరాల అటవీశాఖ, 802.08 దేవాదాయ, 283.13 ఎకరాల వక్ఫ్ భూములున్నాయి. గత ప్రభుత్వం అమలుచేసిన ధరణి సాంకేతిక లోపాలతో రైతులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. కళ్ల ముందు భూమి ఉన్నా.. పట్టా హక్కులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు కోల్పోయారు. ఎట్టకేలకు భూ సమస్యలకు పరిష్కారం లభించనుంది.

**సాదాబైనామాకు మోక్షం**

తెల్ల కాగితాలపై క్రయ విక్రయ ఒప్పందాలు రాసుకున్న వ్యవసాయ భూముల క్రమబద్ధీకరణ కల ఫలించనుంది. 2014 జూన్ 2కు ముందు కొనుగోలు చేసినవాటికి పట్టా హక్కులు కల్పించేందుకు గత ప్రభుత్వం 12 అక్టోబర్ 2020 నుంచి 10 నవంబర్‌లోపు స్వీకరించిన దరఖాస్తులు పరిష్కరించనున్నారు. నాలుగున్నరేళ్లుగా వీటికి మోక్షం లభించడంలేదు. ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరించి ఆర్డీవో విచారణ చేసిన తరువాత అర్హత ఉంటే పట్టా హక్కులు కల్పించనున్నారు. గతంలో కాకుండా కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు. ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

చురకలు


# జాతీయ రహదారి.. ప్రతిపాదనలకే సరి

పెద్దపల్లి : జిల్లాకేంద్రమైన పెద్దపల్లి పట్టణాన్ని జాతీయ రహదారితో అనుసంధానించడం కలగానే మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రెండు మార్గాలను సొంత నిధులతో అభివృద్ధి చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడంతో ఎన్‌హెచ్‌పై మరికొన్నేళ్లు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్దపల్లి నుంచి మంథని మీదుగా కాటారం వరకు ఒకటి, కాల్వశ్రీరాంపూర్ మీదుగా వరంగల్ రామప్ప ఆలయం వరకు మరో మార్గాన్ని జాతీయ రహదారుల కింద అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఇటీవల కేంద్రం సున్నితంగా తిరస్కరించగా రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి మరోసారి అభ్యర్థించేందుకు నేతలెవరూ చొరవ చూపలేదు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సైతం రాజీవ్ రహదారి విస్తరణపై గడ్కరీ దృష్టికి తీసుకొచ్చారే తప్ప జాతీయ రహదారిగా మార్చడంపై అభ్యర్థించలేదు.

**ఆది నుంచి చిన్నచూపే..** పెద్దపల్లి పట్టణం మీదుగా రహదారుల అభివృద్ధిపై మొదటి నుంచీ పాలకుల్లో పట్టింపు లేకుండా పోయింది. రాజీవ్ రహదారికి జాతీయ హోదా కల్పించేందుకు వైఎస్ హయాంలో చేసిన యత్నాలు ఫలించలేదు. దీంతో ప్రపంచ బ్యాంకు సహకారంతో రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను చేపట్టారు. ఇది తెలంగాణలో మొదటి రాష్ట్ర రహదారిగా గుర్తింపు పొందింది. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రాజీవ్ రహదారిపై మూడు టోల్‌గేట్లున్నాయి. దీంతో పాటు కరీంనగర్-రాయపట్నం మార్గాన్ని కూడా రాష్ట్ర



రహదారిగా అభివృద్ధి చేశారు.

**స్థానికుల చిరకాల వాంఛ**

పెద్దపల్లి-మంథని మార్గంలో వాహనాల రద్దీ పెరగడంతో రహదారిని విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అయితే నిధుల కొరతతో పాటు మార్గం ప్రాధాన్యత దృష్ట్యా జాతీయ రహదారి కింద కేంద్రానికి ప్రతిపాదించింది.

ఈ రోడ్డును జగిత్యాల నుంచి కాటారం వరకే విస్తరించే విధంగా ప్రతిపాదించారు. కాటారం మీదుగా ఛత్తీస్‌గఢ్ రోడ్డుకు అనుసంధాన మవుతుందనే అంశాన్ని ప్రతిపాదనల్లో విస్మరించడంతో జాతీయ హోదా దక్కలేదు.

పెద్దపల్లి-రామప్ప రోడ్డుకు కూడా జాతీయ హోదా ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వమే అభివృద్ధి చేసుకోవాలని, ప్రపంచ బ్యాంకు రుణం ఇప్పిస్తామని కేంద్రం చెప్పింది.

గతంలో రాజీవ్ రహదారికీ ఇదే పరిస్థితి ఎదురైంది. కేవలం పెద్దపల్లి మీదుగా వెళ్లే రహదారులకే జాతీయ హోదా లభించకపోవడం కాకతాళీయమే అయినా ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ మాత్రం అలాగే ఉండిపోతోంది.

**అధ్వానంగా ప్రధాన మార్గాలు** పదిహేనేళ్ల కిందట నిర్మాణం పూర్తయిన జగిత్యాల-పెద్దపల్లి రహదారి గుంతలమయంగా మారింది. గ్రామీణ ప్రాంతాల మీదుగా వచ్చే ఈ రోడ్డుపై ధర్మారం నుంచి జగిత్యాల వైపు ప్రమాదకరమైన మలుపులు న్నాయి. పెద్దపల్లి-మంథని రహదారి కూడా పూర్తిగా దెబ్బతింది. అయిదేళ్ల క్రితం చేపట్టిన మరమ్మతు పనులు కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడంతో మిగిలిన చోట్ల అధ్వానంగా మారింది. పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ మీదుగా వరంగల్ వెళ్లే రహదారిపైనా ప్రమాదకరమైన మలుపులు ఎక్కువగా ఉన్నాయి. విస్తరిస్తే పెద్దపల్లి-జయశంకర్ భూపాలపల్లి జిల్లాల మధ్య రవాణా సౌకర్యం మెరుగవుతుంది.

# మొదట భూగర్భ గనుల్లోకే!

గోదావరిఖని : సింగరేణిలో కొత్తగా ఉద్యోగంలో చేరే వారికి భూగర్భ గనుల్లోనే విధులు కల్పించనున్నారు. ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవు. ఈ మేరకు సీఎండీ ఇటీవల ఆదేశాలు ఇచ్చారు. ఉద్యోగంలో చేరిన మొదట్లో చాలామంది యువకులు సాధ్యమైనంత మేర ఉపరితలల్లోనే పనిచేసేందుకు మొగ్గు చూపుతున్నా రు. దీంతో భూగర్భ గనుల్లో విధులు నిర్వహించే వారి సంఖ్య తగ్గుతోంది. ఫలితంగా వారిలో పని నైపుణ్యం తగ్గే ప్రమాదం ఉంది. ఇది పరోక్షంగా సంస్థపై ప్రభావం చూపనుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సీఎండీ ఎవరికి మినహాయింపులు లేకుండా కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి తప్పకుండా భూగర్భ గనుల్లోనే విధులు కేటాయించాలని నిర్ణయించారు. దీనివల్ల వారిలో పని నైపుణ్యం పెరిగే అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో సంస్థ అభివృద్ధికి అవసరమైన మానవ వనరుల కొరత ఉండదు.

**సాంకేతికత పెరిగినా ముందుకు రాని యువత**

గతంలో కంటే సింగరేణిలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెరిగింది. భూగర్భ గనుల్లో ఎక్కువ శాతం యంత్రాలతో చేపట్టే పనులే ఉన్నాయి. అయినా భూగర్భ గనుల్లో పనిచేసేందుకు యువ కార్మికులు ముందుకు రావడం లేదు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల ద్వారా ఇప్పటి వరకు 16 వేల మందికి పైగా చేరారు. కొత్తగా మరో 1000 మంది వరకు నియామక ప్రక్రియలో ఉన్నారు. తట్టా



చెమ్మస్‌తో చేపట్టే పనులు పూర్తిగా లేకుండా పోయినా గనిలోకి దిగేందుకే యువ కార్మికులు వెనుకడుగు వేస్తున్నారు.

**ఉత్పత్తికి మానవ వనరుల కొరత**

సీనియర్ కార్మికులు ఉద్యోగ విరమణ పొందుతుండటంతో బొగ్గు ఉత్పత్తికి సంబంధించిన ప్రక్రియలు చేపట్టే మానవ వనరుల సంఖ్య తగ్గిపోతోంది. యువ ఉద్యోగులు వాటిని నేర్చుకోవడానికి ఇష్టపడటం లేదు. భూగర్భ బొగ్గు గనుల్లో కోల్‌కటింగ్, సపోర్టుమెన్, రూఫ్‌బోల్టర్, టెండాల్ పనులు కీలకం. సంబంధిత కార్మికుల విధులు పూర్తి కాగానే మైనింగ్ సర్దార్, ఓవర్‌మెన్‌లు, సూపర్‌వైజర్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. బొగ్గు పొరను పేల్చాలంటే ముందుగా కోల్‌కట్టర్‌లు దానికి రంధ్రం వేయాలి. అందులో పేలుడు పదార్థాలు నింపి.. ఆ ప్రాంతంలో పైకప్పు కూలకుండా సపోర్టుమెన్ ద్వారా కర్ర దిమ్మెలు, హైడ్రాలిక్ ప్రాప్స్ బిగించాలి. పైకప్పునకు కూడా రూఫ్‌బోల్టింగ్ చేసి అందులో బోల్టులు అమర్చాలి. బొగ్గు రవాణాకు ట్రాక్ ఏర్పాటు చేసేందుకు టెండాల్ పనులు చేయాలి. భూగర్భ గనిలో కీలకమైన విధులు ఇవే.. కాని కొత్తగా ఉద్యోగంలో చేరిన యువకులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు.

# సంధ్యా కన్వెన్షన్ సెంటర్‌లో కూల్చివేతలు



హైదరాబాద్ : లేఅవుట్‌లోని ఇతరుల ఇళ్ల స్థలాలు, పార్కులు, రహదారులను ఆక్రమించి శ్రీధర్‌రావు అనే వ్యక్తి గచ్చిబౌలిలో నిర్మించిన సంధ్య కన్వెన్షన్ సెంటరు ఆక్రమణలను హైడ్రా నేలమట్టం చేసింది. 6 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో నిర్మించిన రెండు సంధ్యా కన్వెన్షన్ హాళ్లు, వంట గదులు, 10 విశ్రాంతి గదులు, ఆహార విక్రయ కేంద్రాలు, ఇతరత్రా నిర్మాణాలను ధ్వంసం చేసింది. ఈ విషయమై హైడ్రా ప్రకటన విడుదల చేసింది. దేశ, విదేశాల నుంచి ఆయా అక్రమ నిర్మాణాలపై తమకు ఫిర్యాదులు అందాయని, ఆక్రమణదారు అనేక మంది వేధింపులతో ఆర్థికంగా నష్టపోయారంది. ఫిర్యాదుల్లోని వివరాల ఆధారంగా విచారణ చేపట్టి, ఖాళీ స్థలాలు, పార్కుల ఆక్రమణలపై చర్యలు తీసుకున్నట్టు కమిషనర్ ఏ.వి.రంగనాథ్ ప్రకటించారు. విషయం ఏంటంటే.. 'శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి ప్రధాన రహదారికి ఆనుకుని 1980లో 20 ఎకరాల విస్తీర్ణంలో 162 ప్లాట్లతో ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌ను అభివృద్ధి జరిగింది. దాని పక్కన సంధ్య కన్వెన్షన్ నిర్మాణం చేపట్టిన శ్రీధర్‌రావు.. క్రమంగా మా లేఅవుట్‌లోకి ప్రవేశించారు. లేఅవుట్‌లోని రోడ్లు, పార్కులు, ఖాళీ స్థలాలు, ప్లాట్ల హద్దులను చెరిపేశారు. అతని కన్వెన్షన్ సెంటరుకు అనుబంధంగా మా లేఅవుట్‌లో కొన్ని నిర్మాణాలను అక్రమంగా చేపట్టారు. ప్రశ్నించిన వారిపై ఆయన అనుచరులు దాడి చేశారు. మోసాలను తట్టుకోలేక పలువురు ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనపై ఇప్పటికే భూ కబ్జాలకు సంబంధించి పోలీస్ స్టేషన్లలో 30కిపైగా కేసులున్నాయి. మా లేఅవుట్‌కు సంబంధించి 5కు పైగా కేసులున్నాయి. హైడ్రా న్యాయం చేస్తుందనే ధైర్యంతో.. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ ధైర్యంగా ఫిర్యాదు చేస్తున్నాం' అని ఇటీవల బాధితులు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

**కొనసాగుతున్న ఫిర్యాదులు..:** కూల్చివేతల విషయం తెలియగానే..సంధ్య శ్రీధర్‌రావు బాధితులు మంగళవారం మధ్యాహ్నం నుంచి ఆన్‌లైన్ ద్వారా సంప్రదిస్తున్నట్టు హైడ్రా ప్రకటించింది. ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఉద్యోగుల లేఅవుట్ బాధితులతోపాటు.. వేరే ప్రాంతాల్లో తమ భూములను కబ్జా చేశారంటూ శ్రీధర్‌రావుపై ఫిర్యాదులు అందుతున్నాయని హైడ్రా గుర్తుచేసింది.

**15 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా**

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలోని సర్వే నంబరు 354లో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి కాపాడినట్లు హైడ్రా ఓ ప్రకటనలో తెలిపింది. 'రాష్ట్ర ప్రభుత్వం 2009లో రాజీవ్ స్వగృహ సంస్థకు కేటాయించిన భూమిని, కొందరు స్థానిక నేతలు కబ్జా చేసినట్టు స్థానికులు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టగా, వాస్తమని తేలింది. ఆక్రమిత భూమిలోని 5ఎకరాలు కె.ఎల్.యూనివర్సిటీ ఆధీనంలో ఉంది. పూర్తి వివరాలతో అధికారులు కమిషనర్ రంగనాథ్‌కు నివేదిక ఇచ్చారు. ఆయన ఆదేశాలతో ఆక్రమణలను తొలగించి ఇది ప్రభుత్వ భూమి తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేశాం.' అని పేర్కొంది. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్‌లోని ఇందిరా సొసైటీ కాలనీలో కొందరు షెడ్లు నిర్మించి, మరికొందరు రహదారులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో స్థానికులు ఫిర్యాదు చేయగా విచారించిన హైడ్రా అధికారులు మంగళవారం ఆ ఆక్రమణలు తొలగించింది.

# అసౌకర్యాల ప్రాంగణాలు.. అవస్థల్లో ప్రయాణికులు




పరిగి: జిల్లాలోని ప్రయాణ ప్రాంగణాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. చోరీల కట్టడికి ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పలుచోట్ల సక్రమంగా పనిచేయక చోరీలు పెరిగిపోతున్నాయి. ఫ్యాన్లు అవసరమున్నా ఏర్పాటు చేయడంలేదు. నీటిపంపులు పనిచేయడం లేదు. మహాలక్ష్మి పథకం ప్రారంభం అనంతరం రాకపోకలు పెరిగాయి. అందుకు సరిపడా సౌకర్యాల కల్పన జరగడంలేదు. ఈ నేపథ్యంలో కథనం.

**దుర్వాసన భరించలేకపోతున్నారు**

పరిగి బస్టాండ్ పక్కనే మురుగు పారుతోంది. దుర్వాసనతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నీటి సౌకర్యం లేని కారణంగా మల మూత్ర విసర్జన పరిసర ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ చేస్తున్నారు. ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు కేఎస్ఆర్ ట్రస్టు ఛైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంటు వృథాగా మారింది. రెండు సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి.

**సెల్‌ఫోన్ చోరీలు ఎక్కువ**

కొడంగల్ బస్‌స్టాండ్‌లో సీసీ కెమెరాలు సరిగ్గా లేక అత్యధికంగా సెల్‌ఫోన్ దొంగతనాలు జరుగుతున్నాయి. గత ఆరుమాసాల్లో నాలుగు సెల్‌ఫోన్ కేసులు, రెండు బంగారు దొంగతనం కేసులు నమోదైతే, నమోదుకు ముందుకు రానివెన్నో ఉన్నాయి. ఆర్టీసీ నిర్వాహకుల పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నారు. 7 సీసీ కెమెరాలకు ప్రతిపాదనలు పంపించినట్లు కంట్రోలర్ పీఎన్‌రెడ్డి తెలిపారు. నిత్యం పెట్రోలింగ్ చేస్తున్నామని కొడంగల్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

**35 ఏళ్ల క్రితం కట్టినా.. నేటికీ అంతే**


వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణాన్ని 35 సంవత్సరాల క్రితం ప్రారంభించగా నాడు కల్పించిన సౌకర్యాలే నేటికీ ఉన్నాయి. సీసీ కెమెరాలు లేవు. ఆరు నెలల క్రితం ఓ మహిళ మెడలో గొలుసును దొంగిలించారు. ఇప్పటి వరకు ఆచూకీ దొరకలేదు. వికారాబాద్ డిపోలో 19 సీసీ, డిపో పరిధిలోని బస్టాండ్‌లలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని లేఖ రాశామని విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ నర్సింహులు తెలిపారు.

**ఆవరణంతా అపరిశుభ్రం** జిల్లాలో పెద్దదిగా పేరు ఉన్న తాండూరు ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో చోరీలు అరికట్టడానికి పోలీసులు మొత్తం 5 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా దొంగతనాలు ఆగడం లేదు. గత ఆరునెలల్లో మూడు చోరీలు జరిగితే ఒకదాన్ని మాత్రమే పోలీసులు ఛేదించారు. దీంతో పాటు ప్రాంగణంలో పరిశుభ్రతా చర్యలు కరవవుతున్నాయి. ప్లాట్‌ఫారాలు లేక చెట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. అపరిశుభ్రతను తొలగించటానికి, చోరీల కట్టడికి చర్యలు తీసుకుంటామని డిపో మేనేజరు సురేష్ కుమార్ తెలిపారు.

# తవ్వీపోదురుగాక.. మాకేటి సిగ్గు

హైదరాబాద్ : ఇది షాబాద్ మండలం హైతాబాద్ సమీపంలోని సోలిపేట గ్రామంలోని ఎసైన్డ్ భూమి. కొన్ని నెలల క్రితం భూ ఉపరితలానికి సమానంగా ఉండేది. మట్టి కోసం తవ్వడంతో భారీ గుంత ఏర్పడింది. పదిహేను, ఇరవై అడుగుల లోతు వరకు తవ్వేశారు. రాత్రివేళ పొక్లెయిన్లతో మట్టి తవ్వుతున్నా.. లారీల్లో తరలిస్తున్నా.. మైనింగ్ శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

చందనవెల్లి, మద్దూరు, సోలిపేట, దైవాలగూడ, అప్పారెడ్డిగూడ గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. షాబాద్ మండలంలోని కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు అక్రమ తవ్వకాలకు సూత్రధారులు. రాత్రిపూట పొక్లెయిన్లతో మట్టిని తవ్వి.. షాబాద్, మహేశ్వరం, తుక్కుగూడ, కొంగర్‌కలాన్ ప్రాంతాల్లో ఏర్పాటవుతున్న పరిశ్రమలు, ప్రైవేటు నర్సరీలకు విక్రయిస్తున్నారు. రోజుకు 300 నుంచి 400 ట్రిప్పుల మట్టిని తవ్వేస్తున్నారు. తవ్వుతున్నకొద్దీ రూ.లక్షలే.. శంషాబాద్, షాబాద్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఆయా పరిశ్రమల్లో పునాదులు తీశాక నాణ్యమైన మట్టితో నింపాలని ఇంజినీర్లు సూచిస్తున్నారు. సమీపంలో ఎసైన్డ్ భూములుండడం, వాటిలో పంటలు సాగు చేయకపోవడంతో కొందరు సోలిపేటలోని సర్వే నంబర్ 350లో 110 ఎకరాల ఎసైన్డ్ భూముల్లో మట్టి తవ్వుతున్నారు. ఒక లారీ ఎర్రమట్టిని రూ.5 వేల చొప్పున విక్రయిస్తున్నారు. రోజుకు గరిష్ఠంగా 400 ట్రిప్పులు అనుకుంటే.. వారి ఆదాయం రూ.20 లక్షలు... పొక్లెయిన్, లారీల కిరాయి రూ.వెయ్యి తీసేసినా... రోజుకు రూ.16 లక్షలు సంపాదిస్తున్నారు. ఎర్రమట్టి లారీలను హైతాబాద్,



చందనవెల్లి, షాబాద్ మీదుగా శంషాబాద్ వైపు రాత్రి వేళల్లో పంపుతున్నారు. లారీల రాకపోకలతో రహదారులపై మట్టి పడి ఇతర వాహనాలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

**రైతులను బెదిరించి..**

షాబాద్ పరిధిలోని కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలకు ఎర్రమట్టి బంగారంలా మారడంతో మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నారు. కొందరు రైతులను బెదిరిస్తున్నారు. మరికొందరికి ఎంతో కొంత ఇస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే.. మీ భూములు 111 జీవోలో ఉన్నాయని బెదిరిస్తున్నారు. 'మీ భూములు సర్కారు తీసుకుంటుంది. డబ్బులు ఎప్పుడొస్తాయో తెలియదు. మేం డబ్బులిస్తామంటూ' నచ్చజెబుతున్నారు. మట్టి తవ్వకాలపై మైనింగ్ శాఖ అధికారులను వివరణ కోరగా వారు స్పందించలేదు.

# అంగన్‌వాడి టీచర్ పోస్టుల భర్తీలో చేతివాటం?

ఎల్లారెడ్డిపేట : అంగన్‌వాడీ టీచర్ల పోస్టుల భర్తీలో కొందరు భారీ మొత్తంలో చేతివాటం ప్రదర్శించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో ఆయాలుగా పనిచేస్తున్న వారికి అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతులు కల్పించారు. పైసలిస్తేనే పదోన్నతులుంటాయంటూ అంగన్‌వాడీ టీచర్ల సంఘం ప్రతినిధులు కొందరు రూ.లక్షల్లో వసూలు చేశారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం ఫిర్యాదు మేరకు సంఘం ప్రతినిధులు ఎదురుగట్ల మమత, కొర్రి సునీత, సింగారపు పద్మలపై గత నెల 26న ఎల్లారెడ్డిపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూడగా ముడుపుల వసూళ్లలో కొందరు అధికారుల హస్తం కూడా ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**జిల్లాలో మొత్తం 13 మంది నియామకం**

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం(ఐసీడీఎస్) పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్‌లో భాగంగా పోషకాహారలోపాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం కొత్తగా వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో మొత్తం 587 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 53 అంగన్‌వాడీ టీచర్లు, 159 మంది ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరో 14



కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కూడా లేరు. ఈ నేపథ్యంలో ఆయాలకు అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు గతేడాది డిసెంబరులో మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులు విడుదల చేసింది. ఇంటర్మీడియట్ విద్యనభ్యసించి అయిదేళ్లపాటు ఆయాలుగా పనిచేసి ఉండాలని లేదా పదో తరగతి చదివి పదేళ్లపాటు ఆయాలుగా కొనసాగినవారై ఉండాలనే నిబంధన విధించారు. ఈ మేరకు సిరిసిల్ల ఐసీడీఎస్ కింద 12 మంది, వేములవాడ ఐసీడీఎస్ పరిధిలో ఒకరికి అంగన్‌వాడీ టీచర్లుగా డిసెంబరు 28న పదోన్నతులు కల్పించారు. కాగా పదోన్నతులు రావాలంటే రూ.లక్ష చొప్పు చెల్లించాలని పేర్కొంటూ ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ముగ్గురు అర్హులైన ఆయాలు ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష చొప్పున వసూలు చేసినట్లు తెలిసింది. విషయం బయటకు పొక్కగానే జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

**విచారణ కొనసాగుతోంది**

ఆయాలకు అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పించే విషయంలో డబ్బుల వసూళ్లపై విచారణ కొనసాగుతోంది. ఉన్నతాధికారుల హస్తముందనే ఆరోపణలు అవాస్తవం. పదోన్నతుల కోసం ఎవరూ డబ్బులు ఇవ్వవద్దని.. ఎవరి మాటలూ నమ్మవద్దని చాలా సార్లు చెప్పాం. సిరిసిల్ల ఐసీడీఎస్ పరిధిలో ముగ్గరి వద్ద రూ.3 లక్షలు తీసుకోవడంతోపాటు మరొకరిని బెదిరించినట్లు మా వద్ద సమాచారం ఉంది. 13 మంది ఆయాలకు అంగన్‌వాడీ టచర్లుగా పదోన్నతులు కల్పించగా మిగతా కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమాధికారి

# అక్రమ నిర్మాణాలకు అడ్డేది?

సిరిసిల్ల : వర్షాకాలం వచ్చిందంటే చాలు.. చెరువుల సమీపంలోని నివాస ప్రాంతాల వారికి వణుకు మొదలవుతుంది. జలవనరులు, నాలాల సమీపంలో ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధిలో నిర్మాణాలు చేపట్టిన వారికి ముంపు భయం పొంచి ఉంది. సిరిసిల్ల, వేములవాడ పురపాలికల్లో చెరువులకు హద్దులు ఏర్పాటు చేసేందుకు అధికారులు నేటికీ చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. ఫలితంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధిలో ఆక్రమణల పర్వం జోరుగా సాగుతోంది. పట్టణంలోని కార్గిల్‌లేక్ 12.36 ఎంసీఎఫ్‌టీలు. ఎగువన వరదనీరు వచ్చేందుకు కాల్వలు ఉన్నాయి. ఈ చెరువు అలుగు పారితే ఆ నీరంతా దిగువన మానేరువాగులోకి వెళ్లాలి. వరదనీరు వెళ్లే కాల్వను పూడ్చేసి రియల్ వ్యాపారులు ప్లాట్లుగా చేసి విక్రయించారు. చెరువులోకి వరదనీరు పోటెత్తితే ఎగువన ఉన్న తారకరామానగర్, ఇందిరానగర్ కాలనీలు ముంపునకు గురవుతాయి. ముష్టిపల్లి,



చిన్నబోనాల, కార్గిల్‌లేక్, చంద్రంపేట ప్రాంతాల్లో రియల్ వ్యాపారులు ప్లాట్లకోసం నాలాలను ఆక్రమించి విక్రయించేస్తున్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్, నాలాల పరిధిలో ఇళ్ల నిర్మాణాల కోసం సిరిసిల్ల పురపాలికలో 75 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. రగుడు మల్లన్నకుంటను చదునుచేసి పంటలు సాగుచేస్తున్నారు. వేములవాడ పట్టణంలోని మూలవాగు వెంబడి బఫర్ జోన్ గుర్తించలేదు. దీంతో ఈ వాగువెంట నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో 40 నిర్మాణాలను పురపాలిక అధికారులు బఫర్‌జోన్‌లో ఉన్నట్లు గుర్తించారు.

**సీఅండ్‌డీ లేక**

రెండు పురపాలికల్లో నెలకు సగటున 25 టన్నుల నిర్మాణ వ్యర్థాలు వెలువడతాయి. నిర్మాణ వ్యర్థాలను పునరుత్పాదక వనరుగా మార్చేందుకు సీఅండ్‌డీ (కన్‌స్ట్రక్షన్ అండ్ డెబ్రిస్) మేనేజ్‌మెంట్ ప్లాంటు లేదు. ఆ వ్యర్థాలన్నీ చెరువులు, మానేరు, మూలవాగుల్లోకి చేరుతు న్నాయి. జలవనరులు కనుమరుగయ్యేందుకు, ఆక్రమణలకు ఇవి కారణం అవుతున్నాయి. నిర్మాణ వ్యర్థాల తరలింపును నిలువరించాల్సిన పురపాలిక, రెవెన్యూశాఖల అధికారులు ఆ దిశగా చర్యలేవీ చేపట్టడంలేదు.

సిరిసిల్ల పట్టణంలో ఈదుల చెరువు సామర్థ్యం 26.67 ఎంసీఎఫ్‌టీలు. ఎగువన కోనరావుపేట మండలం నుంచి గొలుసుకట్టు చెరువుల ద్వారా ఇందులోకి వరదనీరు వస్తుంది. ఇది నిండిన అనంతరం కొత్తచెరువులోకి నీరు చేరుతుంది. ప్రస్తుతం ఈ చెరువు సగానికిపైగా కబ్జా అయింది. రాజీవ్‌నగర్, చంద్రంపేట రెండువైపులా నిర్మాణవ్యర్థాలతో చదునుచేస్తూ తాత్కాలిక కట్టడాలు చేపడుతున్నారు. ఈ చెరువు ఎఫ్‌టీఎల్‌లో 48 ఇంటి నిర్మాణాలు వెలిశాయి.

# విద్యార్థులకు నవోదయం

ఎమ్మిగనూరు : ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య, ఉత్తమ విలువలు, నైపుణ్యాలు, దేశభక్తి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం, ఎన్‌సీసీలకు పెట్టింది పేరు జవహర్ నవోదయ విద్యాలయం. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సామాన్య బడుగు, బలహీనవర్గాల పేద విద్యార్థులకు చదువుతోపాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి చేరికలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

**జాతీయ విద్యావిధానంతో...**

కేంద్రప్రభుత్వం 1987లో జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి బనవాసి జవహర్ నవోదయ విద్యాలయాన్ని ప్రారంభించింది. ఇక్కడ చదివిన వారు ఉన్నతసాయిలో స్థిరపడ్డారు. విద్యాలయంలో 80 సీట్లకు పోటీ ఉంటుంది. ఏటా ఆరోతరగతిలో ప్రవేశానికి పరీక్షలు నిర్వహిస్తారు. వాటిని రాసేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా 8 వేలమందికి పైగానే విద్యారులు పోటీ పడుతుంటారు. ఆరోతరగతి నుంచి పన్నెండో తరగతి వరకు ఉచితంగా విద్యను అందిస్తారు. ఇక్కడ బాలికలు, బాలురకు వేర్వేరుగా వసతిసౌకర్యాలు కల్పిస్తారు. ఎంపిక విధానంలో 80 సీట్లకు గానూ, 75 శాతం గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు, 25 శాతం పట్టణ విద్యార్థులకు కేటాయిస్తారు. ఇందులో మూడో వంతు బాలికలకు కేటాయిస్తారు.

**ఆన్‌లైన్‌లో చేయాలి**

విద్యా సంవత్సరం : 2026-2027
అభ్యర్థులు 3, 4, 5 తరగతుల్లో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఉత్తీర్ణత పొంది ఉండాలి.
అభ్యర్థులు ఉమ్మడి జిల్లా ప్రాంతాల్లో ఉండాలి. (కర్నూలు, నంద్యాల)
అభ్యరులు 01.05.2014 నుంచి 31.07.2016 మధ్య జన్మించాలి.




దరఖాస్తు చివరి తేదీ: 29.07.2025 ః ప్రవేశ పరీక్ష తేదీ 13.12.2025 (శనివారం)వెబ్‌సెట్: /// %cseitems.rcil.gov.in/nvs% ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
సీట్ల సంఖ్య: 80

**ఇవీ ప్రత్యేకతలు**

విద్యారులకు బయాలజి, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ల్యాబ్‌లుంటాయి.
హిందీ, ఇంగ్లిషు, తెలుగు భాషల్లో తగిన ప్రాధాన్యం.
వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, గీతాలాపన, చిత్రలేఖనం, సాంఘిక నాటకాల ప్రదర్శనలో శిక్షణ ఇస్తారు.
ఆత్మస్థైర్యం పెరిగేలా స్వీయరక్షణపై మార్షల్ ఆర్ట్సలో శిక్షణ
వసతి, ఆహారం, పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బూట్లు, ఉచితంగా అందిస్తారు.క్రీడలు, చిత్రలేఖనం, సంగీతం, యోగా, కరాటే, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్‌లలో శిక్షణ ఇస్తారు.
ఐఐటీ, నీట్ బుక్స్, ఎన్ఐటీ, ఏఐఈఈఈ, ఎయిమ్స్, ఎన్‌సీఈఆర్‌టీ, పోటీ పరీక్షలకు 11 వేల పుస్తకాలు ఉన్నాయి.
కళాశాల పేరు: జవహర్ నవోదయ విద్యాలయం, బనవాసి ఫారం
విస్తీర్ణం: 32 ఎకరాలు
ఏర్పడినది: 1987
ప్రతి ఏడాది భర్తీ చేసే విద్యార్థుల సంఖ్య: 80 మంది

**పరీక్ష నిర్వహిస్తారిలా..**


ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో మొత్తం 100 మార్కులకు ప్రశ్నలుంటాయి. మెంటల్‌ఎబిలిటీలో 40 ప్రశ్నలకు 50 మార్కులు, అర్థమెటిక్‌లో 20 ప్రశ్నలకు 25 మార్కులు, లాంగ్వేజ్‌లో 20 ప్రశ్నలకు 25 మార్కులుంటాయి. వాటిలో విద్యార్థులు అర్హత సాధించాల్సి ఉంటుంది.

**ఉన్నత ప్రమాణాలకు కీలకం**

-పద్మావతి, ప్రిన్సిపల్, బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం, ఎమ్మిగనూరు.నవోదయలో చదివే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉంటోంది. ఉన్నత ప్రమాణాలకు నవోదయ విద్య కీలకం. ఆరోతరగతిలో చేరే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఉమ్మడి జిల్లాలో బనవాసిఫారంలో ఉండటంతో పేర్లు నమోదు చేసుకోవాలి.

# ధర పడిపోతోంది..!

కలిదిండి : రొయ్య ధర నానాటికీ పడిపోతోంది. ట్రంప్ సుంకాల ప్రకటనతో దిగజారిన ధరలు నేటికీ స్థిరపడలేదు. ఓ వైపు వాతావరణం.. ఇంకో వైపు వ్యాధుల బెడదతో బెంబేలెత్తుతున్న సాగుదారులకు దిగజారుతున్న ధరలు దడ పుట్టిస్తున్నాయి. 20 రోజుల వ్యవధిలో 100 కౌంటు ధర రెండు దఫాలుగా రూ.10 తగ్గిపోయింది. ఇది మరింత కిందకు దిగితే.. భారీ నష్టాలు తప్పవంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు.కదలని ధర.. అమెరికా సుంకాల ప్రకటనకు ముందు రూ.260 వరకు పలికిన 100 కౌంటు ధర అతివేగంగా రూ.190-200కు పడిపోయింది. సుంకాల నిలుపుదల తర్వాత తిరిగి రూ.230కి చేరడానికి నెలలు పట్టింది. ఆ మాత్రం ధర ఉంటే తక్కువ నష్టాలతో బయట పడొచ్చనే ధీమాతో రైతులు ముందుకు సాగారు. ఇంతలో నిలకడ వాతావరణంతో ఆకస్మిక పట్టుబడులు చేయాల్సి రావడంతో క్షేత్రస్థాయిలో మధ్యవర్తులు పట్టికలో ఉన్న ధర కంటే



రూ.5-10 వరకు తగ్గించి కొనుగోలు చేయడంతో గత్యంతరం లేక అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది.చెరువులు ఖాళీ.. మే నెల అంతా ఎడతెరిపి లేని వర్షాలు ఆక్వాను వణికించాయి. జూన్ నెల ఆరంభంలోనే భానుడు భగ్గుమంటున్నాడు. వాతావరణంలో ఈ విపరీత ధోరణి రైతులకు అంతుచిక్కడం లేదు. నిలకడ లేని వాతావరణంతో ఏ క్షణమైనా పట్టుబడి పట్టడానికి సిద్ధంగా ఉండాల్సి పరిస్థితి నెలకొంది. నెల రోజుల వ్యవధిలో దాదాపు 40 శాతం చెరువులు ఖాళీ అయిపోయాయి. దిగజారుతున్న ధరల్లో పట్టుబడి పట్టాల్సి వస్తే.. నష్టాల నుంచి కోలుకోలేమంటూ సాగుదారులు ఆవేదన చెందుతున్నారు.20 రోజుల్లో రూ.10 కోత.. రూ.230 ధర కాస్తా క్రమంగా తగ్గుముఖం పడుతోంది. మే తొలి వారంతో 100 కౌంటు ధర రూ.230 ఉండగా.. మూడో వారంలోకి రాగానే రూ.225కి పడిపోయింది. జూన్ ఒకటో తేదీకి మరో రూ.5 తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముమ్ముందు ఇదే పరిస్థితి కొనసాగితే ఏమి చేయాలో తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

# ఊపిరి ఆడేనా..?



పుత్తూరు : కొవిడ్ కేసులు అక్కడక్కడా మళ్లీ వెలుగుచూస్తున్నాయి. ఆసుపత్రుల్లో చూస్తే ఆక్సిజన్ సరఫరా కేంద్రాలున్నా అవి మూలనపడ్డాయి. వైరస్ బారిన పడిన బాధితులకు అత్యవసర పరిస్థితుల్లో ఆక్సిజన్ అందించాల్సి ఉంటుంది. గతంలో సకాలంలో ఆసుపత్రుల్లో పడకలు దొరక్క, ఆక్సిజన్ అందక చాలా మంది మృత్యువాత పడ్డారు. జిల్లాలో సామాజిక ఆసుపత్రుల్లో వైకాపా హయాంలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్లు సాంకేతిక సమస్యలతో పనిచేయడం లేదు. ఈ నేపథ్యంలో బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసిన సిలిండర్లతో ప్రాణవాయువు సరఫరా చేస్తున్నారు. ఒక వేళ మళ్లీ కొవిడ్ ఉద్ధృతమైతే సిలిండర్ల కొరత ఏర్పడి ప్రాణవాయువు సరఫరా ప్రశ్నార్థకంగా మారనుంది. ఇప్పటికైనా వైద్యారోగ్యశాఖ సన్నద్ధం కావాల్సిన అవసరం ఉంది. తిరుపతి రుయా ఆసుపత్రిలో కొవిడ్‌తో చికిత్స పొందుతున్న రోగులకు 2021 మే 10వ తేదీ రాత్రి ఏడు గంటల సమయంలో ఆక్సిజన్ సరఫరా అకస్మాత్తుగా నిలిచిపోయింది. దీంతో చికిత్స పొందుతున్న 42 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో బాధితుల ఆర్తనాదాలతో ఆసుపత్రిలో విషాదం అలముకుంది. ఇది ముమ్మాటికీ అప్పటి వైకాపా ప్రభుత్వ, అధికార యంత్రాంగ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం.. అమాయక ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఈ సంఘటన తరవాత ఆగమేఘాలపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఆసుపత్రులలో రూ.లక్షలు ఖర్చు పెట్టి వైకాపా ప్రభుత్వం ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేసి వాటికి జగనన్న ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాలుగా పేరు పెటుకున్నారు. అయితే అవి ప్రారంభం కాకనే మూతపడటం గమనార్హం.

సీఎం చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పంలో నేడు ఆక్సిజన్ ప్లాంటు పనిచేయడం లేదు. కొవిడ్ సమయంలో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా రూ.50 లక్షలతో ఈ ప్లాంటు ఏర్పాటు చేశారు. దీన్ని చూసి వైకాపా ప్రభుత్వం సైతం ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు చేయించింది. ఈ రెండూ ప్రస్తుతం పనిచేయడం లేదు. వీటికి మరమ్మతులు చేయాలనే కనీస ఆలోచన అధికారులకు లేకపోవడం గమనార్హం.

**ఆదేశాలు వస్తే బాగు చేయిస్తాం..**

గతంలో ఆసుపత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేసిన గుత్తేదారులే వాటిని బాగు చేయాలి. అప్పట్లో టెక్నీషియన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇంకా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. వచ్చిన వెంటనే బాగు చేయిస్తాం.బాలకృష్ణనాయక్, జిల్లా వైద్యాధికారి, తిరుపతి జిల్లా

# నిరీక్షణ లేదు.. నిరంతరం



చిత్తూరు : విభిన్న ప్రతిభావంతులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వైకల్య ధ్రువపత్రాలు తీసుకోవడానికి మూడు నెలలకోసారి కల్పిస్తున్న స్లాట్ బుకింగ్ అవకాశాన్ని నిరంతర ప్రక్రియగా మార్చేందుకు చర్యలు చేపట్టింది. తద్వారా దివ్యాంగులకు నిరీక్షణ తప్పనుంది. జిల్లాలో 34,846 మంది దివ్యాంగులు ప్రతి నెలా రూ.21.12 కోట్లు పింఛను పొందుతున్నారు. అర్హత కలిగి ఇంకా పొందాల్సిన వారూ ఉన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇలాంటి వారికి మేలు జరగనుంది. వైకల్యం 40 శాతం లోగా ఉంటే తెలుపు రంగు కార్డు, 40 నుంచి 80 శాతం ఉంటే పసుపు కార్డు, ఆపైన ఉంటే నీలి రంగు కార్డు ఇస్తారు. కనీసం 40 శాతం వైకల్యం ఉంటే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల పథకాలు, పింఛన్లు పొందే అవకాశం ఉంది. దీని కంటే తక్కువ వైకల్యం ఉంటే పరిమిత సంఖ్యలో మాత్రమే లబ్ధి చేకూరనుంది.

**ప్రస్తుతమిలా..:** విభిన్న ప్రతిభావంతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక సదుపాయాలు, అవకాశాలతో పాటు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. ఎవరైనా ప్రమాదవశాత్తూ దివ్యాంగులైతే సదరం శిబిరంలో పేర్లు నమోదు చేయించుకుని ధ్రువపత్రాలు పొందుతారు. ప్రస్తుతం ఇది మూడు నెలలకోసారి జరుగుతోంది. దీంతో స్లాట్ బుకింగ్ కోసం చాలామంది వేచి చూస్తుంటారు. సకాలంలో నమోదు చేసుకోకుంటే మరో మూడు నెలలు వేచి ఉండాల్సిందే.

**శాశ్వత పరిష్కారమిలా..:** కేంద్రం యునిక్ డిజెబిలిటీ ఐడీ కార్డు(యూడీఐడీ) ఇస్తోంది. ప్రస్తుతం ఉన్న సదరం వ్యవస్థను దీనికి అనుసంధానించి గుర్తింపు కార్డులు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించడంతో ఆయా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. తద్వారా దివ్యాంగులు తమ అర్హత ధ్రువీకరించుకోవడానికి ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఇందుకు వీలుగా చర్యలు చేపట్టాలని గ్రామ, వార్డు సచివాలయ శాఖకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

# కలగా పీఏబీఆర్ లింకు కాలువ ఆధునికీకరణ



ఉరవకొండ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రధానమైన పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)కు హెచ్చెల్సీ నుంచి నీటిని అందించే లింకు కాలువ ఆధునికీకరణ కలగా మారింది. రోజురోజుకు కాలువ శిథిలం అవుతుండటంతో నీటి తరలింపు కష్టంగా మారుతోంది. ఈ కాలువ ఉరవకొండ మండలం మోపిడి వద్ద ప్రారంభం అవుతుంది. మొత్తం 11 కిలోమీటర్ల మేర ఉంది. ఎక్కడికక్కడ శిథిలం అయ్యింది. లైనింగ్ కూలిపోతుండటంతో మట్టి కాలువలోకి చేరుతోంది. ఒకటి రెండు చోట్ల వంతెనలు కూలిపోయాయి. కొన్నిచోట్ల గట్టు బలహీన పడింది. కాలువ పొడవునా కంపచెట్లు పెరిగాయి. గతంలో పలుమార్లు కాలువ తెగిన సందర్భాలు ఉన్నాయి. అలాంటి చోట్ల తాత్కాలిక మరమ్మతులు చేయించి, చేతులు దులుపుకొన్నారు.

**200 క్యూసెక్కుల ప్రవాహం కష్టమే**

లింకు కాలువ ద్వారా రోజుకు 1,600 క్యూసెక్కుల నీటిని పీఏబీఆర్‌కు తరలించాలి. కాని కాలువ శిథిలం కావడంతో గత మూడు నాలుగేళ్లుగా రోజుకు 200 క్యూసెక్కుల నీరు పారడం కష్టంగా మారింది. ఈ కారణంగా నిర్దేశించిన మేర నీరు జలాశయానికి చేరడం ఇబ్బందిగా ఉంది. పీఏబీఆర్ నుంచి రెండు జిల్లాల్లోని ప్రధాన పట్టణాలతో పాటు మరో 900 గ్రామాలకు తాగునీరు, కుడి కాలువల ద్వారా నాలుగు నియోజకవర్గాల్లోని 42 చెరువులకు నీరు అందనున్నాయి. కాలువ ఆధునికీకరణపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**ప్రతిపాదనలకే పరిమితం**

పీఏబీఆర్ లింకు కాలువ ఆధునికీకరణ ప్రతిపాదనలు దాటడం లేదు. గతంలో రూ.70 కోట్లతో అధికార యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అయితే గత వైకాపా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రూ.78 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అందులో వంతెనలు, అండర్ టన్నెళ్లు నిర్మించేలా రూపొందించారు. నిధులు విడుదల కావాల్సి ఉంది. తాజాగా లింకు కాలువ ప్రధాన షట్టర్ నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే ఆధునికీకరణ పనులు ప్రారంభించడానికి అవకాశం ఉంది. ఈ విషయమై హెచ్చెల్సీ డీఈఈ ఉదయశీనయ్య వివరణ కోరగా నిధులు మంజూరు కోరుతూ ప్రతిపాదించాం. ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు.

# చెరువులకు తెలు'గంగ'

సూళ్లూరుపేట : జిల్లా రైతాంగం ఎడగారులో తీరిక లేకుండా కనిపిస్తున్నారు. ఈ దఫా చెరువుల్లో కొంతమేర నీరు ఉండటంతోపాటు తెలుగుగంగ నీటిని చెరువులు, కాలువలకు విడుదల చేయడంతో ఎప్పుడు లేని విధంగా వేలాది ఎకరాల్లో రెండో పంట సాగుపై దృష్టి పెట్టారు. ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. కండలేరు జలాశయం నుంచి తెలుగుగంగ ప్రధాన కాలువ ద్వారా గత నెలలో చెన్నైకి నీటిని విడుదల చేశారు. ఇదే క్రమంలో జిల్లాలోని 1,24,640 ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. స్వర్ణముఖి నదికి రెండు టీఎంసీల నీటిని విడుదల చేసి పెళ్లకూరు, నాయుడుపేట, కోట, చిట్టమూరు, వాకాడు ప్రాంతాల్లో రైతుల సాగు, తాగు నీటి అవసరాలను తీర్చనున్నారు. సాగునీటితోపాటు తిరుపతి, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు 4.75 టీఎంసీలు, మేనకూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట ప్రాంతాల్లోని పరిశ్రమలకు 1.25 టీఎంసీలు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



# శ్రమైక జీవనం.. అందని వేతనం!

ఉంగుటూరు : మండుటెండలను లెక్క చేయకుండా.. కుటుంబ పోషణార్థం ఉపాధి హామీ పనులకు వెళ్తున్న శ్రామికుల నోట్లోకి నాలుగు ముద్దలు వెళ్లడం గగనమైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో వేతనాలు చెల్లించకపోవడంతో.. కుటుంబ పోషణ భారంగా మారింది. వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో.. పేద కుటుంబాలు ఉపాధి హామీ పనుల పైనే ఆధారపడుతున్నాయి.

రోజుకు రూ.307.. జిల్లాలో చెరువులు, పంట కాలువల్లో పూడికతీత, ఆయిల్‌పామ్ మొక్కల చుట్టూ పళ్లాలు(రింగ్ ట్రెంచ్), ఇంకుడు గుంతలు, నీటి కుంటలు తవ్వకాల పనులు చేస్తున్నారు. జాబ్‌కార్డున్న శ్రామికుల దినసరి వేతనాన్ని కేంద్ర ప్రభుత్వం రూ.307కు పెంచింది. ఫలితంగా ఇంటిల్లిపాదీ ఉపాధి పనులకు వెళ్లడానికి మొగ్గు చూపుతోంది. వారాల తరబడి చెల్లింపులు నిలిచిపోవడంతో.. వారు అప్పులు చేసి జీవనం సాగించాల్సిన దుస్థితి. నిబంధనల ప్రకారం పని చేసిన వారంలో వేతనం అందించాల్సి ఉండగా.. ఆ నిబంధన కేవలం కాగితాలకే పరిమితమవుతోంది.

**27 మండలాల్లో..** జిల్లాలో 27 మండలాలకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.138.65 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. దెందులూరు మండలంలో అత్యధికంగా రూ.12 కోట్ల మేర అప్పులు పేరుకుపోయాయి. అధికారులు స్పందించి వీలైనంత త్వరగా బకాయిలు చెల్లించాలని చూడాలని శ్రామికులు కోరుతున్నారు. 'ఉ



పాధి బకాయిల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే వేతనాలు జమ అవుతాయి' అని డ్వామా పీడీ సుబ్బారావు తెలిపారు.27 మండలాల్లో.. జిల్లాలో 27 మండలాలకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.138.65 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. దెందులూరు మండలంలో అత్యధికంగా రూ.12 కోట్ల మేర అప్పులు పేరుకుపోయాయి. అధికారులు స్పందించి వీలైనంత త్వరగా బకాయిలు చెల్లించాలని చూడాలని శ్రామికులు కోరుతున్నారు. 'ఉపాధి బకాయిల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే వేతనాలు జమ అవుతాయి' అని డ్వామా పీడీ సుబ్బారావు తెలిపారు. జిల్లా సమాచారమిలా..

పంచాయతీలు: 549
జాబ్‌కార్డులు: 3.82 లక్షలు
క్రియాశీలకమైనవి: 3.18 ,,
శ్రామికులు: 6.91 ,,
పనులు చేస్తున్నవారు: 5.47 ,,

# అన్నదాతల కన్నీళ్లకు 'అడ్డుకట్ట'!

పాలకొల్లు : జిల్లాలో ఉన్న 21 మేజర్ డ్రెయిన్లలో నక్కల డ్రెయిన్ ఒకటి. యలమంచిలి మండలం వడ్డిలంకలో దీనిపై ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిజ్ గేట్లు సరిగా పనిచేయక ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాల రైతులు మూడు దశాబ్దాలుగా సతమతమవుతున్నారు. ఏటా వరదల సమయంలో 20 వేల ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లేది. 1993లో నిర్మించిన ఈ స్లూయిజ్‌కు ఆటోమేటిక్ గేట్లు పెట్టడం వల్ల అనతికాలంలోనే పాడయ్యాయి. గేట్లు మరమ్మతులు చేయక ఏటా రూ.20 కోట్లు నష్టం వాటిల్లుతున్నా వైకాపా పాలనలో కనీసం గేట్లకు గ్రీజు పెట్టిన పాపాన పోలేదు. అయిట్‌ఫాల్ స్లూయిజ్ గేట్లు పనిచేయక అన్నదాతలు పడుతున్న ఇబ్బందులపై కూటమి ప్రభుత్వం వచ్చాక వరుస కథనాలు ప్రచురించింది. 2024 ఆగస్టు 22న 'ఎంతో కష్టం.. ఏటా నష్టం' శీర్షికన ప్రచురితమైన తొలి కథనానికి మంత్రి నిమ్మల రామానాయుడు స్పందించి గేట్లు మరమ్మతులకు హామీ ఇచ్చారు.

**నవంబర్‌లో నిధులు..**

స్లూయిజ్‌లో మొత్తం 12 గేట్లుండగా కింది గేట్లు 6 పనిచేయక వరదల సమయంలో గోదావరి నీరు ఎదురొచ్చి పంట పొలాలను ముంచెత్తేది. మంత్రి రామానాయుడు చొరవతో కొత్త గేట్లు పెట్టడానికి 2024



నవంబర్‌లో రూ.45 లక్షలు మంజూరయ్యాయి. అనంతరం టెండర్లు పిలిచి ఏప్రిల్‌లో తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని ఏజెన్సీకి పనులు అప్పగించారు.

**సేవలకు సిద్ధం..**

పనులు చేపట్టిన సంస్థ ఇటీవల పూర్తిచేయడంతో భారీ వర్షాలొచ్చినా గోదావరి వరదలొచ్చినా పంటలను కాపాడటానికి స్లూయిజ్ గేట్లు సిద్ధమయ్యాయి. కింది తలుపులు మొత్తం కొత్తవి ఏర్పాటుచేసి పైవరుసలో తలుపులకు మరమ్మతులు చేసి రంగులు వేశారు. డ్రెయిన్లశాఖ ఏఈ దుర్గారావును సంప్రదించగా వంద శాతం పనులు పూర్తయ్యాయని ఇకమీదట సమస్య ఉండదని చెప్పారు.

# బడి బస్సులు సిద్ధమేనా!

భీమవరం : మరికొద్ది రోజుల్లోనే నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. బడి బస్సుల భద్రతపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. ఏటా జూన్ తొలి వారం లోపు రవాణాశాఖ ద్వారా సామర్థ్య పరీక్షలు చేయించుకుని ధ్రువపత్రం పొందిన బస్సులు, వ్యాన్లు మాత్రమే రోడ్లపైకి రావాలి. జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు చెందిన 1,650 వాహనాలు ఉండగా 1,255 బస్సులకు పరీక్షలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మరో 395 వాహనాలకు ఈ వారంలోపు పరీక్షలు చేయాల్సి ఉంది.

12 అంశాల్లో.. బడి బస్సులకు ఇంజిన్, స్టీరింగ్, హెడ్‌లైట్, హ్యాండ్ బ్రేక్, చక్రాలతో పాటు పెయింటింగ్, పొగ తదితర 12 రకాల పరీక్షలు నిర్వహిస్తారు. అన్నీ సక్రమంగా ఉంటేనే ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. ఏదైనా లోపం ఉన్నట్లు గుర్తిస్తే మరమ్మతులు చేయించి తీసుకురావాలని సూచిస్తారు. అవి పూర్తయ్యాక మరోసారి సామర్థ్య పరీక్షలు చేస్తారు. విద్యా సంవత్సరం మొదలైన వెంటనే ప్రత్యేక తనిఖీలు చేపట్టి సామర్థ్య ధ్రువీకరణ లేని వాహనాలను సీజ్ చేస్తామని జిల్లా రవాణాధికారి ఉమామహేశ్వరరావు తెలిపారు.

# టిడ్కో.. మోక్షం ఎప్పటికో?

అనంతపురం : 2019కు ముందు అప్పటి తెదేపా ప్రభుత్వం పట్టణ పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లు నేటికీ అర్థరహితంగానే మిగిలాయి. నిర్మాణాలు చివరి దశలో ఉన్న సమయంలో వైకాపా అధికారంలోకి రావడంతో లబ్ధిదారులకు అప్పగించే ప్రక్రియ నిలిచిపోయింది. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో ఆశలు చిగురించాయి. ఈ ఏడాది జూన్‌లోగా పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందిస్తామని ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. అయితే ఇప్పటికీ ఒక్క అడుగు ముందుకు కదల్లేదు. ఉమ్మడి అనంతలోని తాడిపత్రి, అనంతపురం, ధర్మవరం మున్సిపాలి టీల పరిధిలో ఇళ్ల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. తుది మెరుగులు దిద్ది లబ్ధిదారులకు అందించడమే తరువాయి. కానీ గుత్తేదారులకు బిల్లులు చెల్లించక పోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది.

**వైకాపా హయాంలో రివర్స్**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అప్పటి తెదేపా ప్రభుత్వం అనంతపురం అర్బన్, పామిడి, గుత్తి, గుంతకల్లు, రాయదుర్గం, ధర్మవరం, తాడిపత్రి,



కదిరి, పుట్టపర్తి, హిందూపురం పరిధిలో 20,400 టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. వైకాపా అధికారంలోకి వచ్చాక 25 శాతం కంటే తక్కువ జరిగిన పనుల్ని రద్దు చేసింది. తాడిపత్రి, అనంతపురం, ధర్మవరం పరిధిలో అప్పట్లోనే 80 శాతానికిపైగా పనులు పూర్తి కావడంతో పాత గుత్తేదారునే కొనసాగించారు. తాడిపత్రి, ధర్మవరంలో ఇప్పటికే రెండు వేలకుపైగా ఇళ్లు లబ్ధిదారులు చేరేందుకు సిద్ధంగా ఉన్నాయి. అనంతపురం అర్బన్ పరిధిలో కిటికీలు, విద్యుత్తు పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.

**రూ.15.5 కోట్లు పెండింగ్**

తాడిపత్రిలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన గుత్తేదారుకు రూ.8 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఇళ్లను అప్పగించేందుకు ఒప్పుకోవడం లేదు. ధర్మవరం, అనంతపురంలో పనులు చేపట్టిన సంస్థకు రూ.3.5 కోట్లు చెల్లించాల్సి ఉంది. తాడిపత్రి, అనంతపురం, ధర్మవరంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు నిర్మించిన కంపెనీలకు రూ.4 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం రూ.15.5 కోట్లు బిల్లులు చెల్లించి తుది మెరుగులు దిద్దితే 10 వేల మందికి ఇళ్లు అప్పగించేందుకు అవకాశం ఉంది.

# రూ.కోట్లతో పనులు.. పూర్తవ్వని తీరు

తాడిపత్రి: వైకాపా ప్రభుత్వంలో పలు ప్రగతి పనులను ఆర్భాటంగా ప్రారంభించారు. ఆ తర్వాత నిధులు రాక అర్థాంతంగా ఆపేసి చేతులు దులుపుకొన్నారు. మరికొన్ని తెదేపా ప్రభుత్వంలో ప్రారంభించినా తర్వాత వైకాపా రావడంతో.. ఆ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు సాగలేదు. గత ఐదేళ్లలో జగన్ సర్కారు ప్రజలకు మెరుగైన పాలన అందించామని చెప్పుకొన్నారే తప్ప క్షేత్రస్థాయిలో చేసిందేమీలేదు. ఈనేపథ్యంలో క్షేత్రస్థాయిలోని పరిస్థితిపై పరిశీలన కథనం. తాడిపత్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 2017 సంవత్సరంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు సుమారు రూ.2కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. అనంతరం వైకాపా అధికారంలోకి రావడంతో బిల్లులు రాక పనులు మధ్యలోనే ఆపేసి వెళ్లిపోయారు.

తాడిపత్రిలోని పాతకోట కాలనీలో 2020 సంవత్సరంలో పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మించేందుకు సుమారు రూ.కోటి కేటాయించారు.



ప్రారంభంలో పనులు బాగానే జరిగినా తరువాత బిల్లులు సరిగా రాలేదని మధ్యలోనే ఆపేశారు. ప్రస్తుతం 80శాతం పనులు పూర్తి అయినట్లు అధికారులు చెబుతున్నారు.

యాడికిలోని పీహెచ్‌సీకి నూతన భవనాలు నిర్మించేందుకు 2022లో సుమారు రూ.1.94కోట్లు కేటాయించారు. పెద్దారెడ్డి ఆర్భాటంగా ఆసుపత్రి నూతన భవనాలకు భూమి పూజ చేశారంతే. రాయలచెరువు లోనూ ప్రాంతీయ వైద్యకేంద్రం నూతన భవనాల పనులు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు చేతులెత్తేశారు.

**ఉన్నతాధికారులతో చర్చిస్తాం**

శివరామకృష్ణ, మున్సిపల్ కమిషనర్

పాతకోట కాలనీలో ఉన్న పట్టణ ఆరోగ్యం కేంద్రం 80శాతం పనులు చేశారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లులు సరిగా కాకపోవడంతో నిర్మాణ పనులు ఆపేశారు. ప్రస్తుతం మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డితో ఆరోగ్య కేంద్రం గుర్తించి చర్చించి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఇండోర్ స్టేడియం గురించి సంబంధిత అధికారులకూ తెలియజేస్తాం.

# దళారుల దోపిడీ.. పరిశ్రమల గారడీ

పాకాల : మామిడి ధరలను నియంత్రిస్తూ వ్యాపారులతో కలిసి దళారులు దోపిడీ చేస్తున్నారు. గత వారం బయటి రాష్ట్రాల వ్యాపారులు నేరుగా రైతుల నుంచి కొనుగోళ్లు ప్రారంభించారు. ఐతే వారు కాస్త గిట్టుబాటు ధరపెట్టి కొనుగోలు చేస్తున్నట్లు తెలియగానే స్థానిక దళారీలు వారితో కలిసి కుట్రకు తెరతీశారు. అవసరమైన మేరకు కాయలు తామే కొని ఇస్తామంటూ కుమ్మక్కయ్యారు. కాదంటే దబాయిస్తున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొంటున్న దళారీలు బయటి వ్యాపారులకు అధిక ధరతో అమ్మి మోసానికి పాల్పడుతున్నారు. మామిడి రకాన్ని బట్టి టన్నుపై కనీసం రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు దోపిడీ చేస్తున్నారు.అధికారులు పట్టించుకోక.. ప్రధాన మార్కెట్ల లో మామిడి ధరలను బహిరంగంగా ప్రదర్శించాలని, అవసరమైతే ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో ధరల పట్టికను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నా పట్టింకునేవారు కరవయ్యారు. బహిరంగ మార్కెట్లో మాగిన హిమాంపసంద్ కిలో రూ.80-100 వరకు అమ్ముడుపోతుంటే రైతు నుంచి రూ.40 మించి కొనడం లేదని, ఇతర రకాల పరిస్థితీ ఇలాగే ఉందని వాపోతున్నారు. పుల్లూరా రకం రాక తగ్గినా ధర మాత్రం పెరగలేదంటున్నారు. గుజ్జు పరిశ్రమలు తోతాపురి కాయలు రూ.5 మించి కొనకపోవడం దారుణానికి పరాకాష్టగా అభివర్ణిస్తున్నారు.

# ఇంకెప్పుడు పెరగాలి భూగర్భజలం



కదిరి : జలమే జీవం. వర్షపునీరు వ్యర్థమవకుండా.. భూగర్భంలో నింపితేనే భవిష్యత్తుకు జలవనరులు అందుతాయి. అందుకు ప్రభుత్వం ఇళ్ల ముందే ఇంకుడు గుంతల (సోక్ పిట్లు) నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లోని ఇళ్ల ముందు ఉపాధి హామీ పథకంలో ఇంకుడు గుంతలను తవ్విస్తున్నారు. దీంతో కూలీలకు ఉపాధి, వృథా నీటితో భూగర్భ జలాలు పెరిగేలా సంకల్పించారు. గ్రామీణ వీధుల్లో మురుగు పారకుండా గుంతల్లోకి చేరుతుంది. తద్వారా పరిసరాల శుభ్రత, ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడతాయి. అయితే ఈ పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ సంకల్పం, లక్ష్యం నెరవేరడం లేదు. ఉపాధి పథకం సిబ్బంది చొరవ చూపి కూలీలను చైతన్యపరచి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

**రెండు రోజుల్లో తవ్వే గుంతకు జాప్యమెందుకు..**

ఇంకుడు గుంత తవ్వకం మొదలు పెడితే రెండు రోజుల్లో పూర్తవుతుంది. అయితే ఈ పథకం ప్రారంభించి మూడు నెలలు అవుతోంది. అయినా మొదటి విడత లక్ష్యంలో నాలుగో వంతు పూర్తవలేదు. జిల్లా వ్యాప్తంగా మండలానికి వెయ్యి చొప్పున 32 వేల గుంతలు లక్ష్యంగా నిర్ణయించారు. మొదట 8 వేల పనులకు అనుమతులు పొందారు. ఇప్పటి వరకు కేవలం 1,742 మాత్రమే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని మండలాల్లో ఒకటి, అరా కూడా పనులు మొదలు కాలేదు. దీన్నిబట్టి ఉద్దేశించిన లక్ష్యం ఎంత ఆలస్యం అవుతుందో అర్థం అవుతుంది. ఒక్కో గుంతకు రూ.6 వేలు అంచనా. ఇందులో రూ.580 మట్టి పనులకు కూలి. మిగిలిన రూ.5,420 వస్తు సామగ్రికి ఇస్తారు. ఇప్పటికైనా చొరవ చూపితే అన్ని విధాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

జిల్లా: శ్రీసత్యసాయి
మండలాలు: 32
మంజూరైన గుంతలు : 8,389
పనులు జరుగుతున్నవి: 2,961
మట్టి తీసిన గుంతలు: 512
పూర్తయినవి : 1,742

**గడువులోపు పూర్తి చేస్తాం**

విజయేంద్రప్రసాద్, డ్వామా పీడీ

ఉపాధి పథకంలో చేపట్టిన సోక్‌పిట్లను గడువులోపు పూర్తి చేస్తాం. ప్రస్తుతం 8 వేల గంతలకు అనుమతులు పొందాం. వాటిలో కొన్ని పూర్తయ్యాయి. మిగిలిన గుంతలను తవ్విస్తాం. భూగర్భ జలాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తాం. తద్వారా ఇళ్లలో ఉపయోగించిన వ్యర్థపు నీటితో పాటు వర్షపునీరు వృథా కానివ్వకుండా ఒడిసి పట్టేలా చూస్తాం. తద్వారా భూగర్భజలాలు పెంపొందేలా కృషి చేస్తాం.

# గొల్లపల్లి తాగునీటి పథకానికి గ్రహణం



హిందూపురం : ఆరేళ్ల క్రితం హిందూపురం పట్టణంలో గుక్కెడి నీటికి అష్టకష్టాలు పడాల్సి వచ్చేది. ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపి రూ.194 కోట్లతో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకురావడానికి ప్రత్యేకంగా తాగునీటి పథకాన్ని నిర్మించేలా చూశారు. దీంతో 2019 మార్చి ఆఖరు నుంచి పట్టణంలో నీటి సమస్య తీరింది. గత ఐదేళ్లు వైకాపా ప్రభుత్వం నిర్వహణను పట్టించుకోలేదు. పథక నిర్వహణను ఏడేళ్ల పాటు అంటే 2026 మార్చి ఆఖరు వరకు గుత్తేదారు నిర్వహించాల్సి ఉన్నా వైకాపా ప్రభుత్వ హయాంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో వారు రెండేళ్ల క్రితం పథక నిర్వహణ నుంచి తప్పుకొని, తాగునీటి పథకాన్ని మున్సిపాలిటీకే అప్పగించారు.

**మున్సిపల్ అధికారులకు అవగాహన లేక..**

తాగునీటి పథకాల నిర్వహణపై మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు అవగాహన లేకపోవడం, నిధుల కొరతతో నిర్వహణ బరువుగా మారింది. తాగునీటి పథక నిర్వహణను మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ నేరుగా బిల్లులు చెల్లించలేక, ఓ గుత్తేదారు పేరుతో నిర్వహణ చేపట్టారు. అయితే పథకం మోటార్లు, పంపులు, పైపులైన్లు మరమ్మతులకు గురయ్యాయి. వాటికి మరమ్మతులు చేయించడానికి కరవు నిధులు కేటాయించారు. పథక నిర్వహణ, మరమ్మతుల పేరిట గతంలో కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు రావడంతో ప్రస్తుతం చేసిన పనుల బిల్లుల చెల్లింపును నిలిపేశారు. దీంతో మరమ్మతుల పనులు చేసిన గుత్తేదారు నిర్వహణ నుంచి తప్పుకొన్నారు. గుత్తేదారు తప్పుకోవడం, మరొకరు ముందుకు రాకపోవడం, ఏడాది కాలంగా మున్సిపాలిటీలో ఎలాంటి బిల్లులు చెల్లింపు జరగకపోవడంతో పథక నిర్వహణ భారంగా మారింది.

**ఆరు నెలలుగా నిలిచిన జీతాలు..**

తాగునీటి పథకంలో గొల్లపల్లి రిజర్వాయర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లోని నీటి సంపుల వద్ద 25 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి ఆరు నెలలుగా జీతాలు చెల్లించలేదు. మరో వైపు నీటి శుద్ధికి ఉపయోగించే ఆలం, క్లోరిన్ గ్యాస్ తదితర రసాయనాలు అందుబాటులో లేకుండా పోయాయి. పథక నిర్వహణకు నెలకు దాదాపు రూ.40 లక్షలు అవసరం. కార్మికులు పెనుకొండ నుంచి పట్టణానికి వచ్చి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసనలు తెలుపుతున్నా, వారి ఇబ్బందులను పట్టించుకోవడం లేదు.

**వేతనాల చెల్లింపునకు చర్యలు చేపట్టాం**

శ్రీనివాసులు, పుర కమిషనర్, హిందూపురం

ఆరు నెలలలుగా కార్మికులకు వేతనాలు నిలిచిపోయిన మాట వాస్తవమే. పాత గుత్తేదారుతో మాట్లాడుతున్నాం. అతడికి నిర్వహణ బాధ్యతలను ఇస్తాం. గుత్తేదారు ద్వారా వేతనాలు చెల్లింపు చేస్తాం. నిర్వహణకు మున్సిపల్ అత్యవసర నిధులను ఉపయోగిస్తాం.

# గుంతకల్లుకు రింగ్ రోడ్డు సమకూరేనా?



గుంతకల్లు : భారీ వాహనాలు గుంతకల్లులోకి రాకుండా పట్టణం వెలుపల నుంచే ఆయా మార్గాల్లో వెళ్లే విధంగా చేసేందుకు రింగ్‌రోడ్డును నిర్మించాలని ప్రతిపాదనకు మోక్షం కలగడం లేదు. వివిధ ప్రాంతాలకు వెళ్లే రోడ్లను అన్నింటిని కలుపుతూ రింగ్‌రోడ్డును నిర్మిస్తే సరకులతో, భారీ యంత్రాలతో వెళ్లే వాహనాలు పట్టణంలోకి రాకుండానే నేరుగా ఆయా మార్గాల్లో వెళ్లడానికి వెసులుబాటు ఉంటుంది. ఆదిశగా కార్యాచరణకు అధికారులు ముందుకు వెళ్లడం లేదు.

**ఒనగూరనున్న ప్రయోజనమిదే..**

రింగ్ రోడ్డు ఏర్పాటైతే రోడ్డు ప్రమాదాలను నిలువరించడానికి, ట్రాఫిక్‌కు అధికమించడానికి, రోడ్లు పాడైపోకుండా చూడవచ్చు. రింగ్‌రోడ్డు నిర్మించే విషయంలో ప్రజాప్రతినిధులు చొరవచూపి భూసేకరణకు అవసరమైన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదల చేయించాల్సి ఉందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**రహదారుల అనుసంధానంతో..**

ప్రధానంగా అనంతపురం, బళ్లారి, కర్నూలు, గుత్తి, ఆదోని, పామిడి రోడ్లు గుంతకల్లు గుండా వెళ్తాయి. ఈమార్గాలను కలుపుతూ పట్టణ శివారులో చుట్టూ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రధానంగా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి ఈ రోడ్ల గుండా పెద్ద సంఖ్యలో వాహనాల్లో భక్తులు వస్తుంటారు. ఇతర వాహనాలు భక్తుల వాహనాలకు అవరోధంగా మారుతున్నాయి. తరచుగా గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించే పరిస్థితులు ఉంటాయి.

భారీ వాహనాలు పట్టణం గుండా వెళ్లే సమయాల్లో ఇళ్లకు చెందిన విద్యుత్తు సర్వీసు తీగలు తెగి కిందపడటం, వాటి మరమ్మతులకు ట్రాన్స్‌కో సిబ్బంది గంటల తరబడి విద్యుత్తు సరఫరా ఆపివేస్తున్నారు. వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఎంపీ ఏమన్నారంటే?**

మొదట అధికారులు ఆదోని - కసాపురం, కసాపురం - గుత్తి రోడ్లను కలుపుతూ రింగ్‌రోడ్డు పనులను పూర్తి చేయాలని భక్తులతో పాటు పట్టణ ప్రజలు కోరుతున్నారు. వన్‌వే ట్రాఫిక్ రోడ్డు నుంచి కసాపురానికి 60 అడుగుల రోడ్డును నిర్మించడానికి మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచారు.. అయితే ఆ పనులు చేపట్టలేదు. ఈ రోడ్లను కలుపుతూ మొదట రింగ్ రోడ్డు పనులను చేపడతామని పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. రింగ్‌రోడ్డు అవసరాన్ని తాము గుర్తించామని ఆయన చెప్పడం విశేషం.

**ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి**

మాస్టర్‌ప్లాన్‌లో రింగ్‌రోడ్డు పొందుపర్చి ఏళ్లు గడిచిన విషయం వాస్తవమే. ఈ రోడ్డు అవసరం చాలా ఉంది. నిర్మాణానికి అవసరమైన భూములను సేకరించడానికి నిధుల అవసరముంది. ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూస్తున్నాం. పట్టణ శివారు గుండానే ఇతర వాహనాలను పట్టణంలోకి రాకుండా రింగ్‌రోడ్డు ఉపయోగపడుతుంది. ప్రభుత్వం నిధులు కేటాయించిన వెంటనే పనులు చేపడతాం.

అబ్దుల్ సత్తార్, పట్టణ ప్రణాళికాధికారి

# కొత్త వనరులు.. కొంగొత్త అవకాశాలు

నర్సీపట్నం : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఎన్నో అవకాశాలున్నాయి. భూమి అందుబాటులో లేకపోవడం కొంత సమస్యగా మారుతోంది. ప్రైవేటుగా భూముల విలువ ఎక్కువగా ఉండటంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లో ఆసక్తి తగ్గుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ అందుబాటులో ఉన్నాయన్న దిశగా అధికారులు దృష్టిసారించారు.

మాకవరపాలెం మండలంలో ఏపీఐఐసీ ఆధీనంలోని 310 ఎకరాల భూమిని పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. కలెక్టర్ విజయకృష్ణన్ నాలుగు రోజుల కిందట ఈ భూమిని పరిశీలించారు. తాజాగా మరో 500 ఎకరాలతో 'భూమి బ్యాంకు' ఏర్పాటు చేయనున్నారు. రాచపల్లిలో సర్వే నంబరు 737లో ప్రభుత్వ భూమిని ఇందుకోసం పరిశీలించారు. ఈ సర్వే నంబరును ఆనుకుని సుమారు రెండు కిలోమీటర్ల మేర అటవీ భూమిని సేకరించి రోడ్డు నిర్మిస్తే సమీపంలో ఎలమంచిలి వద్ద జాతీయ రహదారి, రైల్వేస్టేషన్ చేరుకునేందుకు కొత్త మార్గం అందుబాటులోకి వస్తుందని గుర్తించారు. ఈ భూములకు సమీపంలో ఏలేరు కాలువ ప్రవహిస్తోంది. పరిశ్రమల అవసరాలకు నీటికి ఇబ్బంది ఉండదు. రాచపల్లి సమీపంలోని పెద్దగెడ్డ రిజర్వాయర్ వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు.

మాకవరపాలెం మండలంలోనే భారీ కాఫీ ప్రాజెక్టు కోసం 12 ఎకరాల భూమిని గిరిజన సహకార సంస్థకు ఇవ్వాలని నిర్ణయించారు. జీసీసీ అధికారులు ఈ భూమిని పరిశీలించి కాఫీ ప్రాజెక్టుకు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే అనేకమందికి



ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇప్పటికే రాచపల్లిలో అల్యూమినియం పరిశ్రమ, విద్యుదుత్పత్తి కేంద్రం ఉన్నాయి. ఏపీఐఐసీ భూముల్లో ఆహార సంబంధ పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదన గతం నుంచి ఉంది.

జిల్లాల పునర్విభజన తర్వాత అనకాపల్లి జిల్లా పరిధిలోకి అనేక పరిశ్రములు వచ్చాయి. తాజాగా నక్కపల్లి, రాంబిల్లి క్లస్టర్లలో రూ.వేల కోట్ల విలువైన పరిశ్రమలు రానున్నాయి. ఆ బాటలోనే నర్సీపట్నం నియోజకవర్గంలోనూ అడుగులు పడుతున్నాయి. రాచపల్లి సర్వే నంబరు 737లో ప్రభుత్వ భూమిని దశాబ్దాలుగా అనేకమంది ఆక్రమించి జీడి, మామిడి, జామ తోటలు సాగు చేస్తున్నారు. భూమిలేని నిరుపేదలతోపాటు కొంతమంది అనర్హులు సైతం ఆక్రమణలో ఉన్నారు. ఈ సర్వే నంబరులో 1600 ఎకరాలకుపైగా భూమి ఉంది. దశాబ్దాల కిందటే ఇందులో 1100 ఎకరాలు అటవీ శాఖకు బదలాయింపు జరిగిందని అధికారులు చెబుతున్నారు.

# శిక్షణ సొమ్ము భక్షణ

కర్నూలు : యువతకు అండగా ఉండాల్సిన నైపుణ్యాభివృద్ధి సిబ్బంది నిధులు బొక్కేస్తున్నారు. నియోజకవర్గానికో స్కిల్ హబ్, జిల్లాకో నైపుణ్య కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు గత వైకాపా ప్రభుత్వ పెద్దలు హడావుడి చేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)లో పొరుగు సేవల పద్ధతిలో సిబ్బందిని నియమించారు. వైకాపా అనుయాయులే 'కొలువు'దీరారు. డీఎస్‌డీవోకు రూ.80 వేలు, ఇతరులకు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనాలు చెల్లిస్తున్నారు. జిల్లాకో ప్లేస్‌మెంట్ అధికారి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్లు, ఇతరులు కలిపి ఉమ్మడి జిల్లాలో 50 మందికి పైగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ, ఇంజినీరింగ్ కళాశాలల్లో మెగా ఉద్యోగ మేళాలు నిర్వహించి. వారితోనే ఏర్పాట్లు చేయించి.. ఒక్కో మేళాకు ప్రభుత్వం ఇచ్చే రూ.25 వేలు తమ ఖాతాల్లో వేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

**నైపుణ్యాభివృద్ధికి తాళం**

కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో ఏడాది కిందట రూ.70 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో నైపుణ్య కళాశాల ఏర్పాటు చేశారు. ఇక్కడ నైపుణ్యాభివృద్ధి శిక్షణలు జరగడం. అధికారులు అప్పుడప్పుడు సమావేశాలు నిర్వహించుకుంటున్నారు తప్ప ఎప్పుడు చూసినా తాళమే దర్శనమిస్తోంది.

**నియోజకవర్గానికో కేంద్రం**

ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాల్లోని స్కిల్ హబ్ కేంద్రాల్లో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, సేల్స్ టెలీకాలర్, పెయింటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇవన్నీ నిర్వాహకులు లెక్కలు రాసుకునేందుకే ఉపయోగపడుతున్నాయి. ఏటా కనీసం ఐదు వందల మంది కూడా ఉద్యోగ, ఉపాధిలో నిలదొక్కుకోవడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)ను ప్రస్తుతం నైపుణ్యాభివృద్ధి శాఖగా మార్చింది. మెగా ఉద్యోగ మేళాకు రూ.25 వేలు ఇస్తున్నారు.

**పరిశ్రమలతో ఒప్పందాలేవీ**

ఉమ్మడి కర్నూలు జిల్లా పరిశ్రమలకు కేంద్ర బిందువుగా మారుతోంది. ఆయా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వడం ద్వారా వారికి ఉపాధి కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. స్థానికంగా ఉన్న యువతకు పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలి. పరిశ్రమల యాజమాన్యాలతో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందాలు చేసుకోవడం లేదు. ఆయా పరిశ్రమలకు తగ్గట్టు శిక్షణ ఇప్పించడం లేదు. వివిధ కోర్సుల్లో సొంతంగా శిక్షణలు ఇప్పిస్తున్నారు. వివిధ కంపెనీలను రప్పించి ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నారు. వారి అవసరాలకు తగ్గట్టు యువతలో నైపుణ్యం లేకపోవడంతో ఎంపిక కాలేకపోతున్నారు.

**'ఖాళీ' కుర్చీలకు పాఠాలు**

కర్నూలు బిర్లాగేట్‌లోని సంక్షేమ భవన్ ఆవరణలో నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)-నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి (డీఎస్‌డీవో) కార్యాలయం ఉంది. ఇక్కడ అధికారి ఎప్పుడూ అందుబాటులో ఉండరు. కింది స్థాయి సిబ్బందే వచ్చినవారికి సమాధానాలు ఇస్తుంటారు. ఇదే కార్యాలయ ఆవరణలో పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి స్కిల్ హబ్ ఉంది. నిరుద్యోగ యువతకు నాక్ శిక్షణలు ఇప్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తుంటాయి.

# కూలిన గదులు.. కుదరని పనులు

కర్నూలు : ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మారుస్తామని గొప్పలు చెప్పిన వైకాపా ప్రభుత్వం..నిధులు ఇవ్వకుండా విద్యార్థులకు తిప్పలు మిగిల్చింది. ఉమ్మడి జిల్లాలో 75 పాఠశాలల భవనాలు నేలమట్టం చేశారు. పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వకపోవడంతో 2023 చివరి నాటికే అసంపూర్తిగా ఆగిపోయాయి. ఇప్పటి వరకు వాటిని మళ్లీ చేపట్టనే లేదు. 80 శాతం వరకు పూర్తయిన పనులపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. మిగతా పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. మొదటి విడత కింద ఉమ్మడి జిల్లాకు సుమారు రూ.41.6 కోట్లు కేటాయించింది. వేసవి సెలవులు ముగిసేలోగా చివరి దశ పనులు పూర్తిచేస్తే విద్యార్థులకు సౌకర్యాలు మెరుగవుతాయని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**పదండి ముందుకు బడిని బాగు చేసుకుందాం**

అక్షరాలు నేర్పిన బడి అంటే ఎవరికైనా మమకారమే.. మనం ఓ స్థాయికి చేరాక.. తిరిగి అదే పాఠశాలకు వెళ్లినప్పుడు వచ్చే ఉద్వేగాన్ని మాటల్లో చెప్పలేం.. అలాంటి విద్యాలయాలు పాడై ఉంటే గుండె తరుక్కుపోతుంది.. చదివిన బడిని బాగు చేయడంలో మనమూ ఓ



చేయి కలుపుదాం.. మనకు ఎన్నో గుర్తులు.. అనుభూతులు.. జ్ఞాపకాలు మిగిల్చిన పాఠశాలలను బాగు చేసుకుందాం. తలో చేయి వేస్తే సమస్యను పరిష్కరించడం చాలా సులువు.. ఇప్పుడు వేసవి కాలం.. బడులకు సెలవులొచ్చాయి.. తడ'బడి'న చదువులమ్మ నేలను బాగు చేయించడానికి ఇది చక్కని సమయం.. ఇంకా ఆలోచన ఎందుకు.. పదండి మన బడిని బాగు చేసుకుందాం..!!

పాఠశాలల్లో రెండో విడత కింద ఆగిపోయిన పనులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. 80 శాతం వరకు నిర్మాణాలు జరిగి ఆగిపోయిన వాటి వివరాలను సేకరించింది. వీటిని వెంటనే పునః ప్రారంభించి పూర్తి చేయాలని ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. గతంలో మాదిరిగా సిమెంటు కొనుగోలు, సరఫరాపై ఉన్న ఆదేశాలను సడలించింది. బహిరంగ విపణిలోనే సిమెంటు కొనుగోలు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని ఇటీవల ఎస్ఎస్ఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రివాల్వింగ్ ఫండ్‌తో చేపట్టనున్నారు.

**రూ.423 కోట్లు అవసరం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాడు – నేడు కింద అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి కావాలంటే రూ.423 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ఇందులో నంద్యాల జిల్లాకు రూ.180 కోట్లు, కర్నూలు జిల్లాకు 243 కోట్లు అవసరం ఉంది.

కర్నూలు జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో రెండో విడత కింద 594 పాఠశాలల్లో వివిధ పనులు చేపట్టారు. ఇందులో అరకొరగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం రూ.29.83 కోట్లు కేటాయించింది. ఇప్పటికే రూ.3.73 కోట్లను ఆయా పాఠశాలల పీడీల ఖాతాలో జమ చేశారు.

నంద్యాలలోని 973 బడుల్లో పనులు ప్రారంభించారు.రూ.11.77 కోట్లు కేటాయించగా రూ.3 కోట్లు వచ్చాయి..!!

పడగొట్టి పంపించారు

కర్నూలు బండిమెట్టలోని పొట్టిశ్రీరాములు స్మారక నగరపాలక పాఠశాలలో 279 మంది విద్యార్థుల చదువుకొంటున్నారు. ఉన్న గదులు కూలగొట్టారు.. పిల్లలను పక్కనే ఉన్న అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో సర్దుబాటు చేశారు.రూ.2.16 కోట్లు కేటాయిస్తే రూ..49.21 లక్షలు వెచ్చించారు.

**సిమెంటు ఇస్తే పనులు మొదలు**

ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 780 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. రూ.48 లక్షలు వెచ్చించి నాలుగు అదనపు తరగతి గదులు నిర్మించాలని అనుకొన్నారు. ఇప్పటి వరకు రూ.25 లక్షలు వెచ్చించారు. సిమెంట్ సరఫరా లేకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయాయి.. వాటిని చేపట్టాలంటే రూ.23 లక్షలు అవసరం..ప్రస్తుతం పాఠశాల ఖాతాలో రూ.6 లక్షలు ఉన్నాయి.

**అమ్మాయిల అవస్థ**

ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1,612 మంది విద్యార్థినులున్నారు. రూ.2.16 కోట్లతో 18 అదనపు తరగతి గదుల నిర్మాణానికి పునాది వేశారు. నాలుగు గదులు రూఫ్ లెవల్ వరకు పూర్తవగా.. మరో రెండు గదులు పునాదులకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం రూఫ్ లెవల్‌లో ఆగిపోయిన నాలుగు అదనపు గదుల నిర్మాణాలు పూర్తిచేస్తే విద్యార్థినులకు సౌకర్యంగా ఉంటుంది. ఇందు కోసం సుమారు రూ.10 లక్షలు మంజూరు చేస్తే నాలుగు తరగతి గదులు వినియోగంలోకి తీసుకురావచ్చు.

మంజూరైన అదనపు గదులు: 1986

తుది దశలో ఆగినవి: 587

పైకప్పు దశలో ఉన్నవి : 489

యూనిట్ లెవల్‌లో నిలిచినవి : 48

బేస్‌మెంట్ దశలో ఉన్నవి : 59

పూర్తయిన నిర్మాణాలు : 198

పనులు మొదలే కానివి: 32

# విరబూసి.. నష్టాలు మిగిల్చి..!

కుప్పం : శాంతిపురం మండలం దండికుప్పంకు చెందిన శీనప్ప రెండెకరాల్లో చెండు మల్లి సాగుకు రూ. లక్ష ఖర్చు చేశాడు. కోతకు వచ్చే సమయానికి ధరలు పడిపోయాయి. పూలను తోటలోనే ఎండబెట్టాల్సిన దుస్థితి. విరబూసిన పొలంలోనే వాడిపోతున్న పూలను చూసి శీనప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. అంతకు ముందు రూ.50 వేల పెట్టుబడితో పండించిన కర్బూజా పంటకు కూడా గిట్టుబాటు ధర లేక నష్టపోయినట్లు కంటనీరు పెట్టుకొన్నారు. తోటల్లోనే ఎందుకు.. కుప్పం, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో ఉద్యాన రైతులు వందలాది ఎకరాల్లో బంతి పూలు సాగు చేశారు. అప్పుల చేసి.. నీటి ఎద్దడిని అధిగమించి పండించిన పూలకు గిట్టుబాటు ధరలు కొరవడటంతో తీవ్రంగా నష్టపోయారు. చాలా చోట్ల తోటల్లోనే వదిలిపెట్టడంతో ఎండిపోతున్నాయి. కొన్ని చోట్ల పశువులకు ఆహారంగా మారాయి.

**శుభకార్యాలు లేక**ప్రస్తుతం పండుగలు, శుభకార్యాలు లేనందున విపణిలో పూలకు డిమాండు గణనీయంగా తగ్గింది. ముఖ్యంగా పూజలు, అలంకరణలకు వినియోగించే బంతి, చెండుమల్లి వినియోగం తగ్గింది.

# ఉద్రిక్తతల వేళ.. అంతటా అప్రమత్తం!



విశాఖపట్నం : పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తలు పెరిగాయి. ఈ నేపథ్యంలో యుద్ధం జరిగితే పౌరులు ఏ విధంగా స్పందించాలనే అంశంపై 'మాక్ డ్రిల్' నిర్వహించాలని కేంద్ర హోంశాఖ రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేసింది. తెలుగు రాష్ట్రాల్లో కేటగిరి-2లో ఉన్న విశాఖలో బుధవారం సివిల్ డిఫెన్స్ ఆధ్వర్యంలో రెండు చోట్ల మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. సైరన్లు మోగించినప్పుడు, దాడుల సమయంలో ఎలా స్పందించాలో అవగాహన కల్పించనున్నారు.

**విశాఖపైనే దృష్టి ఎందుకంటే..**

యుద్ధం వస్తే చాలా అప్రమత్తంగా ఉండాల్సిన ప్రాంతాల్లో విశాఖ ఒకటి. ఎందుకంటే... తూర్పునౌకాదళ ప్రధాన స్థావరం విశాఖలోనే ఉంది. డీఆర్‌డీవో పరిధిలోని ఎన్ఎస్‌టీఎల్ (నేవల్ ప్రయోగశాల), జెట్ ఫైటర్లు, మిగ్-29కేలకు శిక్షణ ఇచ్చే ఐఎన్ఎస్ డేగ, మెరైన్ కమెండోలకు శిక్షణ ఇచ్చే ఐఎన్ఎస్ కర్ణ, సబ్‌మెరైన్‌లో పనిచేసేవారికి శిక్షణ ఇచ్చే ఐఎన్ఎస్ శాతవాహన ఇక్కడే ఉన్నాయి.

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్), యుద్ధ నౌకల నిర్మాణం, పాతవాటికి కొత్త జవసత్వాలిచ్చే హిందూస్థాన్ షిప్ యార్డు ఉన్నాయి. ముంబై తర్వాత ఎక్కువ సామర్థ్యం ఉన్న హెచ్‌పీసీఎల్‌కు సంబంధించిన భారీ రిఫైనరీ విశాఖలో ఉంది. డాల్ఫిన్‌నోస్ వద్ద వ్యూహాత్మక ముడి చమురు నిల్వల కేంద్రం పూర్తి రక్షిత ప్రదేశంలో భూగర్భంలో ఉంటుంది. దేశంలో 15 రోజుల అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలను భూగర్భంలో భద్రపరిచారు. అక్కడ 24 గంటలూ సాయుధ బలగాల పహారా ఉంటుంది.దేశంలో మేజర్ పోర్టుల్లో ఒకటైన విశాఖ పోర్టు అథార్టీ ఇక్కడే ఉంది. వాణిజ్య పరంగా, వ్యూహాత్మకంగా ఈ సహజ నౌకాశ్రయం ఎంతో కీలకం. దగ్గరిలోనే గంగవరం పోర్టు ఉంది. విశాఖ స్టీలు ప్లాంటు, భారీ ఫార్మా కంపెనీలు ఉన్నాయి.

**54 ఏళ్ల తర్వాత మళ్లీ..**

పూర్తిస్థాయి యుద్ధ సన్నాహాలు సాగినప్పుడే భారత్ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు గత పరిణామాలను విశ్లేషిస్తే 1971లో ఇండియా-పాక్ మధ్య యుద్ధం సమయంలో విశాఖ ఓల్డ్‌టౌన్ ప్రాంతంలో ఓ స్కూలు ఆవరణలో బాంబులు పడ్డాయని నాటి ఘటనలను వృద్ధులు వివరిస్తున్నారు. రెండు వారాలపైగా దీపం వెలిగించకుండా కారుచీకటిలో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బతికామన్నారు. విశాఖ సమీపంలో ఐఎన్ఎస్ విక్రాంత్ నౌక ఉన్నట్లు తెలిసి పాకిస్థాన్ సబ్‌మెరైన్ పీఎన్ఎస్ ఘాజీ భారత జలాల్లోకి ప్రవేశించగా, ఐఎన్ఎస్ రాజ్‌పుత్ సమర్థంగా ఎదుర్కొని ఘాజీని పేల్చివేసింది. అందుకే ఏటా డిసెంబరు 4న తూర్పు తీరంలో నేవీ డే వేడుకలు నిర్వహిస్తారు.

మాక్ డ్రిల్‌లో ఏం చేస్తారంటే: యుద్ధ సైరన్ మోగగానే ఎలా అప్రమత్తంగా ఉండాలో అవగాహన కల్పిస్తారు. రాత్రి సమయంలో శత్రువులకు చిన్న కాంతి కూడా కనిపించకుండా ఇల్లు, కార్యాలయాల్లో దీపాలు, కాంతి వచ్చే అన్నింటిని ఆర్పి చీకటిమయం చేయాలి. అద్దాల కిటికీలు, తలుపులు కర్టెన్లతో కప్పేయాలి. గాయపడిన పౌరులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించడం, అగ్ని కీలలు వ్యాపిస్తే ఆర్పివేయడం, ప్రథమ చికిత్సతోపాటు, ఆసుపత్రులకు స్వయంగా బాధితులను తీసుకెళ్లేలా అప్రమత్తం చేయడంపై చైతన్యం కల్పిస్తారు. ఇప్పటికే శిక్షణ పొందిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, వివిధ స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులను ఇందులో పాల్గొనేలా చేస్తారు. భయంతో గుండె సమస్యలు తలెత్తినప్పుడు సీపీఆర్ చేయడం, ఆందోళనలతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా చూడటం, అగ్నిమాపక యంత్రాలు సిద్ధంగా ఉంచడంపై శిక్షణ ఇస్తారు.

**భారత్ సమర్థంగా ఎదుర్కొంటుంది..**

భారత్ సైనిక సామర్థ్యం బాగా పెరిగింది. పాకిస్థాన్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా భారత్ సమర్థంగా ఎదుర్కొంటుంది. ఏ యుద్ధమైనా రెండు వైపులా ఎంతోకొంత నష్టపోతారు. భారత్‌కు ఎన్నో దేశాలు మద్దతిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా నెలకొన్న పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్‌లో వేర్పాటు వాదం ఊపందుకుంది. కొన్ని ప్రాంతాలు పాకిస్థాన్ నుంచి విడిపోవడానికి ఎదురుచూస్తున్నాయి.

జగన్ మోహనరావు, విశ్రాంత వింగ్ కమాండర్, భారత వాయుసేన

# సొంత లెక్కలు.. పనులు ముక్కలు



అనకాపల్లి : జిల్లా పరిషత్తు నిధులతో చేపట్టే పనులను అయినవారికి అప్పగించేందుకు జడ్పీ సభ్యులు, అధికారులు తాపత్రయ పడుతున్నారు. అంచనా విలువలను పూర్తిస్థాయిలో చూపకుండా ఒకే పనిని ముక్కలు ముక్కలుగా విభజించి నామినేషన్ పద్ధతిలో తమవారికి కట్టబెడుతున్నారు. టెండర్లు పిలిస్తే గుత్తేదారులు ఎవరూ రావడం లేదంటూ.. అందుకే ఇలా చేయాల్సి వస్తుందని అధికారులు సమర్థించుకుంటున్నా వారి వెనుక జడ్పీ నేతల ఒత్తిళ్లు ఉన్నట్లు తెలుస్తోంది.

సాధారణంగా రూ. 5 లక్షల లోపు అంచనా విలువున్న పనులను నామినేషన్ పద్ధతిలో అప్పగిస్తారు. ఆపై దాటిన పనులకు తప్పకుండా టెండర్లు పిలవాలి. ఒకటి, రెండుసార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారుల నుంచి కనీస స్పందన రాకుంటే ఆయా పనులను ఉన్నతాధికారుల ఆమోదంతో నామినేషన్ పద్ధతిలో కేటాయించాలి. కాని జిల్లా పరిషత్తులో అంతా ఇష్టారాజ్యంగా సాగుతోంది. అసలు టెండర్ల జోలికే పోకుండా ముందుగానే పనులను రూ. 5 లక్షల లోపు ఉండేలా అంచనా విలువలు నిర్ణయిస్తున్నారు. జడ్పీ అతిథిగృహాల మరమ్మతుల మొదలుకొని సీసీ రోడ్లు, కొన్ని శాఖల కార్యాలయాల్లో వసతుల కల్పన వరకు ఒకే పనిని నాలుగు నుంచి పది వర్కులుగా చూపించి నామినేషన్‌లో అప్పగిస్తుండటంపై ఆరోపణలు వస్తున్నాయి.

**అతిథి గృహం.. 10 ముక్కలు..**

జిల్లా పరిషత్తు ఆవరణలోని అతిథిగృహానికి సుమారు రూ.40 లక్షలతో మరమ్మతులు చేపడుతున్నారు. మరి అంత విలువతో పనిచేస్తే టెండర్ పిలవాలి కదా. కాని అలాంటిదేమీ చేయకుండా చక్కగా రూ. 40 లక్షల పనిని 10 వర్కులుగా విభజించి నామినేషన్ పద్ధతిలో ఓ గుత్తేదారుకి అప్పగించారు. అతిథి గృహం స్లాబ్ తొలగించడం, గదుల వారీగా పునరుద్ధరణ పనులకు అంచనా విలువలు కట్టడం గమనార్హం. ఛైర్‌పర్సన్ బంగ్లాలో మరో రెండు పనులు, సమావేశ మందిరం, అతిథిగృహానికి ఎయిర్ కండిషనర్ల ఏర్పాటుకు వేరుగా అంచనాలు తయారుచేసి అప్పగించారు.

మాడుగుల మండలం ఉరకగెడ్డ వద్ద రక్షణ గోడ, క్రాస్ చెక్‌వాల్ పేరిట గతంలో మంజూరు చేసిన పనులను రద్దుచేసి వాటి బదులు అతిథిగృహానికి మరమ్మతులు చేస్తున్నారు.

దేవరాపల్లి మండలం నర్సింగి పంచాయతీలో శ్మశానవాటిక నుంచి దువ్వారి కల్లాల వరకు సీసీ రోడ్డు నిర్మాణాన్ని అయిదు పనులుగా విభజించారు. ఒక్కో పని రూ. 4.98 లక్షలు అంచనా విలువ ఉండేలా చేసే నామినేషన్‌లో అప్పగించారు.

జిల్లా పరిషత్తు ఆవరణలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సంఘం భవనానికి రూ. 5 లక్షలు కేటాయించారు. ఆ సంఘానికి గతంలోనే స్థలం ఇచ్చి భవన నిర్మాణానికి సహకారం అందించారు. గ్రౌండ్ ఫ్లోర్‌ను ఓ ఆసుపత్రి ల్యాబ్‌కు అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారు. మళ్లీ వారికి జడ్పీ నిధులు కేటాయించడంపై స్థానిక ఉద్యోగుల నుంచే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పాడేరు ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో మౌలిక వసతుల పనులను రూ. 20 లక్షలతో ఆమోదించారు. వీటిని కూడా నాలుగు పనులుగా విభజించి నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారు.

పనులు చేస్తుండగా పెరిగాయి

అతిథి గృహం పనులు మొదట తక్కువ మొత్తంలోనే అవుతాయనుకున్నారు. పనిలోకి దిగాక ఒక్కోటి పెరుగుతూ వస్తుండటంతో అంచనా విలువలు పెంచాల్సి వచ్చింది. బిల్లులు సక్రమంగా అందడం లేదని టెండర్లు పిలిచినా గుత్తేదారులు రావడం లేదు. అందుకే నామినేషన్ మీద ఇవ్వాల్సి వస్తుంది. ఇందులో మరో ఉద్దేశమేం లేదు. గతంలో మంజూరు చేసిన పనుల్లో అవసరం లేనివాటిని సమీక్షించి రద్దు చేస్తున్నాం.

నారాయణమూర్తి, జిల్లా పరిషత్తు ముఖ్య కార్యనిర్వహణాధికారి

# ఈనెలా కందిపప్పు లేనట్టే!

బుచ్చెయ్యపేట : జిల్లాలోని రేషన్ లబ్ధిదారులకు మూడు నెలలుగా కందిపప్పు సరఫరా చేయడం లేదు. బియ్యం, పంచదారతో సరిపెడుతున్నారు. మేలో కందిపప్పు, రాగులు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో లబ్ధిదారులు ఆశగా ఎదురుచూశారు. తీరా పంచదార, బియ్యం మాత్రమే పంపిణీ చేస్తుండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 5,37,038 మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెల గతంలో 7652 మెట్రిక్ టన్నుల బియ్యం, 264 మెట్రిక్ టన్నుల పంచదార, 546 మెట్రిక్ టన్నుల కందిపప్పు, 544 మెట్రిక్ టన్నుల గోధుమపిండి, 1628 మెట్రిక్ టన్నుల రాగులు పంపిణీ చేసేవారు. మూడు నెలలుగా బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. అయిదు నెలల నుంచి రాగులు, గోధుమ పిండి ఊసేలేదు. పౌరసఫరాల వ్యవస్థను గాడిలో పెట్టి పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు సరకులు అందించడం కూటమి ప్రభుత్వానికి పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుతం కార్డుదారులకు 258.4 మెట్రిక్ టన్నుల పంచదార, 7836.63 మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తున్నారు. నిత్యావసర సరకుల్లో కందిపప్పు పంపిణీ చేయకపోవడంతో కార్డుదారులు మండిపడుతున్నారు. రేషన్ వాహనాల ద్వారా కేజీ కందిపప్పు రూ. 67కు లబ్ధిదారులకు అందించేవారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ. 120 వరకు పలుకుతోంది.

టెండర్లు పూర్తికాలేదు: పంచదార, కందిపప్పు పూర్తిస్థాయిలో కార్డుదారులకు సరఫరా చేస్తున్నాం. డిసెంబరు, జనవరి నెలలో కార్డుదారులకు కందిపప్పు అందించాం. టెండర్లు ప్రక్రియ పూర్తికాక కందిపప్పు సరఫరా జరగలేదు. మూర్తి, డీఎస్‌వోడిపోలు: 1063జిల్లాలో కార్డుదారులు: 5,37,038

బియ్యం:7836.063 మెట్రిక్ టన్నులు

పంచదార 258.485 మెట్రిక్ టన్నులు

# మట్టికుండలకు మంచిరోజులు

బద్వేలు : వేసవి ఎండలు మండుతుండడంతో చల్లని తాగునీటి కోసం జనం మట్టికుండలను వాడుతున్నారు. ప్రతి ఇంటా ఫ్రిజ్‌లు ఉన్నప్పటికి ఆరోగ్య రీత్యా మట్టికుం డలు మేలంటూ జనం ఆ దిశగా ముందుకె ళు తున్నారు. మట్టికుండ.. ఒకప్పుడు లేని ఇళ్లు ఉం డేది కాదంటే అతిశయోక్తికాదు. నీరు పట్టుకో వడానికి.. నీటిని నిల్వ ఉంచడానికి.. వంటలకు.. ఇలా అన్ని అవసరాలకు వాటిని వినియోగించే వారు. వంట పాత్రలను కూడా మట్టిపా త్రలనే వాడేవారు. కాలక్రమేణ వాటి ఉప యోగం తగ్గుతూ వచ్చింది. అయితే ఇటీ వల కాలంలో ప్రజలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాలే కాకుం డా పట్టణ ప్రాంతాల వారు సైతం మట్టికుండలను తాగునీటి కోసం వాడు తుండడంతో వాటి వినియోగం పెరిగి మట్టికుండలకు మంచిరోజులు వచ్చాయని పేర్కొంటున్నారు. మట్టికుండల్లో నీరు తాగి తే ఎంతో మేలు చేకూ రుతుందని వైద్యనిపుణులు పేర్కొంటుండడం ఇందు కు ప్రధాన



కారణంగా నిలు స్తోంది. గొంతునొప్పి, జలు బు ఇతరత్రా వ్యాధులను నివారించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. చిన్న పట్ట ణాలతోపాటు పెద్ద పెద్ద నగరాల్లో కూడా మట్టికుండలు, కూ జాల విక్రయాలు పెరుగుతున్నాయి. ప్రస్తుత అవసరాలు, మా ర్పులకు తగ్గట్టుగా మట్టికుం డలకు నీటి కొళాయిలు బిగించి విక్రయిస్తుండడం గమనార్హం. ఒక్కొక్క కుండలో 10, 20, 30 లీటర్ల నీటి సామర్థ్యంతో ఉంటాయి. మట్టికుండలు రూ.200 నుంచి రూ.500 వరకు మార్కెట్లో ధరలు పలు కుతున్నాయి. అలాగే ఆలయ నిర్మాణంలోని విగ్రహ ప్రతిష్ఠకు ముంతలను అధికంగా విని యోగిస్తుండటంతో మట్టికుండలకు గిరికీ అద రోహో అనిపిస్తోంది.

# జలఘోష తప్పేనా..?

భీమవరం : కూటమి ప్రభుత్వంలో పంట కాలువలకు ప్రాధాన్యం ఇస్తారని అంతా భావించారు. అందుకు తగ్గట్టుగానే జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపించారు. అయితే నిధులు లేమి ఉందంటూ ఆర్థిక శాఖ అనేక మెలికలు పెడుతోంది. ఇప్పుడదే పశ్చిమ డెల్టా రైతులకు శాపంగా మారుతోంది. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కృషితోఈ ఏడాదైనా జలఘోష తప్పేనా అని రైతులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

పంట కాలువల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. వేసవిలో కాల్వలు, డ్రెయిన్‌లకు మరమ్మతు పనులు చేపట్టాలి. ప్రభుత్వానికి ఏనాడో ప్రతిపాదనలు పంపారు. పశ్చిమ డెల్టా పరిధిలో వేసవి మరమ్మతులకు రూ.40 కోట్లు అవసరమని అంచనా వేశారు. ప్రణాళికలు రూపొందించారు. నీటి సంఘాలు ఏర్పడడంతో రైతుల్లోనూ ఆశలు చిగురించాయి. కాలువలు ప్రక్షాళన జరుగుతుందని ఆకాంక్షించారు. ఈ ఏడాది రైతుల ఆశలు తల్లకిందులయ్యే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లా జలవనరుల శాఖ అధికారులు పంపిన ప్రతిపాదనలు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అక్కడ క్లియరెన్స్ అయితేనే నిధులు మంజూరవుతాయి. ఒక దశలో ప్రతిపాదనలను ఆర్థిక శాఖ తిరస్కరించింది. ప్రతిపాదనల విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి ఆమోదం పొందేలా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పనుల నిర్వహణకు కాలాతీతమైంది. ఈ ఏడాది ఎండలు అధికంగా ఉన్నాయి. వాతావరణ శాఖ ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. అదే జరిగితే మంచినీటి చెరువుల్లో నీరు అడుగంటిపోనుంది. జూన్ మొదటి వారంలోనే మళ్లీ కాలువలకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ఇటువంటి లెక్కలు వేసుకుని జలవనరుల శాఖ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. నెల రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఆలోగా కాలువలు, డ్రెయిన్‌లలో పూడిక తీయాలి. గుర్రపుడెక్క, తూడు, కర్రనాచు తొలగించాలి. గట్లు బలహీనంగా ఉన్నచోట పటిష్టం చేయాలి. లేదంటే గండ్లు పడి పంట పొలాలు ముంపుబారిన పడే ప్రమాదం ఉంది. గడచిన ఖరీఫ్‌లో గండ్లతో అధిక నష్టం వాటిల్లింది. మరోవైపు డ్రెయిన్‌లు ఎగదన్ని పంట పొలాలు ముంపుబారిన పడ్డాయి. వేసవిలో పనులు చేపడితే ముంపు నుంచి గట్టెక్కవచ్చని అంతా అభిప్రాయపడ్డారు.

**నీటి సంఘాల్లోనూ నిరుత్సాహం**

వేసవి పనులు చేపట్టడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫల మైంది. ఆ ప్రభావం రైతులపై పడుతోంది. రెండు రోజులపాటు వర్షాలు కురిస్తే పొలాలు నీట మునుగుతున్నాయి. నారుమళ్లు దెబ్బతింటున్నాయి. లేదంటే నాట్లు కుళ్లిపోతున్నాయి. గడచిన ఖరీఫ్‌లో రైతులు ఇలాంటి ఇబ్బందులే పడ్డారు, రెండు పర్యాయాలు పంటకు నష్టం వాటిల్లింది. డ్రెయిన్‌లు, కాలువలు పూడుకుపోవడంతో కొద్దిపాటి వర్షాలకు డ్రెయిన్‌లు ఎగదన్నుతున్నాయి. జలవనరుల శాఖ ఈ విషయాన్ని గుర్తించింది. పనులు చేపట్టాలని ముందుగానే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. పశ్చిమ డెల్టా పరిధిలో కాలువలు, డ్రెయిన్‌ల మరమ్మత్తుల కోసం రూ.40 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నీటి సంఘాలను ఏర్పాటు చేయడంతో రైతుల్లోనూ ఉత్సాహం నెలకొంది. నీటి సంఘాల ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. కాలువులు, డ్రెయిన్‌లలో సమస్యలను గుర్తించారు. అధికారులకు వివరాలు సమర్పించారు. పనుల అవసరాన్ని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ స్థాయిలో ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉండడంతో నీటి సంఘాల్లోనూ నిరుత్సాహం నెలకొంది.

**నెల రోజులే గడువు** వేసవిలో పనులు చేపట్టడానికి నెల రోజులు మాత్రమే గడువు ఉంది. జూన్ మొదటివారంలో కాలువలకు నీటిని విడుదల చేయనున్నారు. వేసవి పనులకు మే నెల కీలకం. ప్రభుత్వ స్థాయిలో నిధులు మంజూరు చేస్తే పనులు కేటాయిస్తారు. నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. వాస్తవానికి రూ.10 లక్షలపైన పనులు అయితే టెండర్‌లు పిలవాలి. లేదంటే నీటి సంఘాల ద్వారా నామినేషన్ పద్ధతిలో చేస్తారు. ప్రస్తుతం నిధులు మంజూరు చేసినా సరే టెండర్‌లు పిలిచే అవకాశం లేదు. అంత సమయం లేదు. స్వల్పకాలిక టెండర్లు పిలిచినా వారం రోజుల సమయం పడుతుంది. అయినా సరే టెండర్లు ఖరారవుతాయన్న భరోసా లేదు. కాంట్రాక్టర్‌లకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో జలవనరుల శాఖ పనులుంటేనే హడలి పోడుతున్నారు. దీంతో నీటి సంఘాల ద్వారానే పనులు చేయించాలని అధికారులు యోచిస్తున్నారు. ఈసారి నామినేషన్‌లోనే పనులు చేపడితే వేగవంతంగా పూర్తవుతాయన్న నమ్మకంతో అధికారులు వేచి చూస్తున్నారు.

# ప్రభుత్వానికి అప్పగించిన భూముల్లో ఆక్రమణలు

బుచ్చెయ్యపేట : అర్.భీమవరం రెవెన్యూ పరిధిలో ఆక్రమణ దారులకు అడ్డూఅపు ఉండటం లేదు. ప్రభుత్వానికి అప్పగించిన డి.పట్టా భూముల్లో పాకలు వేసి హస్తగతం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. సుమారు 30 ఎకరాల డి.పట్టా భూములను గాజువాకకు చెందిన పారిశ్రామికవేత్త కడియాల రాజేశ్వరరావు గత నెలలో ప్రభుత్వానికి అప్పగించిన సంగతి తెలిసిందే. వీటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ నుంచి బుచ్చెయ్యపేట తహసీల్దారుకు ఆదేశాలొచ్చాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టాదారులకు 15 రోజుల గడువుతో నోటీసులు ఇచ్చి వారు పీఓటీ యాక్టు నిబంధనలు ఉల్లంఘించినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. డి.పట్టాలను రద్దు చేసి వాటిని ప్రభుత్వ స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దారు లక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే చాలా వరకు ప్రభుత్వ భూములను



తమ గుప్పెట్లో పెట్టుకుని అనుభవిస్తున్న గ్రామానికి చెందిన కొంతమంది నాయకులకు ఇది రుచించలేదు. అధికారులు స్వాధీనం చేసుకున్న డి.పట్టా భూములనూ సొంతం చేసుకునేందుకు వ్యూహాలు పన్నుతున్నారు. ఇందులో భాగంగా రాత్రికి రాత్రే డి.పట్టా భూముల్లో పాకలు వేయించారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించి ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. 'గతంలో ఐదుగురి పేరిట సుమారు 30 ఎకరాల భూములను డి.పట్టాలుగా ఇచ్చాం. పీఓటీ యాక్టు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలడంతో పట్టాలను రద్దు చేశా'మని తహసీల్దారు లక్ష్మి పేర్కొన్నారు.

# భూచోళ్లు!

నరసాపురం : 'భూమి నా కళ్ల ముందే వుంది. దీని డాక్యుమెంట్లు మా ఇంటి బీరువా లాకర్‌లో భద్రంగానే ఉన్నాయి' అని ధీమాగా ఉన్నారా ? అయితే మీరు పొరబడినట్లే..! మీకు తెలియకుండా మీ భూమిని.. మీ డాక్యుమెంట్ల జిరాక్స్ కాపీలతో లీజుకు తీసుకున్నట్లు అగ్రిమెంట్లు సృష్టించే మహా మాయగాళ్లు మీ చుట్టూనే ఉన్నారు. కాబట్టి రైతులందరూ తస్మాత్ జాగ్రత్త. ఒకసారి మీ భూమిపై ఏమైనా బ్యాంకుల్లో రుణాలు ఉన్నాయేమో తెలుసుకోండి. ఎందుకంటే నిన్న నరసాపురంలో భూ యజమానికి తెలియకుండా.. భూములకు లీజు అగ్రిమెంట్ సృష్టించి నాలుగు కోట్లు రుణం తీసుకున్నారు.

రెండేళ్ల క్రితం కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన ఓ రైతు రుణం కోసం బ్యాంకుకు వెళ్లాడు. సర్వే నెంబర్లను కంప్యూటర్‌లో పరిశీలించిన అధికారులు భూమిపై రుణం ఉందని చెప్పడంతో ఆ రైతు షాక్ తిన్నాడు. వెంటనే పరిసర ప్రాంతాల రైతులు తమ భూములను ఎవరైనా బ్యాంకుల్లో పెట్టి రుణం తీసుకున్నారేమోనన్న భయంతో చెక్ చేసుకున్నారు. చూస్తే వంద ఎకరాలకుపైగా రైతులకు తెలియకుండా లీజు చేస్తున్నట్లు చూపించి, కొందరు కేటుగాళ్లు బ్యాంకుల్లో పెట్టి రుణం కొట్టేశారు. పోలీసులు విచారించగా.. ఈ మోసం వెనుక జిల్లాలో ఓ ముఖ్య వ్యక్తి పాత్ర ఉన్నట్లు తేలింది.అదే ఏడాది మొగల్తూరుకు చెందిన కొందరు రైతులకు రుణం కట్టాలంటూ బ్యాంకుల నుంచి నోటీసులు వచ్చాయి. తాము తీసుకోని రుణానికి డబ్బులు చెల్లించడమే మిటని రైతులు షాక్ తిన్నారు. విచారిస్తే.. మొగల్తూరు, కాళీపట్నంకు చెందిన రైతుల భూములను వారికి తెలియకుండా లీజు డాక్యుమెంట్లు సృష్టించి గణపవరం బ్యాంకులో రుణం తీసుకున్నారు. చివరికి ఈ కేసును సీబీసీఐడీ విచారణలో ఇంకా కొనసాగుతూనే వుంది. నరసాపురం సెంట్రల్ బ్యాంకులోను ఇదే తరహా మోసం తాజాగా వెలుగు చూసింది. అయితే ఇక్కడ రుణం తీసుకున్న వ్యక్తికి లీజు గురించి తెలియదు. తన ఆస్తులను తాకట్టు పెట్టి లోన్ తీసుకున్నాడు. ఇందులో కీలకపాత్ర పోషించింది పట్టణానికి చెందిన ఒక బ్రోకర్ అని తేలింది. కేవలం తక్కువ వడ్డీకి రుణం దక్కుతుందని ఆశ పడి బ్రోకర్ చెప్పిన మాట నమ్మడం వల్ల అల్లరిపాలు కావాల్సి వచ్చింది.

**నేడు ఊరూరా బ్రోకర్లు**

గతంలో పెళ్లిళ్లు... రియల్ ఎస్టేట్ రంగాల్లోనే బ్రోకర్లను చూసేవాళ్లం. నేడు ప్రజల అవసరాలను గుర్తించి కొందరు కేటుగాళ్లు బ్యాంకు బ్రోకర్ల అవతారం ఎత్తారు. బహిరంగంగానే కన్సల్టెంట్స్ బోర్డులు పెట్టుకుని బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తామని అమాయక ప్రజలను ఊబిలోకి దించుతున్నారు. కొందరు బ్యాంకు మేనేజర్లను మచ్చిక చేసుకుని వారి ద్వారా లక్షలు, కోట్ల రూపాయల రుణాన్ని ఇప్పిస్తున్నారు. ఇందులో కొందరు నిజాయితీగా చేస్తుంటే.. మరికొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. కేవలం 'మీ ఆస్తుల్ని తాకట్టు పెట్టండి.. మీకు ఇంత పెద్ద మొత్తంలో రుణం ఇప్పిస్తా'మని బురిడీ కొట్టిస్తున్నారు. రుణం సక్రమంగా చెల్లిస్తే.. అంతా ఓకే. లేకపోతే అందులోని లోపాలు బయటకు పొక్కి అల్లరిపాలు కావాల్సిందే. ఇటు రైతులకు తెలిసినా... సీన్ రివర్స్ అవుతుంది.

**ఆ వివరాలు ఎలా తెలుస్తున్నాయి ?**

రైతులు చెరువులు తవ్వే సమయంలో భూములకు సంబంధించిన దస్తావేజులను జిరాక్స్ తీసి వీఆర్వో ద్వారా మత్స్యశాఖకు అందిస్తుంటారు. లేదా కొన్ని సమయాల్లో దస్తావేజుల నకళ్లను వీఆర్వో, మీసేవలకు ఇస్తుంటారు. కొందరు రుణం ఇప్పిస్తామని రైతుల నుంచి జిరాక్స్ కాపీలను తీసుకుంటారు. ఇదే సమయంలో ఆధార్‌కార్డు, పాస్‌బుక్ జిరాక్స్‌లను నకలు కాపీలు ఇవ్వడం సర్వ సాధారణం. ఇచ్చింది జిరాక్స్ కాపీలేనన్న ధీమాతో చాలా మంది పట్టించుకోవడం లేదు. ఇక్కడే మోసానికి తెరలేస్తోంది. కేటుగాళ్లు వీటిని సంపాధించి రుణం లీజు అగ్రిమెంట్లు సృష్టిస్తున్నారు. బ్యాంకుల్లో వెలుగు చూస్తున్న మోసాలన్నీ ఇలా బయటకు వచ్చినవే.

**తస్మాత్ జాగ్రత్త..**

భూమే కదా ఎక్కడికి పోతుంది ? ఓరిజనల్ డాక్యుమెంట్స్ అన్నీ బీరువాలోనో, సొసైటీలోనో ఉన్నా యి కదా అన్న ధీమాతో ఉంటే ప్రస్తుత పరిస్థితుల్లో బోల్తా కొట్టినట్లే! ఇళ్లు, పొలాల దస్తావేజులను బ్యాంకు లో పెట్టి రుణం తీసుకోకపోతే వాటిని తరచూ చెక్ చేసుకోవాలి. లేకుంటే కేటుగాళ్లు మనకు తెలియ కుం డానే వాటిని బ్యాంకుల్లో పెట్టి రుణం కొట్టేస్తున్నారు.

**కొనసాగుతున్న విచారణ**నరసాపురం సెంట్రల్ బ్యాంకులో వెలుగుచూసిన రూ.4 కోట్ల స్కామ్ తీరప్రాంత రైతులనే కాదు. జిల్లాలోని అందరినీ ఉలికిపాటుకు గురిచేసింది. రుణం తీసుకున్న కూనపరెడ్డి ప్రసాద్, దుడే చంద్రశేఖర్ ఇద్దరూ వారి ఆస్తుల డాక్యుమెంట్లను బ్యాంకులో తాకట్టు పెట్టారు. అయితే వీరికి లోన్ ఇప్పించిన బ్రో కర్ మాత్రం ఆక్వా సాగు రుణం తీసుకుంటే తక్కువ వడ్డీ పడుతుందని వీరిని మభ్యపెట్టాడు. పొలాలు లేకపోయినా.. వీరి పేరున లీజు అగ్రిమెంట్లు సృష్టించి కోట్ల రుణం ఇప్పించాడు. ఇందుకు పెద్ద ఎత్తున కమీషన్లు దండుకున్నారన్న వాదనలు లేకపోలేదు. ఇందులో బ్యాంకు అధికారుల పాత్రపైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రకృతి వినాశనం.. తప్పదు మూల్యం



రాయదుర్గం : : ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసుతో అనంతపురం జిల్లా దేశస్థాయిలో సంచలనంగా మారింది. 2004-09 మధ్యలో అప్పటి పాలకుల అండతో గాలి జనార్దన్‌రెడ్డి సాగించిన మైనింగ్ దందా బయటకు రావడంతో ప్రధాన దర్యాప్తు సంస్థతో పాటు మీడియా దృష్టి జిల్లాపై పడింది. 2009లో కేసు నమోదు నుంచి 2011లో ఛార్జిషీటు దాఖలు చేసే వరకు సీబీఐ అధికారులు అనంతపురం, రాయదుర్గం, డి.హీరేహాళ్ ప్రాంతాల్లో పర్యటించారు. కలెక్టరేట్‌తో పాటు మైనింగ్ కార్యాలయాల్లో పలు దస్త్రాలను పరిశీలించి కాపీలను వెంట తీసుకెళ్లారు. మైనింగ్ జరిగిన ప్రాంతం రిజర్వు ఫారెస్టులో ఉండటంతో కేంద్ర అటవీశాఖ అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ సమయంలో ఫారెస్టు అధికారిపై దాడి జర్గగా పోలీసులు కేసు నమోదు చేశారు. సింగరేణి కాలరీస్ మైన్స్ జనరల్ మేనేజర్, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ రెండు బృందాలు గా క్షేత్రస్థాయిలో పరిశీలించి సీబీఐకు నివేదిక అందించారు. విచారణ సమయంలో రోజుకో అక్రమం బయటకు వచ్చేంతవరకు జిల్లా వాసులకు తమ ప్రాంతంలో ఈ స్థాయిలో అవినీతి జరిగిందనే విషయం తెలియరాలేదు.

**అసలేం జరిగింది?**

బళ్లారికి చెందిన గాలి జనార్దన్‌రెడ్డి ఓబుళాపురం మైనింగ్ కంపెనీ పేరుతో ఓబుళాపురం పరిధిలోని భూములను లీజుకు తీసుకున్నారు. తనకు కేటాయించిన భూమిలో కాకుండా ఇతర ప్రాంతాల్లో అక్రమంగా ఖనిజం తవ్వేసి సొమ్ము చేసుకున్నారు. ఈ ప్రాంతం ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లో ఉంటుంది. దీనిపై టప్పాల్ శ్యాంప్రసాద్ 2007లో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

**2004, అక్టోబరులో ఓ రోజు రాత్రి...**

డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నిద్రలో నుంచి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎందుకంటే భూకంపం వచ్చిందా.. అన్నంతగా పెద్దశబ్దం రావడంతో...

ఎంతమాత్రం కాదు.. ఓబుళాపురం కొండల్లో నాణ్యమైన ఇనుప ఖనిజం తవ్వడానికి అడ్డుగా ఉన్న సుంకులమ్మ ఆలయాన్ని పేల్చి వేయడంతో.. ఈ విషయం మరుసటిరోజు తెలిసింది. అప్పటి నుంచి ఆయా గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకులేకుండా పోయింది.

**ఎందుకు..**

ప్రకృతితో పెట్టుకుని.. అక్రమంగా కొండలనే కొల్లగొట్టి.. కోట్లకు పడగలెత్తడంతో.. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇష్టారాజ్యంగా ఇనుప ఖనిజం తరలించడం.. డి.హీరేహాళ్ నుంచి కృష్ణపట్నం దాకా టిప్పర్ల దూకుడు.. దారి పక్కన గ్రామాల రోడ్లు కనుమరుగై.. ఎంతోమంది అమాయకులు మట్టిలో కలిసిపోయారు. ఎంతటి రాక్షసుడికైనా అంతం తప్పదన్నట్లుగా... ఓబుళాపురం మైనింగ్ కంపెనీ యజమాని గాలి జనార్దన్‌రెడ్డి పాపం పండింది. న్యాయస్థానం శిక్ష విధించింది.

**అక్రమాలపై పోరాటం**

అప్పట్లో ప్రతిపక్షం తెదేపా పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టింది. తెదేపా నాయకుల బృందం 2007, జులై 22న ఓబుళాపురం పరిశీలనకు వచ్చింది. కాలవ శ్రీనివాసులు, పయ్యావుల కేశవ్, పరిటాల సునీత, పల్లె రఘునాథ్‌రెడ్డి, హనుమంతరాయచౌదరి, మెట్టు గోవిందరెడ్డితో పాటు ప్రస్తుత తెలంగాణకు చెందిన నాగం జనార్దన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులను రాయదుర్గంలోనే పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. 23, 24 తేదీల్లోనూ తెదేపా నాయకుల ఆందోళనలు కొనసాగాయి. పోలీసుల నిర్బంధాలను దాటుకుని ఎట్టకేలకు తెదేపా నాయకులు ఓబుళాపురం మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు.

# పేదల స్థలాల్లో గుంట నక్కలు



గుత్తి: గుత్తి పురపాలికలో పేదలకు ప్రభుత్వం ఇస్తున్న నివాస స్థలాల్లో నాయకులు వాటాలు పంచుకుంటున్నారు. పట్టణంలో ఎక్కువగా అసైన్డ్ భూములు, స్థలాలు ఉన్నాయి. ప్రైవేట్ భూములు తక్కువగా ఉన్నాయి. ఇదే అదునుగా భావించిన కొందరు ప్రభుత్వ భూములను గుర్తిస్తూ అక్రమిస్తున్నారు. కొందరు నాయకులు రెవెన్యూ అధికారులు వద్ద ఉండాల్సిన దస్త్రాలు తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ఇంకొందరు రెవెన్యూ సిబ్బంది సహకారంతో డైగ్లాట్లు, ఎఫ్‌ఎంబీలను తీసుకున్నారు. ఆయా దస్త్రాలను తమ వద్ద ఉంచుకుని ఎంచక్కా రూ.కోట్లు విలువైన స్థలాలు కాజేస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి**

సర్వేనంబర్ 609లో ప్రభుత్వం సుమారు 400 మంది పేదలకు నివాస స్థలాలు ఇచ్చింది. వీటిలో వాటిలో వైకాపాకు చెందిన ఓ నాయకుడు 10 సెంట్లు స్థలాన్ని పొందాడు. ఎంచక్కా పేదల కాలనీలో ఆయన పెద్ద భవంతి నిర్మించాడు. ఇలాగే పోరాటాలు చేసి తాము ప్రభుత్వం నుంచి పేదలకు నివాస స్థలాలు వచ్చేలా పాటుపడ్డామని చెబుతూ మరో ముగ్గురు నాయకులు వాటాలు పొందారు. ఆ ప్లాట్లను తమకు ఇష్టం వచ్చిన వారికి విక్రయించారు.

సదరు నాయకులు ఓ స్టాఫ్ నర్సుకు కూడా స్థలాన్ని ఇచ్చి ప్రయోజనం పొందారు. తమ వద్ద ఖాళీ స్థలాలు ఉంచుకుని తమకు అవసరమైనప్పుడల్లా అమ్ముకుంటూ వచ్చారు. నాయకులు స్థలాల్లో ఇళ్లను నిర్మించుకుని తమ వాటా కింద వచ్చిన స్థలాలను విక్రయిస్తున్నారు. ఓ పార్టీకి చెందిన నాయకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి చేయగా ఆయన సుమారు 40 పట్టాలు మంజూరు చేశారు. ఆ పట్టాలను దస్త్రాలు లేకుండానే కట్టబెట్టారు. సర్వేనంబర్ 515లో దివ్యాంగులకు 15 ఏళ్ల కిందట నివాస స్థలాలు ఇవ్వగా గత ఏడాది ఓ ప్రజాప్రతినిధి కుమారుడు 10 సెంట్లు స్థలాన్ని తీసుకున్నాడు. ఓ మహిళా నాయకురాలు సైతం నాలుగైదు ప్లాట్లు ఒకే చోట తన కుటుంబీకుల పేర్లతో తీసుకుని ఇంటి నిర్మాణాలు చేపట్టారు.

తాజాగా సర్వేనంబర్ 321లోని నాలుగు ఎకరాల స్థలాన్ని కొందరు ఆక్రమించగా ఓ నాయకుడు తనకు 60 ప్లాట్లు ఇవ్వాలని మెలికపెట్టాడు. అదనంగా మరో రెండు ఎకరాల భూమిని కూడా ఆయన చెట్లు తొలగించి శుభ్రం చేయించాడు. చెట్లు తొలగించేందుకు రూ.లక్ష ఖర్చు అయిందని, ఆసొమ్మును తనకు ప్రజలతో వసూలు చేసి ఇవ్వాలని చెబుతున్నాడు.

సర్వేనంబర్ 644-3లో 4.60 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా వైకాపా ప్రభుత్వ హయాంలో ఓ నాయకుడు తన వాటా కింద కొన్ని ప్లాట్లు తీసుకోగా వరుస కథనాలు ప్రచురించడంతో ఆక్రమణలు ఆగిపోయాయి. ఇప్పుడు కొందరు నాయకులు ఆస్థలాన్ని శుభ్రం చేయించే పనిలో ఉన్నారు.**ప్రభుత్వ స్థలాలను సంరక్షిస్తాం**

గుత్తిలో ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తాం. ఇప్పటికే వీఆర్వోలకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ఆక్రమణలు జరిగితే మిమ్మల్నే బాధ్యులుగా చేస్తామని సిబ్బందిని హెచ్చరించాం. ప్రభుత్వ స్థలాలకు కంచె ఏర్పాటు చేస్తాం. ఆక్రమణలు ఎక్కడున్నా గుర్తించి తగు చర్యలు తీసుకుంటాం. ఓబులేశు , తహసీల్దారు, గుత్తి

# తప్పులుంటే సరిచేసి.. అర్హతకే పీటవేసి..

అనంతపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందే సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించింది. అందులో అన్నదాత సుఖీభవ పథకం ఒకటి. ఈ నెలాఖరుకు అన్నదాతల ఖాతాలకు జమ చేసేందుకు సన్నాహాలు ప్రారంభించింది. అందులో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని వెబ్‌ల్యాండ్‌కు అనుసంధానం చేశారు. అందులో మరణించినవారు, ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షన్ పొందేవారు, ఆదాయపు పన్ను చెల్లించేవారి వివరాలన్నీ వెబ్‌ల్యాండ్‌కు అనుసంధానం చేసి తొలగించాలని వ్యవసాయ, రెవెన్యూశాఖకు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. వెబ్‌ల్యాండ్‌లో సర్వే నంబర్లు, రైతు పేరు, విస్తీర్ణం, కచ్చితంగా ఉన్నాయా? లేదాన్నది తహసీల్దార్లు పరిశీలించాలి. ఏమైనా తప్పులుంటే సరిచేసి, ప్రభుత్వానికి నివేదించాలి. రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) వారీగా వెబ్‌ల్యాండ్ డేటాను వీఏఏలు, వీఎస్‌ఏలు, వీహెచ్‌ఏల లాగిన్లకు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. అన్నదాత సుఖీభవ పథకానికి కొత్తగా వెబ్‌సైట్ రూపకల్పన చేయడానికి కసరత్తు ప్రారంభించింది. రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు, డివిజన్, మండలస్థాయి అధికారులకు వెబ్ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఆయా జిల్లాల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. అర్హులైన ప్రతి రైతుకు సాయం అందేలా చూడాలని రాష్ట్ర అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**ఉమ్మడి జిల్లాలో 5,76,972 మంది రైతులు**

అన్నదాత సుఖీభవ పథకం అమలులో భాగంగా గతంలో రైతు భరోసా పథకం





కింద ఉన్న గణాంకాల ప్రకారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5,76,972 మంది రైతులు ఉన్నారు. వారిలో అనంతపురం జిల్లాలో 2,89,114 మంది రైతులు ఉండగా శ్రీసత్యసాయి జిల్లాలో 2,87,858 మంది రైతులు ఉన్నారని ఆయా జిల్లాల వ్యవసాయాధికారులు నివేదించారు. వెబ్‌ల్యాండ్ డేటా సరిచేసిన తర్వాత ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనర్హులుంటే తొలగించి, అర్హులను అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేస్తారని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు తెలిపారు.

# మీటరు తిరిగింది.. నియంత్రిక కాలింది

చిత్తూరు : జిల్లాలో తీవ్రమైన ఎండలు.. పెరిగిన ఉక్కపోతతో విద్యుత్తు వినియోగం మరింతగా పెరిగింది. గృహ, వ్యవసాయ సర్వీసుల విద్యుత్తు వాడకం పెరగడంతో ఉప కేంద్రాలు, నియంత్రికలపై అధిక లోడు ఫలితంగా నియంత్రికలు దగ్ధమవుతున్నాయి. ఏప్రిల్ నెలలోనే జిల్లాలో సుమారు 622 నియంత్రికలు దగ్ధమైనట్లు జిల్లా విద్యుత్తు శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**శరవేగంగా మరమ్మతులు**

జిల్లాలో చిత్తూరు, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో నియంత్రికల మరమ్మతు కేంద్రాలున్నాయి. మార్చి నెలలో చిత్తూరు నియంత్రికల మరమ్మతు కేంద్రానికి 355, పలమనేరుకు 125, పుంగనూరుకు 165 నియంత్రికలు తరలించారు. అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం విద్యుత్తు శాఖ ప్రక్షాళనకు దృష్టి సారించింది. లో ఓల్టేజి, సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాల్లో అదనపు నియంత్రికలు, కొత్త లైన్ల ఏర్పాటు చేస్తున్నారు. నియంత్రికల మరమ్మతులకు అవసరమైన పరికరాలు, తీగలు, ఆయిల్ వంటి సామగ్రి కొరత



లేకుండా అందుబాటులో ఉంచారు. కేంద్రాలకు తరలిస్తున్న నియంత్రికలను సత్వరమే మరమ్మతులు చేసి రైతులకు అందజేస్తున్నామని జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు.

**వైకాపా నిర్లక్ష్య ఫలితమే**

ఐదేళ్ల వైకాపా పాలనలో విద్యుత్తు లైన్లు, ఉప కేంద్రాల నిర్వహణ పట్టించుకోలేదు. అయితే నిర్వహణ పేరుతో పనులు చేపట్టకనే వైకాపా పెద్దలు, గుత్తేదారులు నిధులు స్వాహా చేశారనే ఆరోపణలున్నాయి. లో ఓల్టేజి సమస్యలున్న ప్రాంతాల్లో అదనపు లైన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, నియంత్రికలను అమర్చలేదు. కేవలం అప్పటి విద్యుత్తు శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు నియోజకవర్గంలోనే అవసరం లేనప్పటికీ ఇష్టానుసారంగా ఉప కేంద్రాల ఏర్పాటుతో రూ.కోట్ల నిధులు దుర్వినియోగం చేశారని ఆ శాఖ అధికారులే బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో ఉప కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనల దశలోనే ఆగిపోగా విద్యుత్తు లైన్ల నిర్వహణ మరిచిపోయారు. నిర్లక్ష్యం ఫలితంగా పూతలపట్టు, ఎస్ఆర్‌పురం, పాలసముద్రం, పెనుమూరు, ఐరాల, నగరి, విజయపురం యాదమరి, గంగవరం, బైరెడ్డిపల్లె తదితర మండలాల్లో ప్రస్తుత వేసవిలో సరఫరాలో అంతరాయాలు, లో ఓల్టేజి సమస్యలు అధికంగా ఉన్నాయి.

జిల్లాలోని సర్వీసుల వివరాలు (లక్షల్లో)

విద్యుత్తు: 7.35

గృహ : 4.96

వ్యవసాయ : 1.92

# పత్తి సాగుపై రైతుల అనాసక్తి

బి.కోడూరు : పత్తి పంట సాగుపై రైతులు ఆసక్తి చూపడంలేదు. పత్తి పైరుకు తెగుళ్లకు మందులు, ఎరువులు, సేద్యాలు, కూలీల ఖర్చు అన్నీ పోను పైరు బాగా పండితే మిగిలేది ఎకరాకు రూ.20వేలు మాత్రమే.బి.కోడూరు మండలంలో ప్రతి సంవత్సరం పత్తి దాదాపు 7వేల ఎకరాలు పైనే సాగు చేసేవారు. రాను రాను పెట్టుబడి ఎక్కువ కావడం, రోగాలు అధికంగా రావడం, వాటికి సరైన మందులు పిచి కారి చేసేందుకు సరైన సలహాలు అందించలేని అధికారులతో రాను రాను సాగు గణనీయంగా తగ్గిపోయింది. ఈ సంవత్సరం మండలం 50ఎక రాలలోపే పత్తి సాగు చేశారు. పత్తిపైరు నవంబ రు, డిసెంబరులో సాగు చేస్తే ఏప్రిల్, మేలో కోత లకు వస్తుంది. ఆ సమయంలో ఎండలు ఎక్కువ కావడం, కూలీలు దొరక్కపోవడం, సరైన రేటు లేకపోవడంతో రాను రాను రైతులు పత్తి సాగుపై ఆసక్తి చూపడంలేదు. దీంతో మండలంలో పత్తి సాగు పూర్తిగా కనుమరుగయ్యేటట్లు ఉంది.

**ఎండలు ఎండలు.. దొరకని కూలీలు**

ఏప్రిల్, మే మాసంలో పత్తి పంట కోతకు వస్తుం ది. అయితే మంచి ఎండలు , కూలీలు దొరక్క పోవడం, కూలీలు వచ్చినా అధిక రేటు కూలీ చెబుతుండడంతో పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అష్టకష్టాలు పడి పత్తి పండిం చుకున్నా తీరా రేటు దగ్గరకు వచ్చేసరికి పెట్టుబ డి కూడా రానంతగా ఈ దళారులు చేస్తుండడం తో పూర్తిగా పత్తిని ఆపివేశారు.

**తెగుళ్లు ఉన్నా .. పర్యవేక్షణ సున్నా**

పత్తి పూత, పిందె దశకు వచ్చేసరికి అధికంగా తెగుళ్లు సోకడం, రైతులు తెలిసీ తెలియని మం దులు తీసుకువచ్చి పిచికారి చేయడంతో దిగుబ డులు పూర్తిగా తగ్గిపోయాయి. అధికారులు రైతు లకు సరైన సమయంలో సలహాలు అందించి వచ్చిన రోగాలకు సరైన మందులు పిచికారి చేసే విధంగా అవగాహన కల్పించడంలో విఫలమవ డంతో రైతులు పత్తిపై ఆసక్తి చూపడంలేదు.

**పెట్టుబడి భరించలేక పత్తిసాగు తగ్గించారు**

పత్తి పంట సాగునకు పెట్టుబడి ఎక్కువగా ఉండడంతో రైతులు పంట సాగు తగ్గించారు. అలాగే కూలీల కొరత రైతులకు ఇబ్బందికరంగా మారింది. ఇది కూడా పంట సాగు విస్తీర్ణం తగ్గడానికి మరో కారణంగా చెప్పవచ్చు. -కౌశిక, వ్యవసాయాధికారి, బి.కోడూరు

**ఏటా పది ఎకరాలు పత్తి సాగు చేసేవారం**

ప్రతి సంవత్సరం పత్తి 10 నుంచి 15 ఎకరాల వరకు సాగు చేసేవారం. రాను రాను విత్తనాల ఖర్చు ఎక్కువ కావడం, రాను రాను రోగాలు అధికంగా రావడం, దిగుబడి తగ్గు తుండడంతో పత్తిని పూర్తిగా సాగు చేయకుండా మానేశాం. ప్రస్తుతం సజ్జ, మొక్కజొన్నలాంటి పంటలు వేసు కుంటున్నాం. కనీసం క్వింటా రూ.10వేలు అమ్మితే రైతుకు కాస్తో కూస్తో పెట్టుబడి పోను మిగులు తుంది. దీంతో పత్తిని పూర్తిగా మానివేశాం.

- దుగ్గిరెడ్డి. రైతు, ఐత్రంపేట

# శ్రీలీల.. 'గేమ్ ఛేంజర్' గా మారాల్సిందే!!

టాలీవుడ్ హీరోయిన్, క్యూట్ బ్యూటీ శ్రీలీల గురించి అందరికీ తెలిసిందే. యంగ్ హీరో రోషన్ పెళ్లి సంద%ణ% సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి హీరోయిన్ గా పరిచయమైన శ్రీలీల.. అతి తక్కువ సమయంలోనే వేరే లెవెల్ పాపులారిటీ సంపాదించుకుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. ఏకంగా స్టార్ హీరోయిన్ స్టేటస్ దక్కించుకుంది అమ్మడు. అందం, అభినయంతో ఓ రేంజ్ లో అలరించే శ్రీలీల టాలెంట్ కోసం ఎంత చెప్పినా తక్కువే. డ్యాన్స్ విషయంలో తోప్ అని చెప్పాలి. తన స్టెప్పులు, ఎక్స్ప్రెషన్స్ తో సింపుల్ గా అదరగొట్టేస్తుంది. రీసెంట్ గా బ్లాక్ బస్టర్ హిట్ మూవీ పుష్ప-2లో కిస్సిక్ సాంగ్ తో అందరినీ మెప్పించింది. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఓ ఊపు ఊపేసింది బ్యూటీ. అయితే పెళ్లిసందD మూవీ తర్వాత ధమాకాలో నటించిన శ్రీలీల.. మంచి హిట్ సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చిన అమ్మడు.. నెవ్వర్ బిఫోర్ అనేలా ఆఫర్స్ ను దక్కించుకుంది. కానీ సక్సెస్ రేట్ విషయంలో వెనుకంజలో ఉంది బ్యూటీ. ధమాకా తర్వాత సరైన హిట్ ఆమెకు ఇంకా దక్కలేదు. ధమాకా తర్వాత స్కంద, భగవంత్ కేసరి, ఆదికేశవ,



ఎక్స్ ట్రార్డినరీ మ్యాన్, గుంటూరు కారం, రాబిన్ హుడ్ వంటి సినిమాల్లో వరుసగా నటించింది. వాటిలో భగవంత్ కేసరి మంచి హిట్ అని చెప్పవచ్చు. కానీ ఆమె మూవీలో మెయిన్ హీరోయిన్ మాత్రం కాదు. బాలయ్య కుమార్తెగా కనిపించిన శ్రీలీల.. తన యాక్టింగ్ తో మెప్పించిందనే చెప్పాలి. గుంటూరు కారం భారీ అంచనాల మధ్య రిలీజై మంచి వసూళ్లను రాబట్టింది. కానీ టాక్ మాత్రం మిక్స్ డ్ గానే వచ్చింది. ఇప్పుడు పలు సినిమాల్లో నటిస్తున్న శ్రీలీల.. రీసెంట్ గా రాబిన్ హుడ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. యువ నటుడు నితిన్ హీరోగా నటించిన ఆ సినిమాను వెంకీ కుడుముల గ్రాండ్గా తెరకెక్కించారు. మంచి హిట్ అవుతుందని అంతా అనుకోగా.. కేవలం నవ్వులు మాత్రమే పంచుతున్నట్లు రివ్యూస్ వచ్చాయి. కంటెంట్ ఓకే అయినా.. ఇంకాస్త వర్క్ చేయాల్సి ఉందని అనేకమంది అభిప్రాయ పడ్డారు. దీంతో శ్రీలీలకు మళ్లీ సరైన హిట్ దక్కలేదని చెప్పవచ్చేమో. దీంతో ఇప్పుడు తన కెరీర్ ను ఫుల్ ట్రాక్ లో పెట్టాల్సి అవసరం ఎంతైనా ఉంది. స్క్రిప్ట్ ఎంపికపై శ్రీలీల సీరియస్ గా దృష్టి పెట్టాలని పలువురు నెటిజన్లు సూచిస్తున్నారు. లేకుంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెబుతున్నారు. తన తదుపరి ప్రాజెక్టులు అటు కమర్షియల్ ఇటు కంటెంట్ పరంగా విజయం సాధించేలా చర్యలు తీసుకోవాలని అంటున్నారు. కొత్త స్క్రిప్ట్ లను సరైన రీతిలో ఎంచుకుని గేమ్ ఛేంజర్ గా మారాలని కోరుకుంటున్నట్లు చెబుతున్నారు. మరి చూడాలి శ్రీలీల కొత్త సినిమాలు ఎలా ఉంటాయో..

## ఇండస్ట్రీ తీరుపై చిర్రెత్తిపోయిన హాట్ లేడీ!

బాలీవుడ్ నటి రిచా చద్దా చిత్ర పరిశ్రమపై సంచలనం వ్యాఖ్యలు చేసింది. బాలీవుడ్ లో కొత్త వారికి అవకాశాలు ఇవ్వడం లేదని..వాళ్లలో వాళ్లకే ఛాన్సులిస్తున్నారని మండిపడింది. స్టార్ హీరో సినిమా ఫ్లాప్ అయితే అందరూ జాగ్రత్త పడతారు. తర్వాత ఎలా పనిచేయాలని ఆలోచన చేసుకుంటారు. అదే కొత్త వాళ్లకు రాకారాక ఒక ఛాన్స్ వచ్చి ఫెయిలైతే? వాళ్లు ఇంటికెళ్లాల్సిన పరిస్థితులు దాపరిస్తున్నాయి. ఈ విషయంలో బాలీవుడ్ సౌత్ ఇండస్ట్రీలను చూసి నేర్చుకోవాలని సూచించింది. ఓ సినిమా పోయినా మరో సినిమాలో అవకాశం కల్పించడం అన్నది వాళ్లకే చెల్లింది. ఇల్లాగైతే బాలీవుడ్ లో కొత్త వాళ్లు ఎలా రాణించగలరని ప్రశ్నించింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. బాలీవుడ్ పై ఈ రకమైన ఆరోపణలు కొత్తేం కాదు. గతంలో చాలా మంది హీరోయిన్లు ఇలాంటి



ఆరోపణలు చేసారు. అలాగే బాలీవుడ్ లో లైంగిక వేధింపులు ఇప్పటను సారం జరుగుతున్నాయని..కాస్టింగ్ కౌచ్ లో భాగంగా వీటిని ప్రతి మహిళ ఎదుర్కోవాల్సి ఉంటుందని గతంలో చాలా మంది నటీమణులు ఆరోపించిన సంగతి తెలిసిందే. అలాగే సౌత్ సినిమాల సక్సెస్ ను చూసి బాలీవుడ్ నేర్చుకోవాల్సింది చాలా ఉందని అమితాబ్ బచ్చన్, అమీర్ ఖాన్ లాంటి దిగ్గజాలు కౌంటర్ వేసిన సంగతి తెలిసిందే. వరుసగా తెలుగు సినిమాలు పాన్ ఇండియాలో సత్తా చాటడంతో బాలీవుడ్ రేసులో వెనుకబడింది. చేసిన ప్రయత్నాలేవి కలిసి రావడం లేదు. నష్టాలు తప్ప లాభాలు తేవడం లేదు. ఈ క్రమంలోనే కొందరు హిందీ దర్శకులు సౌత్ కి వెళ్లి మేకింగ్ విధానం నేర్చుకోవాలంటూ అసహనం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి.




# కోటు జారవిడిచిన జాన్వీ వెంట పడ్డ ఫోటోగ్రాఫర్లు



ఫోటోగ్రాఫర్ల ముందు చెలరేగిపోవడంలో కపూర్ ఫ్యాషనిస్టా జాన్వీ తర్వాతే. తాజాగా లాక్మే ఫ్యాషన్ వీక్ 2025 లో జాన్వీ హవా మామూలుగా లేదు. కళ్లన్నీ జాన్వీపైనే..! మతి చెడే అందచందాలు.. అద్భుతమైన కాస్ట్యూమ్స్ లో జాన్వీ షో స్టాపర్ గా నిలిచింది. ర్యాంప్ పై అదిరిపోయే క్యాట్ వాక్ తో దూసుకొచ్చిన జాన్వీ వెంటపడి మరీ ఫోటోగ్రాఫర్లు పిచ్చెక్కి ఫోటోలు తీసారు.

అలా కోటు జారవిడిచి.. క్యాట్ వాక్ చేస్తున్న జాన్వీ రకరకాల భంగిమల్లో ఫోజులివ్వగా వాటిని క్యాప్చర్ చేసేందుకు యంగ్ ఫోటోగ్రాఫర్స్ గుంపుగా మీద మీదికి ఉరికారు. కపూర్ ఫ్యాషనిస్టా జాన్వీ.. రాహుల్ మిశ్రా గౌనులో లక్మే ఫ్యాషన్ వీక్ ర్యాంప్ పై మెరిసింది. బోల్డ్ వాక్ తో జాన్వీ కపూర్ కవ్విస్తుంటే ఫోటోగ్రాఫర్ల క్లిక్లు డ్రమటిక్ గా అనిపించాయి. స్టైల్ ఐకన్ జాన్వీ కపూర్ ఎక్కడికి వెళ్లినా అక్కడ మెరుపు ప్రత్యక్షమైనట్టే. తన మెరుపు.. గ్లామర్ను తనతో పాటు తీసుకువెళుతుంది... రాహుల్ మిశ్రా రన్ వే కూడా అందుకు భిన్నంగా లేదు. సాంప్రదాయ భారతీయ వస్త్రధారణకు ఆధునికతను అద్దిన సమకాలీన డిజైన్ ని మిశ్రా బృందం అందించారు. ఈ గౌన్ విచిత్రమైన ప్రకృతి దృశ్యాల మేళవింపుతో ఆకర్షణీయంగా కనిపించింది. జాన్వీ స్ట్రాప్లెస్ గౌనులో అందంగా కాన్ఫిడెంట్ గా తనను తాను ఆవిష్కరించుకుంది. తన బాడీ ఫిగర్ ని ఎలివేట్ చేసే గ్రేజింగ్ ప్యాటర్న్- ప్లంగింగ్ నెక్లైన్ ఆకట్టుకున్నాయి. ఇటీవల టాలీవుడ్ లో దేవర లాంటి పాన్ ఇండియన్ బ్లాక్ బస్టర్ లో నటించిన జాన్వీ తదుపరి రామ్ చరణ్ సరసన బుచ్చిబాబు చిత్రంలో నటిస్తోంది.

# బాలీవుడ్ సక్సెస్ఫుల్ సెలబ్రిటీ వ్యాపారవేత్తలు వీళ్లే




సినీ ఇండస్ట్రీలో ఉన్న సెలబ్రిటీల సంపాదన గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. బాలీవుడ్ లో ఇది ఇంకాస్త ఎక్కువగా ఉంటుంది. కేవలం సినిమాలతోనే కాకుండా బ్రాండ్ ఎండార్స్మెంట్స్ ద్వారా కూడా సెలబ్రిటీలు కోట్లలో సంపాదిస్తుంటారు. అయితే కొంతమంది సెలబ్రిటీలు అక్కడితో ఆగకుండా వ్యాపార ప్రపంచంలోకి కూడా అడుగుపెట్టి సక్సెస్ అవుతున్నారు. బాలీవుడ్ లో స్టార్ సెలబ్రిటీలందరికీ రకరకాల సైడ్ బిజినెస్ లు ఉండగా వారిలో దీపికా పదుకొణె, సల్మాన్ ఖాన్, కృతి సనన్, కత్రినా కైఫ్, అలియా భట్, ప్రియాంక చోప్రా, రణ్బీర్ కపూర్ మరియు హృతిక్ రోషన్ లు టాప్ లో ఉన్నారు. పలు రకాల బిజినెస్లతో జనాలను ఎట్రాక్ట్ చేస్తూ బాలీవుడ్ మోస్ట్ సక్సెస్ఫుల్ ఎంటర్ప్రెన్యూర్లుగా నిలుస్తున్నారు. దీపికా పదుకొనే కేవలం నటిగా మాత్రమే కాకుండా ఫిట్నెస్ ఔత్సాహికురాలిగా, ఫ్యాషన్ ఐకాన్ గా మంచి గుర్తింపు ఉంది. దీపికా తన క్రేజ్, అందానికి తగ్గట్టే 82ణీ%జు% అనే స్కిన్ కేర్ బ్రాండ్ ను మొదలుపెట్టి మంచి ఎంటర్ప్రెన్యూర్ గా పేరు తెచ్చుకుంది. దీపికా మొదలుపెట్టిన ఈ బ్రాండ్ కు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉంది. కండల వీరుడు సల్మాన్ ఖాన్ హీరోగానే కాకుండా నిర్మాతగా, బిజినెస్ మ్యాన్ గా పలు రంగాల్లో రాణిస్తున్నాడు. వివిధ బిజినెస్లతో పాటా కమర్షియల్ యాడ్స్ లో నటించి బాగా సంపాదిస్తున్న సల్మాన్, బీయింగ్ హ్యూమన్ పేరుతో క్లాథింగ్ బ్రాండ్ ను మొదలుపెట్టి అందులో సక్సెస్ అయ్యాడు. దీంతో పాటూ యాత్ర కంపెనీలో సల్మాన్ కు 5% వాటా ఉంది. హీరోయిన్ గా కృతి సనన్ ఇప్పటికే పలు సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చింది. పలు బ్రాండ్లకు ప్రమోషన్స్ చేస్తూ బాగా ఆర్జించిన కృతి రీసెంట్ గా మ్యాజిక్ మూమెంట్స్ వోడ్కా కు కూడా ప్రచారకర్తగా మారింది. వీటితో పాటూ కృతికి హైఫెన్ అనే బ్యూటీ కేర్ బ్రాండ్ ను స్టార్ట్ చేసి మోస్ట్ సక్సెస్ఫుల్ బిజినెస్ ఉమెన్ గా రాణిస్తోంది. బాలీవుడ్ బ్యూటీ కత్రినా కైఫ్ నైకా తో కలిసి కే బ్యూటీ అనే బ్యూటీ బ్రాండ్ ను మొదలుపెట్టింది. కెరీర్ స్టార్టింగ్ నుంచి మేకప్ పై ఎక్కువ ఇంట్రెస్ట్ ఉన్న కత్రినా లాంగ్ లాస్టింగ్ మేకప్ ఉత్పత్తులను అందిస్తూ తన బిజినెస్ లో సక్సెస్ఫుల్ గా కొనసాగుతుంది. అలియా భట్ 2020లో ఎడ్ ఎ మమ్మా బ్రాండ్ పేరుతో బిజినెస్ ను స్టార్ట్ చేసింది. ఇందులో పిల్లలు మరియు తల్లుల బట్టలు దొరుకుతాయి. ఈ బట్టలను పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలను వాడకుండా తయారు చేస్తారు. దుస్తులతో పాటూ పిల్లల బొమ్మలు వారికి అవసరమైన వాటిని కూడా ఎడ్ ఎ మమ్మా ద్వారా కొనుగోలు చేయొచ్చు. ఈ బ్రాండ్ అలియాకు ఏటా ఎంతో లాభాన్ని తెచ్చిపెడుతుంది. ఇక ప్రియాంక చోప్రా అనామలి అనే హెయిర్ కేర్ బ్రాండ్ ను స్థాపించి దాంతో బాగా సక్సెస్ అయింది. తక్కువ ధరలో మంచి నాణ్యతకలిగిన అందుబాటులో ఉండే ఉత్పత్తులను అందిస్తూ వస్తున్న ప్రియాంక తన బ్రాండ్ ఉత్పత్తుల కోసం సముద్రం నుంచి వెలికితీసిన ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేసి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుంది. అనామలి ద్వారా ప్రియాంక బాగానే సంపాదిస్తుంది. బాలీవుడ్ మోస్ట్ హ్యాండ్సమ్ హీరో రణ్బీర్ కపూర్ నటుడిగా ఎంతో బిజీగా ఉంటూనే మరోవైపు పలు బ్రాండ్లను ప్రమోట్ చేస్తున్నాడు. దీంతో పాటూ ఎప్పట్నుంచో తన పేరుతో సొంత బ్రాండ్ ను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఆర్క్స్ పేరుతో స్నీకర్ బ్రాండ్ ను ఏర్పాటు చేసి సక్సెస్ఫుల్ గా దాన్ని రన్ చేస్తున్నాడు. కహోనా ప్యార్ హై తో కెరీర్ ను స్టార్ట్ చేసిన హృతిక్ రోషన్ కు HRX అనే ప్రముఖ స్పోర్ట్ క్లాథింగ్ బ్రాండ్ ఉంది. దీని ద్వారా హృతిక్ కు భారీ ఆదాయం సంపాదిస్తున్నాడు. దీంతో పాటూ హృతిక్ కు కల్ట్ అనే జిమ్ కూడా ఉంది.

# కిల్లింగ్ లుక్స్తో మిల్కీ బ్యూటీ

మిల్కీ బ్యూటీ తమన్నా ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు కావస్తుంది. 2005లో శ్రీ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించడంతో పాటు ఎన్నో ప్రత్యేక పాటల్లోనూ నటించిన విషయం తెల్సిందే. హీరోయిన్గా మిల్కీ బ్యూటీ ఈమధ్య కాస్త స్లో అయినప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఈమె ఇప్పటికీ వరుసగా సినిమాలు చేయడంతో పాటు వెబ్ సిరీస్ల్లో నటించడంతో పాటు మ్యూజిక్ వీడియోలను సైతం వదలడం లేదు. ఈమె చేసిన ఐటెం సాంగ్స్కి మంచి స్పందన వచ్చిన నేపథ్యంలో ముందు ముందు మరిన్ని చేసే అవకాశాలు ఉన్నాయి. సినిమాలు, వెబ్ సిరీస్లు ఇలా అన్ని చోట్ల తన ప్రతిభను చూపిస్తూ తమన్నా ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతూనే ఉంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్తో సినిమాల్లో నటించడం ద్వారా ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతూ వస్తుంది. స్కిన్ షో చేసిన పాత్రలతోనే కాకుండా నటనకు ఆస్కారం ఉన్న పాత్రల్లోనూ నటించడం ద్వారా తమన్నాకు మంచి గుర్తింపు దక్కింది. ప్రస్తుతం ఈమె ఓదెల



2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. ఆ సినిమాలో లేడీ అఘోరి పాత్రలో నటించడం ద్వారా సర్ప్రైజ్ చేయబోతుంది. అఘోరి పాత్రలో నటించేందుకు తమన్నా ఎలా ఒప్పుకుందంటూ కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఇలాంటి ఫోటో షూట్స్తో తమన్నా సోషల్ మీడియాలో సందడి చేస్తూనే ఉంటుంది. ఈసారి మిల్కీ బ్యూటీ కవ్వించే చూపులతో చంపేస్తోంది. వయసు పెరిగినా కొద్ది తమన్నా మరింత అందంగా కనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయిలో మిల్కీ బ్యూటీ అందంగా కనిపిస్తున్న నేపథ్యంలో స్టార్ హీరోలు ఈమెను ఎందుకు పట్టించుకోవడం లేదు అంటూ కొందరు ఆమె అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పదేళ్ల పాటు తమన్నా వరుసగా సినిమాలు చేసేంత సత్తా ఉంది. స్టార్ హీరోలకు పోటీగా ఆమె డాన్స్ చేయగలదు, కొత్త హీరోయిన్స్కి పోటీగా అందంగా కనిపించగలదు అంటూ ఈ ఫోటోలు చూస్తే నిరూపితం అవుతుందని నెటిజన్స్ అంటున్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా ముందు ముందు బాలీవుడ్లోనూ బిజీ కావడం కోసం ప్రయత్నాలు చేస్తుంది. వెబ్ సిరీస్ల్లో నటించడం ద్వారా నటిగా తనలోని కొత్త యాంగిల్ను ప్రేక్షకుల ముందు పెట్టే ప్రయత్నాలు చేస్తుంది. మొత్తంగా తమన్నా ఇండస్ట్రీలో మరో పదేళ్ల పాటు ఇదే జోష్తో కొనసాగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అందమైన తమన్నా ఫోటోలు ఎప్పుడు ఇన్స్టాలో షేర్ చేసినా వైరల్ అవుతాయి. ఈసారి కూడా మిల్కీ బ్యూటీ తమన్నా తన అందంతో వైరల్ అవుతోంది. ఆకట్టుకునే అందంతో పాటు స్టైలింగ్ విషయంలో తమన్నా ఎప్పుడూ జాగ్రత్తగా ఉంటుంది. ఈసారి కూడా బ్లాక్ డ్రెస్లో మెరిసి పోతున్న తమన్నాకి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు.

## ఐటం పాటల్లో శ్రీలీల.. కిసిక్ బ్యూటీ కండీషన్ అప్లై!

కిసిక్ పాటతో శ్రీలీల పాన్ ఇండియాలో ఎంత ఫేమస్ అయిందో చెప్పాల్సిన పనిలేదు. ఒక్కు పాట అమ్మడిని రాత్రికి రాత్రే ఫేమస్ చేసింది. ఎంతో మంది భామలున్నా ఆ ఛాన్స్ సుకుమార్ కేవలం శ్రీలలు మాత్రమే ఇచ్చాడు. అమ్మడు కూడా ఆ నమ్మకాన్ని అంతే నిలబెట్టుకుంది. మాస్ అప్పిరియన్స్ తో కుర్రకారు హృదయాలు దోచేసింది. కిసిక్ లాంటి పాటలు చేయాలంటే? అది శ్రీలీలతో మాత్రమే సాధ్యమవుతుందని ఒక్క పాటతోనే పాన్ ఇండియాకి చాటి చెప్పింది. పుష్ప-2తో అంతటి సంచలనాన్ని నమోదు చేసింది. అయితే ఆ పాట తర్వాత చాలా మంది తనని ఐటం పాటల్లో నటించమని అడిగారుట. అడిగినంత పారితోషికం చెల్లించడానికి రెడీగా ఉన్నారంట శ్రీలీల. తాను ఎస్ చెప్పాలే గానీ కోట్ల రూపాయలు తన అకౌంట్ లో జమ అవుతాయని తెలిపింది. కానీ వచ్చిన చాలా అవకాశాలు ఇష్టం



లేక వదులుకున్నానంది. కేవలం కొన్ని సినిమాల్లో మాత్రమే అలాంటి పాటల్లో నర్తిస్తానని...డబ్బులిస్తారని ఏ సినిమా పడితే ఆ సినిమాలో అలాంటి పాటల్లో నటించనని తేగేసి చెప్పిందిట. ఐటం పాటల్లో నటించిన తనకంటూ కొన్ని కండీషన్లు ఉన్నాయని...వాటికి లోబడే పని చేస్తానని తెలిపింది. జాతీయ స్థాయి సినిమా చిత్రాల్లో నటించాలనే ఆశను వ్యక్తం చేసింది. అలాంటి సినిమా అవకాశాలు వస్తే వదులుకోనని తెలిపింది. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగు అమ్మాయిగా తనని గుర్తిస్తున్నారంది. ఇతర భాషల్లో అవకాశాలు వచ్చినంత మాత్రాన తెలుగు సినిమాలకు దూరమవుతానని అనుకోవద్దు. తన మొదటి ప్రాధాన్యత తెలుగు సినిమాలేనని తెలిపింది. తెలుగుతో పాటు ఇతర భాషల అవకాశాల్ని బ్యాలెన్స్ చేస్తూ కెరీర్ లో ముందు కెళ్తానని స్పష్టం చేసింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M), DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536